


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 327 | బుధవారం | 28-10-2026 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00





ఇజ్రాయెల్‌లో భారీ పోలింగ్ 08




- ఓట్లు కోల్పోయిన ఓటర్లకు సంఘీభావం
- జంతర్ మంతర్ ప్రజావేదికను తిరిగి తెరవాలి
- సర్ ప్రక్రియను నిలిపివేయాలి
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్
- ప్రజావిశ్వాసం కోల్పోయిన జ్ఞానేశ్‌కుమార్‌కు పదవిలో కొనసాగే నైతికహక్కు లేదని విమర్శ

'జంతర్ మంతర్ అనేది ప్రజలు తమ ప్రజాస్వామ్య బద్ధమైన నిరసన హక్కును ప్రతిబింబించే ఒక చారిత్రక ప్రదేశం. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా అసమ్మతి వ్యక్తం చేయకుండా అడ్డుకునేందుకు ఈ ప్రదేశంలో అనుమతి నిరాకరించడం అంటే,ప్రజా ఉద్యమాలపట్ల ప్రభుత్వానికి ఎంతగా అసహనం పెరిగిపోయిందో అర్థమవుతోంది. ప్రజల నిరసన హక్కును ఒక పద్ధతి ప్రకారం అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

– డి.రాజా

# సిఇసి జ్ఞానేశ్ రాజీనామాకై సిపిఐ భారీ మానవహారం

## ఢిల్లీలోని అజయ్ భవన్ నుంచి ఐటిఒ వరకు వేలాదిమందితో నిర్వహణ

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ చాటున పేర్లు తొలగించిన ఓటర్లకు సంఘీభావంగా భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) న్యూఢిల్లీలో వేలాదిమందితో అపూర్వస్థాయిలో భారీ మానవహారం నిర్మించింది. మంగళవారం వేలాదిమంది కార్యకర్తలు, పార్టీ నాయకులు, పౌర సంఘాలు,సంస్థలు పాల్గొన్న ఈ మానవహార కార్యక్రమానికి ప్రజల నుండి అఖండమైన స్పందన లభించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఇతర ప్రజా డిమాండ్లు పరిష్కరించాలని సిపిఐ కోరింది. నిష్కారణంగా ఓట్లు కోల్పోయిన ఓటర్లకు సంఘీభావం ప్రకటిస్తూ సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్ నుండి ఐటిఓ వరకూ వేలాదిమంది ఈ మానవహారాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ, జ్ఞానేశ్ కుమార్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, ఇక ఎంత మాత్రం ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగే నైతిక హక్కు ఆయనకు లేదని, ఆ పదవిలో కొనసాగడం, ఎన్నికల ద్వారా పాలకులను నియమించుకునే ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద ప్రమాదమని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జంతర్ మంతర్‌ను ప్రజలకు నిరసన తెలియజేసే ప్రదేశాల జాబితానుండి తొలగించడాన్ని మానవ హారం తీవ్రంగా ఖండించింది. తక్షణం జంతర్ మంతర్‌ను తెరవాలని, ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ పేరుతో చేపట్టిన ప్రక్రియను వెనక్కు మళ్ళించాలని కోరుతూ వేలాదిమందితో చేతులు కలిపి సిపిఐ

తరువాయి 8లో



# రాష్ట్రంలో 365 కరువు మండలాలు

## 31 జిల్లాల్లో విలయం | ప్రభుత్వం జిఒ జారీ

- 111 మండలాల్లో తీవ్రం, 254 మండలాల్లో మధ్యస్థ కరువు
- ఎల్ నినోతో నైరుతి రుతుపవనాల్లో 17 శాతం లోటు వర్షపాతం
- ఆరు నెలల పాటు అమల్లో ఉత్తర్వులు
- బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీరు, పశుగ్రాసం అందించాలని ప్రభుత్వ ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో అతలాకుతలమైన తెలంగాణలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలలో 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఇందులో 111 మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా, 254 మండలాలను మధ్యస్థ కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఈ మేరకు రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ఈ నెల 24న జిఓ ఎంఎస్ నంబర్ 3ను జారీ చేసింది. నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుంచి ఆరు నెలల పాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని, పరిస్థితులు మెరుగుపడితే అంతకుముందే ఉపసంహరించవచ్చు. కరువు పరిస్థితులపై శాస్త్రీయ అంచనాలు, జిల్లా కలెక్టర్ల క్షేత్ర స్థాయి నివేదికలు, వివిధ శాఖల సాంకేతిక సమాచారాన్ని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కరువు ప్రభావిత మండలాల జాబితాలో లేని ప్రాంతాల్లోనూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే అదనపు నోటిఫికేషన్ ద్వారా మరిన్ని మండలాలను చేర్చవచ్చని ఉత్తర్వులలో ప్రభుత్వం పేర్కొంది. కరవు నిర్వహణ కోసం రూపొందించిన జాతీయ మాన్యువల్ (2016, 2020 వరకు సవరించినది) ప్రకారం ఖరీఫ్ కరవును అక్టోబర్ 30లోగా ప్రకటించాల్సి ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.

**111 తీవ్ర కరువు ప్రభావ జిల్లాలు :** తీవ్ర కరవు మండలాలు ఎక్కువగా దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని మొత్తం 13 మండలాలు తీవ్ర కరువు కేటగిరీలో ఉన్నాయి. నారాయణ పేట జిల్లాలో 13 మండలాలన్నీ తీవ్ర కేటగిరీ లోనే ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో

తరువాయి 8లో

జిల్లాల వారీగా కరువు మండలాల పూర్తి వివరాలు 07

ఎల్ నినో, కరువుపై నేడు అఖిలపక్ష భేటీ 08

# ప్రజా సమస్యలపై సమరశంఖం

- పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- పోరాటాల్లో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ




ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నేతలకు సిపిఐ రాష్ట్ర సమితి అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజా సమస్యలపై పోరాటాల్లో రాజీపడే ప్రసక్తే లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో రెండురోజులు పాటు జరిగిన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం ముగిశాయి. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ పరిస్థితులపై నేతలు చర్చించారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ,

తరువాయి 8లో

# ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో 'క్లైమేట్ ఛేంజ్'పై ప్రత్యేక సదస్సు

- 'ఎల్‌నినో ప్రభావం.. ప్రపంచ దేశాల అనుభవాల'పై చర్చ
- అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు




ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న 'ఇన్‌వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' ప్రధాన థీమ్‌తో పాటు 'క్లైమేట్ ఛేంజ్'ను ప్రత్యేక సబ్ థీమ్‌గా చేర్చాలని తెలంగాణ ముఖ్యమంత్రి నుముల రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల నిపుణులు హాజరయ్యే ఈ అంతర్జాతీయ సదస్సులో వాతావరణ మార్పులపై ఈ ప్రత్యేక సెమినార్ నిర్వహించాలని, వాతావరణ శాఖ నిపుణులతో పాటు వివిధ యూనివర్సిటీలు, సంబంధిత రంగాల్లో పని చేసే

తరువాయి 12లో

# కెటిఆర్, హరీశ్‌రావు ఇంకా భ్రమల్లోనే

- క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోవాలి
- తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చే అవకాశంలేదు
- నవంబర్ తర్వాత నేరుగా ఎన్నికలపైనే దృష్టి
- తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే
- టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

అధికారం కోల్పోయి రెండేళ్లు గడిచిపోయినా బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్‌రావు ఇంకా భ్రమల్లో ఉన్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోవడంలేదని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఇప్పటికైనా వారు వాస్తవాలను గ్రహించాలని సూచించారు. మాజీ సిఎం కెసిఆర్‌ను మేధావిగా భావించేవారమని, అయితే ఆయన ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై

తరువాయి 8లో

# తీరు మారకుంటే చర్యలు తప్పవు




- రెవెన్యూ ఉద్యోగులకు మంత్రి పొంగులేటి హెచ్చరిక
- సర్వే సమయంలో తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో రైతుకు చెప్పాలి
- సరిహద్దులకు సంబంధించిన వివరాలు పరిశీలించి వివరించాలని సూచన

ప్రజాపక్షం/సంగారెడ్డి

రెవెన్యూ ఉద్యోగులు సక్రమంగా బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల, ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను అదేశించినప్పటికి పూర్తి స్థాయి ఫలితాలు కనిపించలేదని, భవిష్యతులో మార్పు రాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నాడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పని తీరుపై సంగారెడ్డి జిల్లా పరిషత్ మీటింగ్‌హాలులో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులతో మంత్రులు దామోదర రాజనర్సింహ,

తరువాయి 8లో




# ఆసక్తిదాయకంగా అమెరికా మధ్యంతర ఎన్నికలు

నవంబర్ 3. అమెరికా ప్రతినిధుల సభ, సెనేట్‌కు మధ్యంతర ఎన్నికలు. సర్వసాధారణంగా పాలకపార్టీకి అనుకూలంగా ఉండే ఈ ఎన్నికలు ఈ పర్యాయం డోనాల్డ్ ట్రంప్ పాలన పుణ్యమా అని అనేక అనిశ్చితులతో మరింత ఉత్కంఠభరితంగా మారాయి. ఈ చివరివారం ప్రచారం ఉధృతస్థాయికి చేరుతోంది. ఒకవైపు రిపబ్లికన్‌ల తరపున అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నగర యాత్రలతో పార్టీ శ్రేణులను ఉత్తేజితం చేస్తుండగా, రెండోవైపున ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ నేతలు ఆర్థిక వ్యవస్థ నిర్వహణ తీరుపట్ల ముఖ్యంగా నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగం పట్ల ప్రజల్లోని అసంతృప్తిని కాంగ్రెస్‌పై అజమాయిషీ సాధించే నిమిత్తం ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందువల్ల నవంబర్ 3ఎన్నికలు ప్రతినిధుల సభపై నియంత్రణతోపాటు సెనేట్ (ఎగువసభ – మూడవ వంతు సీట్లకు ఎన్నికలు)లో ఆశ్చర్యకరమైన మార్పుకు దారితీయవచ్చు. సెనేట్‌లో ప్రస్తుతం రిపబ్లికన్‌లకు 53–47 మెజారిటీ ఉంది. అధ్యక్ష పదవి, రెండు కాంగ్రెస్ ఛాంబర్లు రిపబ్లికన్‌ల చేతిలో ఉన్నందున పరిపాలనపై వారిదే ఆధిపత్యం. ప్రభుత్వంపై ఇతోధిక నియంత్రణకు మధ్యంతర ఎన్నికలు అవకాశం కల్పిస్తున్నాయని, దాన్ని ఓటర్లు ఉపయోగించుకుంటే ట్రంప్ మిగతా రెండేళ్ల పదవీకాలాన్ని కొంత నియంత్రణలో ఉంచ వచ్చని డెమొక్రాట్లు ప్రచారం చేస్తున్నారు.

ఆర్థికంగా ఉన్న అసంతృప్తి డెమొక్రాట్లకు అనుకూల ఓటుగా మారుతుందా? లేక రిపబ్లికన్‌ల అజమాయిషీని నిలుపుకునేందుకై ట్రంప్ తన మద్దతుదారులను తగినంతగా సమీకరించగలరా? అన్నది ప్రధానమైన ప్రశ్న. ట్రంప్‌గాని, పూర్వాధ్యక్షుడు బరాక్ ఒబామా గాని బ్యాలెట్ పేపర్‌లో లేరు. అయినా తమ రిపబ్లికన్, డెమొక్రాట్ అభ్యర్థుల విజయం కోసం దేశం నాల్గు చెరగులా సంచారం చేస్తున్నారు. అమెరికా ఎన్నికల్లో ఎన్నికల నిర్ణీత తేదీ కన్నా చాలారోజుల ముందునుంచే నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లో ఓటు చేసే వెసులుబాటు ఉంది. అసోసియేటెడ్ ప్రెస్ రిపోర్టు ప్రకారం అక్టోబర్ 26వ తేదీనాటికి 3కోట్లమందికి పైగా తమ బ్యాలెట్లు వేశారు. 2022 మధ్యంతర ఎన్నికల్లో దాదాపు అదే సమయానికి 90 లక్షల ఓట్లు మాత్రమే పోలైనాయంటే, ట్రంప్ దుందుడుకు విధానాల కారణంగా ప్రస్తుత ఎన్నికల్లో పెరిగిన ఆసక్తిని ప్రస్తుత ముందస్తు ఓటింగ్ ప్రతిబింబిస్తున్నది. టెక్సస్, కన్సాస్, ఓహియో, మయానె, నార్త్ కరోలినా తదితర రాష్ట్రాల్లో సెనేట్ పోటీలు పోటాపోటీగా ఉండటం కూడా ముందస్తు ఓటు పెరుగుదలకు హేతువవుతున్నది.

2024లో అధ్యక్ష ఎన్నికల్లో 155 మిలియన్ ఓటర్లు ఓటు చేశారు. ప్రస్తుత మధ్యంతర ఎన్నికల్లో 2022లో వలె 100మిలియన్‌లకుపైగా ఓటు చేయవచ్చని అంచనా. ఎన్నికల తేదీ సమీపించే కొలది జీవన వ్యయం పెరుగుదల ప్రధాన సమస్యగా ముందుకు వస్తున్నది. వంటింటి సరుకులు, ఇంటి అద్దెలు, ఇంధనం, హీటింగ్ (చలిని తట్టుకునేందుకు ఇళ్లలోపల వేడి పెంపుదల) ఖర్చులు ఇక రోజువారీ ఖర్చులు, సామాన్యులు భరించలేనివిగా తయారైనాయి. ఈ పరిస్థితులకు ట్రంప్ సుంకాల విధింపులు, ఇరాన్‌తో యుద్ధం ప్రధాన కారణాలు. డీజిలు భారం తగ్గించేందుకే ట్రంప్ రష్యాపై ఆంక్షలు సడలించి దిగుమతికి సిద్ధపడ్డాడు. కాగా తన చర్యలన్నీ అమెరికన్‌లకు మెరుగైన భవిష్యత్ కోసమేనని, కొంతకాలం ప్రజలు ఓర్మి వహించాలని ట్రంప్ విజ్ఞప్తులు చేస్తున్నాడు.

అమెరికన్ కాంగ్రెస్ ఎన్నికల్లో ధన వ్యయం అపారం. అభ్యర్థులు, పార్టీ కమిటీలు, సూపర్ పిఎసిలు, ఇతర రాజకీయ సంస్థలు టెలివిజన్ అడ్వర్టయిజింగ్, డిజిటల్ ప్రచారం, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, ఓటర్ల సమీకరణకు ఖర్చు పెట్టటంలో పోటీపడతాయి. ముఖ్యంగా సెనేట్ పోటీలు పోటాపోటీగా ఉన్నచోట్ల ధనం వెచ్చింపు మరీ ఎక్కువ. కొద్దిపాటి నిర్ణయాత్మక రాష్ట్రాల్లో ఓటర్లను ప్రభావితం చేయటానికి అభ్యర్థుల ప్రత్యక్ష ప్రచారం, టెలివిజన్ చర్చలు, భారీగా అడ్వర్టయిజ్‌మెంట్ ప్రచారానికి విరివిగా వెచ్చిస్తారు.

ఎన్నికల చివరి రోజులు మరీ కీలకం. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయటానికి ఓటర్లలో ఆసక్తిని రేకెత్తించటానికే ఎన్నికల ప్రచారాలు, విధానాలపై వాదోపవాదాల ప్రయోజనం. ఈసారి ఓటింగ్ శాతం పెరుగుతుందేమో వేచిచూడాలి. ద్రవ్యోల్బణం ఆందోళనలు, సుంకాలు, ఇంధన వ్యయం, కాంగ్రెస్‌పై కంట్రోలు – సమస్యలుగా ముందుకు వచ్చిన పరిస్థితుల్లో ఈ ఎన్నికల పర్యవసానాలు వ్యక్తిగత అభ్యర్థులను మించి ఉంటాయి. ఈ ఫలితాలు శాసన ప్రాధాన్యతలు, పరిపాలనపై పర్యవేక్షణ, ధరలపై అదుపు వంటి ప్రజల నిత్యజీవితాన్ని ప్రభావితం చేసే అంశాలతోపాటు, 2028 అధ్యక్ష ఎన్నికలకు రాజకీయ బలాబలాలపై కూడా ప్రభావం చూపుతాయి. అందువల్లనే రెండు పార్టీలు ఎన్నికల ప్రచారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి.

అమెరికాలో రాష్ట్రాలు రిపబ్లికన్(రెడ్), డెమొక్రాట్లు(బ్లూ) ప్లేట్స్‌గా రాజకీయంగా విడివడి ఉంటాయి. ఐదారు రాష్ట్రాలే స్వింగ్ స్టేట్స్‌గా అటు ఇటు మారుతూ ఎన్నికల అంతిమ ఫలితాన్ని నిర్ణయిస్తుంటాయి. రెండు పార్టీల కేంద్రీకరణ వాటిపైనే.



## యువత మైదానాలకు చేరువగా ఉండాలి

**యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోకుండా, క్రీడలు, వ్యాయామం వైపు అడుగులు వేయాలి. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యువతలో క్రీడాస్ఫూర్తి, శారీరక దారుఢ్యం పెంపొందించాల్సిన అవసరం ఉంది.తెలంగాణ క్రీడా శాఖ చేపట్టిన 'ఖేలో తెలంగాణ' కార్యక్రమంలో విద్యార్థులు, యువత నిరంతరం పాల్గొనాలి. క్రీడలు కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందించేందుకు దోహదపడతాయి**

– ఎంపి ఎం. అనిల్ కుమార్ యాదవ్




# సృజనను జోడిస్తూ యానిమేషన్ కళకు అందాలు అద్దుతున్న సాంకేతికత

మనకు సుపరిచితమైన స్పైడర్ మాన్, మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, ఫిలిమ్ అవతార్, బాహుబలి సినిమా, పౌరాణిక గాథల ఆనిమేషన్ చిత్రాలు లాంటి పాత్రల ప్రభావం మన మనసుల్లో సుస్థిరంగా నాటుకున్నాయి. షార్ట్ వాణిజ్య ప్రకటనలతో మొదలు పూర్తి నిడివిగల చలన చిత్రాల వరకు యానిమేషన్ కళకు సృజన జోడించి వినియోగించే స్థాయికి టెక్నాలజీ చేరడం సంతోషదాయకం. సమాజ శ్రేయస్సు కోరే పలు అంశాలను యానిమేషన్ కళలో ప్రత్యేకతలుగా, సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా, ఆకర్షణీయంగా తక్కువ సమయంలో గొప్ప భావాలను వ్యక్తం చేయవచ్చు.

28 అక్టోబర్ 1892లో తొలిసారి పారిస్‌లో యానిమేషన్ చిత్రం ప్రదర్శించడం జరిగింది. దీనికి గుర్తుగా యానిమేషన్ కళకు పెరిగిన అపార ఆదరణను దృష్టిలో ఉంచుకొని వాణిజ్య, చలనచిత్ర రంగాల్లో దాని ప్రాముఖ్యతను వివరించే సదుద్దేశ్యంతో ఇంటర్నేషనల్ ఆనిమేటెడ్ ఫిలిమ్ అసోసియేషన్ నేతృత్వంలో 2002 నుండి ప్రతియేటా 28 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ యానిమేషన్ డే)' పాటించుట జరుగుచున్నది. యానిమేషన్ కళకు సృజనను జోడించి నూతనత్వాన్ని ఆపాదించడం, యానిమేషన్ కళ వైపుకు యువతను ఆకర్షించడం, యానిమేషన్ ఆర్ట్ గూర్చి కార్యశాలలు నిర్వహించడం, యానిమేషన్ కళ వెనుక దాగిన వైజ్ఞానికశాస్త్రాన్ని వివరించడం, యానిమేషన్ కళలో నిష్ణాతులను సన్మానించడం లాంటి అంశాలను చర్చించేందుకు అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవ వేదికలను వినియోగించుకుంటారు.

**బహుళ ప్రచారం పొందుతున్న కళ:** ప్రపంచవ్యాప్తంగా యానిమేషన్ ప్రక్రియకు విద్య, వినోదం, వాణిజ్యం, మార్కెటింగ్, శాస్త్రీయ అవగాహన, సృజనశీల కళ, గేమింగ్, సిమ్యులేషన్, సినిమా, షార్ట్ ఫిల్మ్, మెడికల్, రిటైల్, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ లాంటి రంగాల్లో అనంతమైన అవకాశాలు, ప్రయోజనాలు ఉన్నాయి. నిజ జీవితాన్ని నకలు చేస్తూ బొమ్మల కదలికలతో చిత్రాలు తీయడాన్ని యానిమేషన్ నైపుణ్యకళ అంటారు. వాస్తవికతకు ఊహను జోడించి అందరికీ అర్థం అయ్యేలా సరళ, వినోదాత్మక చిత్రాల ద్వారా సందేశాన్ని ఇవ్వడం యానిమేషన్ ప్రత్యేకత. డిజిటల్ విప్లవం, అంతర్జాల ప్రభంజనం నేపథ్యంలో యానిమేషన్ కళకు అపార ఆదరణ లభించింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ముఖ్యంగా సినిమాలు, టివిల్లో యానిమేషన్ కళ ప్రవేశంతో ఆ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయు. అన్ని వర్గాల, వయసుల ప్రజలను ఆనిమేషన్ కళ ఆకర్షిస్తున్నది. యానిమేషన్ వీడియోలతో సందేశాలను సులభంగా ఇవ్వడం, ఊహాత్మక పరిధికి అవధులు లేకపోవడంతో సృజనశీలత పెరగడం, వైద్యరంగంలో వినియోగపడడం, ఆకర్షణీయంగా ఉండడం, సులభంగా అవగాహనకు రావడం, వాణిజ్య ప్రకటనలతో ఆకర్షించడం, తేలికగా వేగంగా ప్రజలకు చేరడం, లాంటి ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. ఆధునిక డిజిటల్ యుగపు యువత యానిమేషన్ కళ పట్ల ఆసక్తిని పెంచుకొని, ఆ రంగాన్ని తమ వృత్తిగా ఎంచుకొని, మరింత సృజనను జోడించి ప్రపంచ మానవాళికి నవ్య యానిమేషన్ దృశ్య రుచులను చూపుతారని ఆశిద్దాం.

(28 అక్టోబర్ 'అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవం' సందర్భంగా)

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# చిన్న దేశంలో విద్యార్థుల పెద్ద విజయం

భాషా సింగ్

చిన్న యూరోపియన్ దేశమైన సెర్బియాలో విద్యార్థుల నేతృత్వంలోని యువజన ఉద్యమం తీసుకువచ్చిన రాజకీయ మార్పు కలకలం సృష్టించింది. సెర్బియా చరిత్రలో తొలిసారిగా విద్యార్థులు, యువత నేతృత్వంలోని ''స్టూడెంట్ లిస్ట్' అనే సరికొత్త రాజకీయ బృందం ఆ దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. అతి తక్కువ సమయంలో ఈ రాజకీయ బృందం ఎన్నికలలో విజయం సాధించడం విశేషం. తమ ఎదుట ఉన్న రాజకీయ సవాళ్లను ఏవిధంగా ఎదుర్కొని ఈ యువ బృందం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందోనని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు, రాజకీయ విశ్లేషకులు నిశితంగా గమనిస్తున్నారు.

ఆగ్నేయ యూరప్‌లోని బాల్కన్ ప్రాంతంలో భాగమైన దాదాపు 66 లక్షల జనాభా కలిగిన సెర్బియా దేశం ప్రస్తుతం విద్యార్థులు, ప్రజాస్వామ్యం సాధించిన విజయం పట్ల సంబురాలు చేసుకుంటోంది. దాదాపు యూరప్ మొత్తాన్ని విద్యార్థి ఉద్యమాలు కుదిపేస్తున్న తరుణంలో, 2014 నుంచి సెర్బియా రాజకీయాలను శాసించిన అలెగ్జాండర్ వుచిచ్ రాజకీయ కూటమిని, అవినీతి సమస్య చుట్టూ నిర్మించబడిన విద్యార్థి ఉద్యమం ఓడించటం యూరోపియన్ రాజకీయాలపై సుదూర ప్రభావాలను చూపవచ్చు.

2024 నవంబర్ 1న నోవి సాద్ నగరంలోని రైల్వే స్టేషన్‌లో ఒక భాగం కూలిపోయి 16 మంది ప్రాణాలు కోల్పోవడంతో సెర్బియాలో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ప్రజలు, ముఖ్యంగా యువత, ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులలోని అవినీతే ఈ విషాదానికి కారణమని ఆరోపించి, అధికారుల నుండి జవాబుదారీతనాన్ని కోరారు. రైల్వే స్టేషన్ విషాదానికి సంబంధించిన పత్రాలను బహిరంగ పరచాలని, బాధ్యులపై చర్య తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉదాసీనత, కఠిన వైఖరి క్రమంగా ఈ ఉద్యమాన్ని విస్తృతమైన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలుగా మార్చాయి. విశ్వవిద్యాలయ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, నిపుణులు, సమాజంలోని ఇతర వర్గాల వారు కూడా ఈ నిరసనలలో భాగస్వాములయ్యారు. నిరసనకారుల డిమాండ్లను ఆలకించి, చర్చలలో పాల్గొనడానికి బదులుగా, వుచిచ్ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చేసి, అణచివేయడానికి ప్రయత్నించింది. ఈ ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీనికి విరుద్ధంగా, ఒక స్థానిక విషాదానికి వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసన దేశవ్యాప్త ఉద్యమంగా విస్తరించింది.

అవినీతి సమస్యపై మౌనం వహిస్తూ, విద్యార్థి ఉద్యమానికి విదేశీ శక్తుల మద్దతు ఉందని అధ్యక్షుడు వుచిచ్ ఆరోపించారు. నిరసన చేస్తున్న విద్యార్థులు ఏకమై 'స్టూడెంట్ లిస్ట్' అనే ఎన్నికల బృందాన్ని ఏర్పాటు చేశారు. తమతమ రంగాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ప్రజలు గౌరవించే సెర్బియన్ నిపుణులను, విద్యావంతులను ఇందులో చేర్చుకున్నారు. ఇది పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది.

ఈ ఉద్యమంలో అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే, విద్యార్థులు దీనిని కేవలం విశ్వవిద్యాలయాలకు, ప్రధాన నగరాలకు మాత్రమే పరిమితం చేయలేదు. వారు చిన్న పట్టణాలు,



గ్రామాలకు కూడా చేరుకుని, అవినీతి, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి సమస్యలను సామాన్య ప్రజల దైనందిన జీవితాలతో ముడిపెట్టారు. స్థిరపడిన రాజకీయ పార్టీల నాయకత్వంపై ఆధారపడకుండా, వారు తమ ఉద్యమం స్వతంత్ర అస్థిత్వాన్ని కాపాడుకున్నారు. ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు కూడా, వారు కేవలం విద్యార్థి నాయకులపైనే ఆధారపడకుండా, ఉపాధ్యాయులు, వైద్యులు, ఆర్థికవేత్తలు, ఇతర గౌరవనీయ నిపుణులను తమ బృందంలోకి చేర్చుకున్నారు. ఇది ఈ ఉద్యమానికి విస్తృత సామాజిక ఆమోదం లభించడానికి, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు అతీతంగా ఒక రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదగడానికి సహాయపడింది.

ఎన్నికల పర్యవసానంగా, గ్రాడ్యుయేట్లు, పిహెచ్‌డి పట్టభద్రులతో సహా అధిక సంఖ్యలో ఉన్నత విద్యావంతులైన యువకులు 'స్టూడెంట్ లిస్ట్' తరపున సెర్బియా పార్లమెంటుకు ఎన్నికయ్యారు. అక్టోబర్ 26 వరకు ప్రకటించిన ప్రాథమిక ఫలితాల ప్రకారం, సెర్బియన్ పార్లమెంటులోని 250 స్థానాలకు గాను స్టూడెంట్ లిస్ట్ 140 స్థానాలను కైవసం చేసుకుంది, సుమారు 52.71 శాతం ఓట్లను పొందింది. అధ్యక్షుడు వుచిచ్ తన రాజకీయ ఓటమిని అంగీకరించారు. అయితే, పార్లమెంటరీ ఎన్నికలలో ఓడిపోయినంత మాత్రాన అధ్యక్షుడు వెంటనే తన రాజ్యాంగబద్ధమైన పదవిని కోల్పోయినట్లు కాదు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, అధికారాన్ని బదిలీ చేసే రాజ్యాంగ ప్రక్రియ ఇంకా పూర్తి కావాల్సి ఉంది.

పార్లమెంటరీ ఎన్నికలలో సెర్బియా విద్యార్థుల విజయం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా వారి ప్రయాణం ఇతర ఐరోపా దేశాలను కచ్చితంగా ప్రభావితం చేయగలదు. దీని ప్రభావం ఫ్రాన్స్‌లో ప్రత్యేకంగా గణనీయంగా ఉండబోతుంది. అక్కడ విద్యార్థులు విద్యా సౌకర్యాల మెరుగుదల, మెరుగైన పాఠశాల విద్య, మౌలిక సదుపాయాల కోసం నిరసనలు చేస్తున్నారు. గ్రీస్‌లో పెరుగుతున్న విద్య, జీవన వ్యయాలకు వ్యతిరేకంగా విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. అదే సమయంలో బెల్జియం, ఇటలీ, ఇతర ఐరోపా దేశాలలో విద్యా బడ్జెట్లు, విశ్వవిద్యాలయ విధానాలు, విస్తృత సామాజిక సమస్యలపై విద్యార్థి ఉద్యమాలు కూడా చురుకుగా కొనసాగుతున్నాయి.

సెర్బియా విజయం ఈ ఉద్యమాలకు నూతన రాజకీయ ఆత్మ విశ్వాసాన్ని అందిస్తుంది. ఇది బాల్కన్ ప్రాంతంలోని రాజకీయాలపై, యూరోపియన్ యూనియన్, రష్యాలతో సెర్బియా సంబంధాలపై కూడా ప్రభావం చూపవచ్చు. సెర్బియాతో భారతదేశానికి ఉన్న దీర్ఘకాల స్నేహ సంబంధాలు, ఆర్థిక, సాంకేతిక, అంతర్జాతీయ వ్యవహారాలలో సహకారాన్ని విస్తరించడానికి ఇరు దేశాలు చేస్తున్న ప్రయత్నాల దృష్ట్యా, ఈ పరిణామాలు భారతదేశానికి కూడా ముఖ్యమైనవి.

**(ఐపిఎ సర్వీస్)**

*(సెర్బియా పూర్వపు యుగోస్లావియాలో అంతర్భాగం. ఆ దేశం విచ్ఛిన్నం తర్వాత ప్రత్యేక దేశంగా ఆవిర్భవించింది.)*

# ఆర్‌టిసి కార్మికుల 'చలో లేబర్ కమిషనర్' ఎందుకు?

అక్టోబర్ 9న ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పోలైన 34,421 ఓట్లలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి 18,375 రాగా తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ కూటమికి 13,709 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఐఎన్‌టియుసిని కాదని గతంలో బిఆర్‌ఎస్‌లో ఉండి ఆతరువాత బిజెపి చేరి నేడు కాంగ్రెస్‌లో చేరిన టిడబ్ల్యుయు (తెలంగాణ వర్కర్స్ యూనియన్)కు మద్దతు ఇచ్చింది. దాన్ని ఎలాగోలా గెలిపించుకోవాలని మంత్రులు, ఎమ్ఎల్ఏలు తమ అనుచరులతో డబ్బులు, మద్యం, అధికార యంత్రాంగాన్ని రంగంలో దించి కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నం చేసింది. ఎన్ని పన్నాగాలు పన్నిన ఆర్టీసీ ఉద్యోగులు మాత్రం ఎప్పుడూ తమ కు అండగా ఉండి కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేపడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ కే పట్టం కట్టారు.

కెసిఆర్ హయాంలో 2016లో ఎన్నికలు జరిగినవి. తిరిగి 2018లో జరుగవలసిన ఎన్నికలను జరపకుండా వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పుడు 10 సంవత్సరముల తర్వాత ఎన్నికలు జరిగినాయి. ఈ ఎన్నికల్లో గెలుపొందిన యూనియన్‌కు విలీన ప్రక్రియల కొరకు ఐఎఎస్‌లతో వేసిన కమిటీలో స్థానం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలు నిర్వహించి 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వంలో స్పందన లేదు. వెంటనే విలీన ప్రక్రియ చేపట్టాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా వాయిదా వేస్తున్న సందర్భంలో 2021లో ఆర్‌టిసిలో 53 రోజుల సమ్మె జరిగింది. ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరపకుండా కార్మికులపై తీవ్రనిర్బంధాన్ని ప్రయోగించింది.ఆర్టిసిలో కార్మిక సంఘాలను నిషేధించింది. కార్మిక సంఘాలు కోరుతున్నట్లు ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను అంగీకరిస్తూ చివరకు అసెంబ్లీ ఎన్నికల ముందు 17 సెప్టెంబర్, 2023 నాడు యాక్ట్7 పేరిట విలీన ప్రక్రియకు అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రభుత్వం హామీ ఇచ్చిన విలీన ప్రక్రియ పూర్తి చేయాలి!**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా కేవలం గజిట్ నోటిఫికేషన్ ద్వారా కలుపుకోవచ్చు. అలా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ ట్రెజరరీ నుంచి జీతాలు చెల్లించవచ్చు. అప్పుడు ఓ కమిటీవేసి దాని నివేదిక వచ్చిన తర్వాత వారి జీతా భత్యాల్లో, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై తుది నిర్ణయాలు తీసుకోవచ్చు. ఈ సంవత్సర ఏప్రిల్ లో ఆర్టీసీలో సమ్మె జరిగింది. ఆ సందర్భంగా జూన్ 2 నుండి ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. వివిధ కారణాలు చెబుతూ వాయిదా వేస్తూ.. యూనియన్ల వెరిఫికేషన్ తర్వాతనే విలీన ప్రక్రియను చేపడతామని హామీ ఇచ్చింది.. చివరికి ఎన్నికలు నిర్వహించిం ది. గెలుపొందిన ఎంప్లాయిస్ యూనియన్‌ను విలీనంకోసం వేసిన ఐఏఎస్‌ల కమిటీలోకి తీసుకుంటామని చెబుతూ తాత్సారం చేస్తుంది.

**ఎన్నికల్లో గెలుపొందేందుకు అడ్డదారుల్లో కాంగ్రెస్ :**

విలీనం డిమాండ్ చేసే బలమైన ఉద్యోగ సంఘాలను ఎన్నికల స్థాయిలోనే కట్టడి చేయాలని ప్రభుత్వం భావించింది. తమ చెప్పు చేతుల్లో ఉండే ఉద్యోగ సంఘానికి గుర్తింపు హోదా రావాలని తీవ్రంగా ప్రయత్నించింది.ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచే సంఘాన్ని గెలిపించుకోవాలని గత ఎన్నికల్లో గుర్తింపు ఉన్న బాణం గుర్తును కాంగ్రెస్ మద్దతిస్తున్న కూటమికి వచ్చేలా నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చింది. గుర్తులను తారుమారుచేసి ఓటేసే ఉద్యోగులను తికమకపరిచి లబ్ధి పొందాలనుకున్నది. అయినా ఫలితాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగానే వచ్చాయి.




ఈ ఓటమిని జీర్ణించుకోని కాంగ్రెస్ సర్కార్ కార్మిక శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికల్లో పాటిస్తున్న కోడ్ ఆఫ్ డిసిప్లీన్ ఉల్లంఘిస్తూ, రీజియన్ ఎన్నికల ఫలితాలను తాము మద్దతు ఇచ్చిన కూటమి కట్టబెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. అయినా కార్మిక శాఖపై ఒత్తిడి తెచ్చి క్లాస్6 లో గుర్తింపును 50 శాతము +1 ఓటు కన్నా తక్కువ వచ్చినప్పటికీ నాలుగు రీజియన్స్‌లో టిడబ్ల్యుయుకు గుర్తింపు ఇచ్చారు. క్లాస్ 6 లో 14 రీజియన్స్ ఉండగా 9 రీజియన్లలో కాంగ్రెస్ బలపరిచిన కూటమికే ఆధిక్యత ఉన్నదని, ఉద్యోగుల మద్దతు తమకే ఉన్నదని ప్రకటించారు. రీజియన్స్ స్థాయిలో పోలైన ఓట్లలో ఎవరికి 50 శాతం పైగా ఓట్లు వస్తాయో వారు గెలిచినట్లు లెక్క. ఎవరికీ 50 శాతం పైగా ఓట్లు రానట్టయితే అవి రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన యూనియన్‌కు చెందుతాయి. ఇదే విధానాన్ని పాటిస్తామని ఎన్నికలు జరిపిన కార్మిక శాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ ముందే చెప్పారు. దానికి అన్ని సంఘాలు ఆమోదం కూడా తెలిపాయి.

ఈసారి జరిగిన రీజియన్ స్థాయి ఎన్నికల్లో పోలైన ఓట్లలో 50 శాతం కంటే కనీసం ఒక ఓటు ఎక్కువ వచ్చినవి ఏడు మాత్రమే ఉన్నాయి. వాటిలో నాలుగు రీజియన్లలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి, మూడు రీజియన్లలో కాంగ్రెస్ బలపరిచిన టి డబ్ల్యుయు విజయం సాధించాయి. మిగతా రీజియన్‌లలో ఆ పద్ధతిలో ఓట్లు పడలేదు. ఒప్పందం ప్రకారం ఎవరికీ ఆధిక్యత రాని రీజియన్లు మొదటి ఓటుతో గెలుపొందిన ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి చెందుతాయి. అయితే వాటిని కాంగ్రెస్ మద్దతు తెలిపిన కూటమికి దక్కేలా విధానాలు మార్చటం జరిగింది.

**కాంగ్రెస్ ఒత్తిడితో నిబంధనలు మార్చిన కార్మిక శాఖ :**

50% నిబంధనను పక్కనపెట్టి ఈ రీజియన్స్‌లో ఎక్కువ ఓట్లు వచ్చిన సంఘానికి గుర్తింపు కట్టబెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యులు కార్మిక శాఖ పై ఒత్తిడి తెచ్చి పావులు కలిపారు. ఈ మార్పు వల్ల నాలుగు రీజియన్ స్థానాలు అక్రమంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన టిడబ్ల్యుయు కూటమికి లోనికి వెళ్లిపోతాయి. దీనివల్ల రాష్ట్రస్థాయి గుర్తింపులో ఓటమిపాలైన కూటమికి రీజియన్స్‌లో మెజార్టీ చేజిక్కుతుంది. న్యాయంగా తమకు రావలసిన నాలుగు రీజియన్లను ఉద్యోగుల మద్దతులేని సంఘాలకు కట్టబెట్టడాన్ని ఎంప్లాయిస్ కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

**చలో లేబర్ కమిషనర్ పిలుపు :**

ఎన్నికల ముందు నోటిఫికేషన్ చేసిన నిబంధన ప్రకారం 50 శాతం +1 ఓటుకి తక్కువ వచ్చినప్పటికీ 4 రీజియన్స్‌లో క్లాస్6లో అక్రమంగా ఇచ్చిన గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, క్లాస్ 3 లో రాష్ట్రస్థాయిలో గెలుపొందిన ఎంప్లాయిస్ యూనియన్ కూటమి అక్టోబర్ 28న 'చలో లేబర్ కమిషనర్' కార్యాలయానికి పిలుపునిచ్చింది. కార్మికులు ధర్నాకు సిద్ధమయ్యారు. ఎన్నికల్లో గెలుపొందిన సంఘానికి రిటర్నింగ్ అధికారి గుర్తింపు పత్రాన్ని అందజేయాలి. దాని ఆధారంగా వారు ప్రభుత్వంతో ఉద్యోగుల తరపున సంప్రదింపులు జరుపుతా రు. ప్రభుత్వం ఎన్నికల ఫలితాలను గౌరవించి చర్చల కోసం గుర్తింపు సంఘ ప్రతినిధులను ఆహ్వానించి తన నిజాయితీ నిరూపించుకోవాలి.

**ఉజ్జిని రత్నాకర్ రావు,** 9490952646
**ఎఐటియుసి పూర్వపు ప్రధాన కార్యదర్శి**



# ఆయిల్ పామ్ సాగు లక్ష్యం రెట్టింపు చేయాలి

**రైతులకు నాణ్యమైన మొక్కలివ్వాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణను వేగవంతం చేసి, నిర్ధేశించిన సాగు లక్ష్యాలను రెట్టింపు చేసే దిశగా కంపెనీలు పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతులకు అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన, పొట్టి రకం ఆయిల్‌పామ్ మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో గోద్రెజ్ అగ్రోవెట్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణతో పాటు నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో ఏర్పాటు చేసిన సమీకృత ఆయిల్‌పామ్ యూనిట్‌కు ఇప్పటికే అమలులో ఉన్న టిఎఫ్ఎపిపి, టిఐడియా విధానాల కింద లభించే ప్రయోజనాలకు అదనంగా ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీ మంజూరు చేయాలని గోద్రెజ్ ప్రతినిధులు మంత్రిని కోరారు. యూనిట్‌కు అవసరమైన రహదారి విస్తరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోనే తొలి ఆరవ తరం హైబ్రిడ్ ఆయిల్‌పామ్ విత్తనాల సీడ్ గార్డెన్ ఏర్పాటుకు అదనంగా 35 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. ఆధునిక ఆయిల్‌పామ్ మిల్లు ఏర్పాటును దృష్టిలో ఉంచుకొని అదనపు జిల్లాలను కేటాయించాలని, ఆయిల్‌పామ్ గెలల ధరల నిర్ణయంలో కంపెనీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంజనాపురం యూనిట్‌కు సంబంధించిన రహదారి విస్తరణ, భూమి కేటాయింపు తదితర అంశాలపై ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి కీలకమని పేర్కొంటూ, ప్రతిపాదిత సీడ్ గార్డెన్ పనులను వేగవంతం చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. రైతులకు మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం అందేలా కంపెనీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ ఎండి, సిఇఒ సునిల్ కటారియా, గ్రూప్ హెడ్ కార్పొరేట్ అఫైర్స్ రాకేష్ స్వామి, ఇతర కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బిసి మహిళలకు డిసెంబరు 9న కుట్టు మిషన్లు

**4.80 లక్షల దరఖాస్తులు..1.90 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక**

- బిసి సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ప్రయోజనాలు అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు డిసెంబరు 9న మిషన్లు పంపిణీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఈ పథకానికి సుమారు 4.80 లక్షల దరఖాస్తులు రాగా, 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయం లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బిసి సంక్షేమ శాఖ పరిధిలోని పలు పథకాల అమలుపై అధికారులతో చర్చించారు. రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. సొంత స్థలాలున్న 37 గురుకులాల్లో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధుల మంజూరుపై ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు. మిగిలిన గురుకులాలకు స్థల సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, కలెక్టర్లు నెలకు ఒక గురుకులాన్ని సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. బిసి స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి యుపిఎస్‌సి, గ్రూప్1 వంటి పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకంలో బిసిలకు ప్రాధాన్యం కల్పించే అంశాన్ని ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందినవారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ అందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రజకులకు ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, కమిషనర్ బాలమాయాదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం అండ

- విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు
- మహిళా కండక్టర్ ప్రవళికను పరామర్శించిన మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఖమ్మం రీజియన్ మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళికను మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో పరామర్శించిన మంత్రి ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రవళిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రవళిక ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఖమ్మం ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పేద ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్‌టిసి ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రయాణికులు విధుల్లో ఉన్న సిబ్బందితో గౌరవంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పొన్నం సూచించారు. ఉద్యోగుల ప్రవర్తనపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆర్‌టిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని హితవు పలికారు. ప్రజలకు సేవలందించడంతోపాటు ఉద్యోగుల ప్రాణాలు, భద్రతకు రక్షణ కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్‌టిసి సంస్థ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.



# కాళేశ్వరం పేరుతో దోచుకున్నారు

హరీశ్ రావు అబద్ధాల ప్రచారం చేస్తున్నారు

ప్రభుత్వ విప్ వేముల వీరేశం ధ్వజం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జరిపిన చర్చలు సానుకూలంగా సాగడం రాష్ట్రానికి శుభపరిణామమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. తొలి ప్రయత్నంలోనే ప్రాజెక్టు విషయంలో ముందడుగు పడటం ముఖ్యమంత్రి సాధించిన విజయమని పేర్కొన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి, తెలంగాణ రైతాంగానికి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు వరప్రదాయినిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీలోని సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ప్రభుత్వం సాధిస్తున్న పురోగతిని చూసి బిఆర్‌ఎస్ నేతలు అక్కసుతో విమర్శలు చేస్తున్నారని వీరేశం ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పేరు రాకూడదనే ఉద్ధేశంతో హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని గతంలో చెప్పిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం, ఆ ప్రాజెక్టును పక్కన పెట్టి కాళేశ్వరం నిర్మించిందని గుర్తుచేశారు. ఇప్పుడు తుమ్మిడిహెట్టి విషయంలో 42 రోజుల్లోనే సాధించామని హరీశ్‌రావు చెబుతున్నారని, అలా అయితే ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, రూపకల్పనలో అనేక లోపాలు ఉన్నాయని వీరేశం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూర్చలేదని, అధిక విద్యుత్ వ్యయంతో నీటిని ఎత్తిపోసే విధానంపై పునఃసమీక్ష అవసరమని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలను వినియోగించుకుంటే తక్కువ ఖర్చుతో సాగునీరు అందించవచ్చని అన్నారు.

# తీరం దాటనున్న 'అర్నబ్' తుఫాన్

**తెలంగాణలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తీవ్ర తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో రాగల రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తున్న ఈ తుఫాను, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కాకినాడలకు ఆగ్నేయంగా కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపారు. ఈ తీవ్ర తుఫాను బుధవారం ఉదయం బాపట్ల విశాఖపట్నం మధ్య ఉన్న యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందన్నారు. తుఫాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం తీరం దాటే సమయంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. తుఫాను తీవ్రత క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 29న ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట తదితర ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. 30వ తేదీ నాటికి వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టి, ఈనెల 31 నుంచి నవంబర్ 3 వరకు రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పొడిగా మారే అవకాశం ఉందన్నారు.

## రైళ్ల రాకపోకల్లో మార్పులు!

అర్నబ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైలు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైళ్ల రాకపోకల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, అవసరాన్ని బట్టి రైళ్లను రద్దు చేయడం, దారి మళ్లించడం లేదా ప్రయాణ సమయాలను పునఃప్రణాళిక చేయడం జరుగుతుందని వెల్లడించింది. ప్రయాణికులు రైల్వే అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లు లేదా 139 విచారణ నంబర్ ద్వారా తాజా సమాచారాన్ని తెలుసుకున్న తర్వాతే ప్రయాణం ప్రారంభించాలని సూచించింది. భారత వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం అక్టోబర్ 28న తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. అక్టోబర్ 28, 29 తేదీల్లో వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అర్నబ్ తుపాను అక్టోబర్ 28 ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని బాపట్ల, విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో దాటే అవకాశం ఉందని అంచనా వేసిన నేపథ్యంలో రైల్వే అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.

# తెలంగాణలో పెరిగిన చలి

- పగటిపూట ఎండలు
- రాత్రికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో గత రెండు మూడు రోజులుగా చలి ప్రభావం క్రమంగా పెరుగుతోంది. పగటి వేళల్లో ఎండ తీవ్రత యథావిధిగా కొనసాగుతున్నప్పటికీ, సాయంత్రం తర్వాత ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతుండటంతో రాత్రి వేళల్లో చలి తీవ్రత స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలు, ఐటీ కారిడార్ పరిసరాల్లో చల్లని గాలులు వీస్తుండటంతో ప్రజలు చలిని అనుభవిస్తున్నారు. వాతావరణ కేంద్రం తాజా గణాంకాల ప్రకారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరులో కనిష్ఠ ఉష్ణోగ్రత 13 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోగా, ఇది సాధారణం కంటే 5.3 డిగ్రీలు తక్కువగాన మోదైంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో 15 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదై, సాధారణ స్థాయి కంటే 3.6 డిగ్రీలు తగ్గింది. హైదరాబాద్ నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 19.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవగా, హకీంపేటలో 19.5 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా దుండిగల్లో 18 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అయితే రంగారెడ్డి జిల్లా హయత్ నగర్‌లో ప్రాంతంలో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రత 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదై, సాధారణం కంటే నాలుగు డిగ్రీలు అధికంగా ఉండటం విశేషం.

# రైతులకు సాగునీరందించడంలో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు ఆరోపించారు. నదుల్లో నీళ్లు పారుతున్నప్పటికీ వాటిని సాగుకు వినియోగించుకోకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారని, అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ నిర్మల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బిజెపి నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ నవంబర్ 11న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గోదావరి, కృష్ణా నదుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోకుండా వృథాగా సముద్రంలోకి వదిలేస్తున్నారన్నారు. కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టుపై ఇంతకాలం చేసిన ఆరోపణలు తప్పని తేలిపోతాయనే భయంతోనే ఆ బటన్‌ను నొక్కడం లేదన్నారు. ప్రజలను విభజించడంలో ఢిల్లీలో బిజెపి బిజీగా ఉండగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలను దోచుకోవడంలో బిజీగా ఉన్నదని ఆరోపించారు.

# రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు

- జిఒ 59 నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్
- కలెక్టర్ విచారణలో బయటపడ్డ ఎంఆర్‌ఒ అక్రమాలు
- భూములను తిరిగి వెనక్కి తీసుకున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు అధికారిక నివేదికల్లో ప్రస్తావన. అక్రమంగా జరిగిన ఐదు కన్వేయన్స్ డీడ్‌లను రద్దు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం. సంబంధిత అధికారులపై చర్యలకు ప్రతిపాదనలు పంపిన ప్రభుత్వం. అయినా బాధ్యులపై చర్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.' రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం చింతలకుంటలోని 3.12 ఎకరాల ప్రభుత్వ భూమి వ్యవహారం ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ భూమి అవకతవకలపై లోకాయుక్తాలో ఫిర్యాదు చేసిన బాలాపూర్‌కు చెందిన గజేందర్ కుమార్ గుప్తా తెలిపిన వివరాల ప్రకారం సరూర్‌నగర్ మండలం (ప్రస్తుతం బాలాపూర్ మండలం)లోని చింతలకుంట సర్వే నంబర్ 11లోని 3.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 59 జిఒ జారీ చేసింది. ఈ జిఒ ప్రకారం 3.12 ఎకరాల ప్రభుత్వ భూమిని తమ పేర్లపై హక్కులు కల్పించడంతో పాటు రిజిస్ట్రేషన్ చేయాలని పన్నాల మల్లారెడ్డి, పన్నాల సత్తి, పన్నాల యాది రెడ్డి, కొత్తకాపు ధన్‌పాల్ రెడ్డి, సరికొండ బాలకృష్ణ గౌడ్‌లు 2017లో సరూర్‌నగర్ మండల రెవెన్యూ అధికారి జి.వెంకటేశ్వర్లుకు దరఖాస్తు చేశారు. అయితే దరఖాస్తులు అన్ని కూడా ఆన్‌లైన్‌లోనే చేయాల్సి ఉండగా 59 జిఒ నిబంధనలకు విరుద్ధంగా మ్యాన్‌వల్‌గా దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తులను పరిశీలించిన ఎంఆర్‌ఒ జి.వెంకటేశ్వర్లు 3.12 ఎకరాల ప్రభుత్వ భూమిని పైన పేర్కొన్న ఐదుగురి పేర్లపై అదే ఏడాది ఏప్రిల్ 11న కన్వేయన్స్ డీడ్లు జారీ చేశారు. అప్పటి సరూర్‌నగర్ మండల రెవెన్యూ అధికారి జి.వెంకటేశ్వర్లు అక్రమంగా క్రమబద్ధీకరించి, ఐదుగురికి మాన్యువల్‌గా కన్వేయన్స్ డీడ్లు జారీ చేశారని. ఈ అంశంపై గజేందర్ కుమార్ గుప్తా అనే వ్యక్తి లోకాయుక్తాలో 2020లో ఫిర్యాదు చేశారు. దీనిపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ విచారణ జరిపి ఎంఆర్‌ఒ వెంకటేశ్వర్లు అక్రమంగా ఐదుగురికి ప్రభుత్వ భూమిని కన్వేయన్స్ డీడ్లు జారీ చేశారని, వీటిని రద్దు చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌కు నివేదిక అందించారు. ఈ మేరకు కలెక్టర్ నివేదికను పరిశీలించిన భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ప్రభుత్వానికి నివేదించారు. జిల్లా కలెక్టర్ సిఫారసుల మేరకు ఐదు డీడ్లను రద్దు చేస్తూ ప్రభుత్వం 2021 జూలై 12న మెమో జారీ చేసింది. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సరూర్‌నగర్ మండల ఎంఆర్‌ఒతో పాటు సంబంధిత అధికారులపై అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి ఎంఆర్‌ఒ వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఐదు డీడ్‌లను రద్దు చేయగానే తనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించారు. రిట్ పిటిషన్ తేలే వరకు వెంకటేశ్వర్లుపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌కు హైకోర్టు ఆదేశించింది. వెంకటేశ్వర్లుపై వచ్చిన ఆరోపణలు తేలకముందే అతనికి ఎంఆర్‌ఒ నుంచి ఆర్‌డిఒగా పదోన్నతులు కూడా కల్పించడం విశేషం.



వెంకటేశ్వర్లు

## ఎంఆర్‌ఒ చేసింది తప్పే..లోకాయుక్తకు నివేదిక

చింతలకుంట సర్వే నంబర్ 11లోని 3.12 ఎకరాల ప్రభుత్వ భూమిని జిఒ నంబర్ 59 నిబంధనలకు విరుద్ధంగా సరూర్‌నగర్ ఎంఆర్‌ఒ వెంకటేశ్వర్లు అక్రమాలకు పాల్పడ్డారని, అయితే అతనిపై చర్యలు తీసుకునేందుకు హైకోర్టు ఆదేశాలు తమకు అడ్డుగా ఉన్నాయని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకాయుక్తకు 2023 మార్చి 17న నివేదిక అందించారు. చర్యలు తీసుకోవద్దని వెంకటేశ్వర్లు హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని గజేందర్ కుమార్ చేసిన అభ్యర్థనను హైకోర్టు పరిగణలోకి తీసుకుని వెంకటేశ్వర్లు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు 2024 సెప్టెంబర్ 18న కొట్టివేసింది. దీంతో అతనిపై చర్యలు తీసుకునేందుకు మార్గం సుగమమైంది. అయినప్పటికీ కేసులో బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

# నైనీ బొగ్గు రవాణా మార్గాల నిర్మాణానికి సహకారం అందించండి

**ఒడిశా అంగూల్ జిల్లా కలెక్టర్‌ను కోరిన సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి సంస్థకు చెందిన నైనీ బొగ్గు గనికి అనుబంధంగా సమీపంలో నిర్మించ తలపెట్టిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి, నైనీ నిర్వాసితులకు ఉద్దేశించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, బొగ్గు రవాణాకు అవసరమైన రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల కేటాయించాలని సింగరేణి సంస్థ యాజమన్యాం ఒడిశా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇందు కోసం తుకుడా, జరపడా గ్రామాలకు చెందిన స్థలం అనుకూలమైనదిగా గుర్తించామని, ఈ స్థల సేకరణకు సహకారం అందించాలని కోరింది. ఈ మేరకు సింగరేణి సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అంగూల్ జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దాల్ అక్తార్‌తో మంగళవారం ప్రత్యేకంగా సమావేశమై పలు విజ్ఞప్తులు చేశారు. అంశాల వారీగా చర్చించి తగిన సహకారం అందించాల్సిందిగా కోరారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సింగరేణి తెలియజేసింది. సమావేశంలో సంస్థ సిఎండితో పాటు సింగరేణి డైరెక్టర్లు గౌతమ్ పోట్రు, ఎల్.వి.సూర్యనారాయణ, ఇడి (కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) టి.శ్రీనివాస్ ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పలు నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ, అనుమతులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. నైనీ బొగ్గు గని వల్ల నిర్వాసితులైన 40 కుటుంబాలకు ఆర్ అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం కోసం తగిన స్థలాన్ని మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను సింగరేణి చైర్మన్ కోరారు. త్వరలోనే రిహాబిలిటేషన్, పెరిఫెరి అడ్వైజరీ కమిటీ (ఆర్‌పిడిఎసి) సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు, కాలనీ నిర్మాణానికి భూసేకరణ, పునరావాసం ప్యాకేజీలు మొదలైన సమస్యలపై నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం నైనీ బ్లాక్ నుండి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును సమీపంలో గల జరపడా రైల్వే జంక్షన్‌కు రవాణా చేయడం కోసం చండీపడాజరపడా గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం సింగరేణి సంస్థ తనవంతుగా ఇప్పటికే రూ.35 కోట్లను డిపాజిట్ చేసిందని, ఈ రోడ్డు కోల్ కారిడార్ మాదిరిగా మారి ఇతర బొగ్గు ఉత్పత్తి పరిశ్రమలకు కూడా ఉపయోగపడుతుందని, సంబంధిత శాఖల సహకారంతో నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కోరారు. సింగరేణి సంస్థ ఒడిశాలో తన కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో సింగరేణి కార్యాలయ నిర్మాణానికి, ఉద్యోగుల నివాస కాలనీ నిర్మాణానికి తగిన స్థలాన్ని గుర్తించి తమకు కేటాయించాలని కూడా కోరారు. స్థానిక గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు రవాణా జరపడం కోసం మాజికా బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని, ఇప్పటికే సింగరేణి సంస్థ ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సింగరేణి సంస్థకు తాము అన్ని రకాలుగా సహకరిస్తామని, దేశ విద్యుత్ అవసరాల కోసం కృషి చేస్తున్న సింగరేణికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అంగూల్ జిల్లాలో జిందాల్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే తొలి కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్‌ను సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి నేతృత్వంలోని అధికారుల బృందం సందర్శించింది. ఈ ప్లాంట్‌లో దేశీయ బొగ్గుతో గ్యాస్ ఉత్పత్తి చేస్తూ దాన్ని జిందాల్ స్టీల్ కోసం వినియోగిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. సింగరేణిలో మూతపడిన భూ గర్భ గనుల నుంచి కోల్ గ్యాసిఫికేషన్‌కు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలు, కేంద్ర ప్రభుత్వ రాయితీలు తదితర అంశాలపై నిపుణులతో చర్చించారు. జిందాల్ ప్లాంట్‌కు సింగరేణి నైనీ గని నుంచి కూడా కొంత బొగ్గు రవాణా అవుతుందని అధికారులు తెలిపారు.



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 26-యాకుత్‌పురా, చార్మినార్ జోన్.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు - నిర్వహణ పనులు

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 19/EE-26/ CRZ/GHMC/ 2026-27 | క్ర.సం. 1 నుండి 1 వరకు | రూ. 11,77,350/- | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 17.10.2026 ఉ.11.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 30.10.2026 మ.03.00గం.ల వరకు | శ్రీ డి.దేవేందర్, ఇఇ, సర్కిల్-26, చార్మినార్ జోన్, మస్కతి గ్రాండ్, దరబ్ జంగ్ కాలనీ, సంతోష్ నగర్, హైదరాబాద్. ఫోన్ నెం. 9701365528 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 26-యాకుత్‌పురా, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 12541-PP/CL/ADVT/2026-27, Date: 27-10-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 9154172331
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No. 63/SE/SLPZ/CMC/2026-27 తేది: 27.10.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ / ఇసివి | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 63/ SE/SLPZ/ CMC/ 2026-27, తేది: 27.10.2026 | సిఎంసి, ఎస్ఎల్‌పిజెడ్, నార్సింగి సర్కిల్-45లో బిటి రోడ్ వేయడం. (01 ఐటెమ్) | రూ. 77.00 లక్షలు | 28.10.2026 మ.1.00గం.ల నుండి, 04.11.2026 మ.1.30గం.ల వరకు | ఎస్ఇ, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9154172331 7331186858 |

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి
DIPR R.O. No. : 12603-PP/CL/ADVT/2026-27, Date: 27-10-2026

దేవాదాయ - ధర్మాదాయ శాఖ
**శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానము, చాంద్రాయణగుట్ట, హైద్రాబాద్.**
బహిరంగ వేలము ప్రకటన - తేది: 27-10-2026

ఇందుమూలంగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా, దేవాలయమునక సంబంధించిన పాలమాకుల గ్రామము, శంషాబాద్ మండలము, రంగారెడ్డి జిల్లాలో గల వ్యవసాయ భూమి సర్వే నెం. 145, 147 నుండి 160, 163, విస్తీర్ణము ఎ. 22-03 గుంటలు గల భూములను 3 సం.లకు గాను అనగా తేది. 01-12-2024 నుండి 30-11-2027 వరకు కౌలుకు ఇచ్చుటకు బహిరంగ వేలము నిర్ణయించడమైనది. హెచ్చు పాటదారు బహిరంగ వేలము పాట షరతుల ప్రకారంగా కౌలు రూపాయలు చెల్లించుటలో విఫలమైనందున ప్రస్తుతము కొనసాగుతున్న బహిరంగ వేలము రద్దు చేయడమైనది. తిరిగి 3 సం.లకు పై చూపిన సర్వే నెంబర్లలో గల ఆలయమునకు సంబంధించిన వ్యవసాయ భూమిని బహిరంగ వేలము ద్వారా కౌలుకు ఇచ్చుటకు గాను వేలం పాటను శ్రీయుత కమిషనర్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయము, హైదరాబాద్ ధ్యాన మందిరము ఫస్ట్ ఫ్లోర్ నందు బహిరంగ వేలమును తేది: 10-11-2026 మంగళవారం రోజున ఉ. 11.30 ని.లకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించుటకు నిర్ణయించనైనది.

ఆసక్తి గల వారు ఈ దిగువ చూపబడిన వేలంలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

1) కౌలు కాల పరిమితి స్వాధీనం చేసిన నాటి నుండి 3 సంవత్సరములు.
2) ఇ.ఎం.డి. డిపాజిట్ రూ.2,00,000/-లు డి.డి. కార్యనిర్వహణాధికారి శ్రీ చెన్న కేశవస్వామి దేవస్థానము పేరున పొందవలెను. నగదు చెల్లింపులు అనుమతించబడదు.
3) వేలంలో హెచ్చుపాట దారుడి ఇ.ఎం.డి.ని మినహాయించి, మిలిగిన వారి డిపాజిట్ తిరిగి ఇవ్వబడును.

ఇట్టి వేలమునకు సంబంధించిన పూర్తి వివరములు దేవాలయములో కానీ లేదా ఫోన్ ద్వారా తెలుసుకోగలరు.

సం/- వి. శివరుద్రప్ప
కార్యనిర్వహణాధికారి,
ఫోన్ నెం. 8096834957
DIPR R.O. No. : 12596-PP/CL/ADVT/2026-27, Date: 27-10-2026

దేవాదాయ - ధర్మాదాయ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
**శ్రీ ఆంధోల్ మైసమ్మ దేవస్థానము**
గ్రా॥ దండుమల్కాపురం, మం॥ చౌటుప్పల్, జి॥ యాదాద్రి భువనగిరి.
Email: eo.andholmaisamma@gmail.com
సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలంగా సమస్త భక్తజనానికి తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానానికి సంబందించిన ఈ క్రింద తెలిపబడిన H1 మరియు L1 వేలములు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ద్వార సదరు దేవస్థాన ప్రాంగణంలో తేది: 12.11.2026 గురువారము రోజున ఉదయం 11 గంటలకు నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరములు | ధారావత్తు డి.డి ద్వార | కాల పరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు మరియు పూజ సామాగ్రి అమ్ముకొనే హక్కు (H1) | 5,00,000/- | తేది: 14-01-2027 నుండి 13-01-2028 వరకు |
| 2. | భక్తులకు టెంటు సామాగ్రి సప్లై చేసే హక్కు(H1) | 1,00,000/- | తేది: 10-01-2027 నుండి 09-01-2028 వరకు |
| 3. | సిసి కెమెరాల సప్లై మరియు నిర్వాహణ హక్కు (L1) | 10,000/- | తేది: 14-01-2027 నుండి 13-01-2028 వరకు |

వేలము పాటలో పాల్గొనువారు షెడ్యుల్ కొరకు తేది: 11-11-2026 నుండి 12-11-2026 ఉదయం 10 గంటల వరకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించగలరు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9030932493.
Sd/-
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 12523-PP/CL/ADVT/2026-27, Date: 27-10-2026

## పార్టీ పటిష్ఠతకు కలసికట్టుగా కృషి

### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఐ పార్టీ పటిష్ఠతకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు.గత రెండు రోజులుగా హైదరాబాద్ మొగుదు భవన్లో జరుగుతున్న సిపిఐ పార్టీ సమితి సమావేశంలో పెద్దపెల్లి జిల్లా రిపోర్టు ను ప్రవేశపెట్టారు. జిల్లాలో పార్టీ పటిష్టతకు కార్యకర్త నుండి నాయకుల వరకు కృషి చేస్తున్నామని,పేద మధ్యతరగతి ప్రజల సమస్యల పట్ల జిల్లాలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు.పార్టీ కార్యక్రమాలకు కార్యకర్తనుండి నాయకుల వరకు అందరు హాజరై పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రైతులకు సాగునీరు, గిట్టుబాటు ధర విషయంలో ఎక్కడా రాజీ పడకుండా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు.సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ,రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఐకెపి,సింగిల్ విండో సొసైటీల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.2,462 కనీస మద్దతు ధర లభిస్తుందని, సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోందని చెప్పారు. దీంతో రైతులకు మొత్తం రూ.2,962 లభిస్తుందని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని పేర్కొన్నారు.పెద్దపల్లి నియోజకవర్గ రైతుల పంటలు ఎండిపోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఎస్సారెస్పీ నుంచి పది రోజుల పాటు సాగునీరు విడుదల చేయించి పంటలను కాపాడామని తెలిపారు.తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున కోసిన ధాన్యాన్ని పాలిథిన్ కవర్లతో కప్పి భద్రపరచాలని రైతులకు సూచించారు.సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవిలో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని,అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించి ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కనుకుల సింగిల్ విండో చైర్మన్,సుల్తానాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్,సర్పంచులు కవిత కుమార్, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,మహిళలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో గులాబీ జెండా ఎగరాలి!

### బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ దిశానిర్దేశం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి, రానున్న రోజుల్లో గులాబి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.మంగళవారం రోజున కెటిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డిని,రామగుండంలో ఇటీవల నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కెటిఆర్ ప్రత్యేకంగా అభినందించారు.సింగరేణి కార్మికుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,వారి హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమంలో హరీష్ రెడ్డి పోషించిన పాత్రను ప్రశంసించారు.రామగుండం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.రానున్న రోజుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ కావాలని,ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని కెటిఆర్ సూచించారు.బిఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

## పోచమ్మ ఆలయ రహదారికి మహర్దశ!




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఈ నెల 13న పోచమ్మ ఆలయ కట్టకింది రహదారి అధ్వానంగా మారిందంటూ ప్రజాపక్షం దినపత్రిక ముందుగా వెలుగులోకి తెచ్చిన కథనానికి ఉత్సవ కమిటీ సభ్యులు,అధికారులు స్పందించారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద పోచమ్మ ఆలయానికి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇటీవల మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌లో కల్లాలకు తరలిస్తుండగా రహదారి ఇరుకుగా ఉండి,సరిగా లేకపోవడంతో ట్రాలీ బోల్తాపడింది.ఈ సమస్యను వెలుగులోకి తెచ్చిన ప్రజాపక్షం కథనంతో స్పందించిన ఉత్సవ కమిటీ సభ్యులు,అధికారులు మంగళవారం జెసిబితో రహదారిని వెడల్పు చేసి మరమ్మతు పనులు ప్రారంభించారు.రహదారి సమస్యను వెలుగులోకి తెచ్చి సమస్య పరిష్కారంలో చొరవ చూపిన ప్రజాపక్షం దినపత్రికను పలువురు అభినందించారు.ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొడిచెర్ల శంకర్,ఐలాపురం భూమారెడ్డి,కల్లెడ రాజశేఖర్,సంజీవ్, రంజిత్,పల్లికొండ శివ,కల్లెడ సాయితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా భూముల రీ-సర్వే ప్రక్రియ

### కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల :** జిల్లా లో జరుగుతున్న రీసర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే సమయంలో భూముల హద్దులు, భూ యజమానుల వివరాలు,అందుబాటులో ఉన్న భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి,భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.రీసర్వే ద్వారా భూముల వివరాలు,సరిహద్దులకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చుకోవాలని అధికారులకు తెలిపారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి,నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ‘చామనపల్లి’కి భూసేకరణ,పునరావాసం కల్పిస్తాం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** చామనపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాసం,పునరుద్ధరణ(ఆర్అండ్ఆర్) ప్యాకేజీ అమలు చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.మంగళవారం ధర్మారం మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన గ్రామసభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. గత అనేక సంవత్సరాలుగా భారీ వర్షాలు కురిసినప్పుడు, నీటిని ఎత్తిపోసే సమయంలో చామనపల్లి గ్రామ ప్రజలు ముంపు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తెలిపారు.2006లో ధర్మారం మండలం నుంచి జడ్పిటిసిగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, ఈ ప్రాంతంలోని గ్రామాలతో తనకు సుమారు 25 సంవత్సరాల అనుబంధం ఉందని పేర్కొన్నారు. సాధారణంగా నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టిఎల్) నుంచి 100 మీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, చామనపల్లి గ్రామ ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని తొలిసారిగా ఆ పరిమితికి మించి గ్రామంకి భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

**ముఖ్యమంత్రి హామీ మేరకు భూసేకరణ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా సూచించారని మంత్రి తెలిపారు. చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టాలనే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.గత 10 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ కార్యక్రమం ఇప్పుడు కార్యరూపం దాల్చుతోందని, దీనిని విజయవంతంగా పూర్తి చేసేందుకు గ్రామ ప్రజలందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలించేందుకు 2023లో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. ఎఫ్‌టీఎల్ నుంచి 100 మీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టి పునరావాసం కల్పించాలని కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని తెలిపారు.ప్రస్తుతం ప్రభుత్వం చామనపల్లి గ్రామంకి భూసేకరణ చేపట్టి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని స్పష్టం చేశారు.

**ప్రతి ఇంటి వివరాల నమోదు.. ఆస్తుల అంచనాలు :** గ్రామంలోని ప్రతి ఇంటిని ఇప్పటికే సర్వే చేసి,కుటుంబ సభ్యులు,చెట్లు, బావులు తదితర వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణానికి సంబంధించిన అంచనాలను పరిశీలించామని, ఇంటిలోని కలప తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని అంచనాలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.సర్వే సమయంలో ఎలాంటి వివరాలు మిస్ కాకుండా జాగ్రత్తగా పరిశీలించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు.

**7 రోజుల్లో సామాజిక ప్రభావ అంచనా సర్వే పూర్తి :** చామనపల్లి గ్రామం మొత్తానికి సామాజిక ప్రభావ అంచనా సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సర్వే కోసం 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గ్రామంలో వీడియో రికార్డింగ్ చేపడతామని తెలిపారు.ప్రతి ఇంటికి ప్రత్యేక ప్రాజెక్టు నంబరు కేటాయించి, ఆ ఇంటికి సంబంధించిన కుటుంబ సభ్యులు, ఆస్తులు, ఇతర వివరాలను నమోదు చేస్తామని పేర్కొన్నారు.సర్వే పారదర్శకంగా నిర్వహించి, నమోదు చేసిన వివరాల ఆధారంగా చర్యలు చేపడతామని తెలిపారు.

**ఆర్అండ్ఆర్ కమిటీ ద్వారా పునరావాసంపై నిర్ణయం :** సామాజిక ప్రభావ అంచనా సర్వే పూర్తయిన అనంతరం ఆర్అండ్ఆర్ కమిటీని ఏర్పాటు చేసి, పునరావాసానికి సంబంధించిన అంశాలను చర్చిస్తామని తెలిపారు.ప్రస్తుతం పునరావాసం కోసం రెండు ప్రాంతాలను పరిశీలించినట్లు వెల్లడించారు.అవసరమైన వారికి పునరావాస స్థలాలు కేటాయించడంతో పాటు, నిబంధనల ప్రకారం ఒకేసారి పరిష్కారం (వన్‌టైమ్ సెటిల్‌మెంట్) పొందే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు.

**ప్రజలకు అందుబాటులో అధికారులు :** భూసేకరణ, పరిహారం, పునరావాసానికి సంబంధించి ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఆర్డీవో బి. గంగయ్య, తహసీల్దార్ అందుబాటులో ఉంటారని తెలిపారు.తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని,వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాబోయే 3 నుంచి 4 నెలల్లో భూసేకరణ, పరిహారం, పునరావాస ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ గ్రామసభలో ఆర్‌డిఒ గంగయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## సిద్దిపేట ఎసిపి కార్యాలయం తనిఖీ

### పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** వార్షిక తనిఖీలలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ సిద్ధిపేట ఎసిపి కార్యాలయాన్ని సందర్శించి, క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని రకాల రికార్డులను, కే సు ఫైళ్లను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, కేసుల స్థితిగతులు, కార్యాలయ ప్రాంగణం రికార్డుల నిర్వహణను ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు.తనిఖీ అనంతరం సిద్ధిపేట ఏసిపి రవీందర్ రెడ్డి గారికి ఆమె పలు కీలక సూచనలు చేశారు ఎస్‌సి ఎస్‌టి కేసులు, పోక్సో కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఇన్వెస్టిగేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, నీట్‌గా ఉంచాలని, కార్యాలయ నిర్వహణలో తప్పనిసరిగా 5ఎస్ విధానాన్ని పాటించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడి, వారి సమస్యలను వినాలని సిపి స్పష్టం చేశారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సంబంధిత గ్రీవెన్స్ పూర్తిగా పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/బోయినపల్లి/వేములవాడ:** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో కేతు బచావో అభియాన్, రైతు నేస్తం కార్యక్రమాలు సీ హెచ్ సీ, ఎఫ్ పీఓ, ఎస్ హెచ్ జీ మహిళలు, రైతులకు మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్స్7, ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్, వ్యవసాయ యాంత్రీకరణ, దరఖాస్తు, వినియోగం, సూపర్ ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించామని, దీంతో రాష్ట్రంలో 35 శాతం పప్పు ధాన్యాలు, 20 శాతం నూనె గింజల సాగు, భారీగా కూరగాయల సాగు పెరిగిందని తెలిపారు. సూపర్ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రైతులు వరి సాగు చేయవద్దని సూచించారు. రిజర్వాయర్లలోని నీటిని తాగు నీటికి, జీవాల కోసం వినియోగించాలని తెలిపారు. భూగర్భ జలాలు గత ఏడాది తో పోలిస్తే 2.27 మీటర్ల లోతులోకి పడిపోయాయని తెలిపారు. ఒక ఎకరంలో వరి సాగు చేస్తే దాదాపు 35 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమని వెల్లడించారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుపై మండలంలో సమావేశం నిర్వహించగా చాలామంది ముందుకు వచ్చారని ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు, అలాగే ఫ్యాక్టరీ సందర్శనకు వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. ఆయిల్ ఫామ్ కు టన్ను ధర ప్రస్తుతం 23 వేల 641 ఉందని వెల్లడించారు. జిల్లాకు దగ్గర్లోనే సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉందని వివరించారు. ఆయిల్ ఫామ్ ఉత్పత్తులు సేకరించే కేంద్రం మండలంలోనే ఉందని గుర్తు చేశారు. పిఎసిఎస్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫొద్దీన్, ఇన్‌చార్జి ఎంపిడిఒ శ్రీధర్, సర్పంచ్ పాల్గొన్నారు.

# ‘ఎల్ నినో’ పరిస్థితులపై అప్రమత్తం

### కలెక్టర్ సత్య ప్రసాద్



**ప్రజాపక్షం/జగిత్యాల :** ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగి సాగు, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల సంరక్షణపై అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్,అదనపు కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఎల్ నినో ప్రభావం, వర్షపాతం, ఖరీఫ్ పంటల పరిస్థితి, యాసంగి సాగు ప్రణాళిక, ఉద్యాన పంటలు, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, ప్రజారోగ్యం, గోదావరి పుష్కరాలు–2027 ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1,03,845 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, అందులో 72,210 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. గత యాసంగిలో సుమారు 70,229 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 29,918 ఎకరాలకు తగ్గించాలని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, అర్హులైన రైతులకు అందుబాటులో ఉన్న పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు.తక్కువ నీటితో పండే ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయ,ఉద్యాన జిల్లాలో 246 చిన్న నీటి వనరుల మొత్తం సామర్థ్యం 2,412 ఎంసిఎఫ్‌టి కాగా, ప్రస్తుతం 1,116 ఎంసిఎఫ్‌టి నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ఇది మొత్తం సామర్థ్యంలో 46 శాతమని తెలిపారు. కోరుట్ల ప్రాంతంలో భూగర్భ జలమట్టం గత 11 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత దిగువకు చేరిందని పేర్కొన్నారు.గోదావరి పుష్కరాలు–2027కు కోరుట్ల నియోజకవర్గ పరిధిలో సుమారు 38 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. పంటలు మార్కెట్‌కు వచ్చినప్పుడు కొ నుగోళ్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పా ట్లు చే యాలని సూచించారు.అదనపు కలెక్టర్ రెవె న్యూ/ప్రసునాంబ,ఆర్‌డిఓజీవాకర్ రెడ్డి,ఉన్నారు.

## పిఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన : ఎస్‌పి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించి, వారి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ సూచించారు. జిల్లా పరిదిలో మొత్తం 30 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ప్రమాదంలో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి, అత్యవసర వైద్య చికిత్స అందేలా సహకరించాలని ప్రజలకు సూచించారు. ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు.రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని, ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు.అదేవిధంగా,ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని,అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్‌పి సూచించారు.

## ‘కరీంనగర్’ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతా

### రూ.78 లక్షలతో అభివృద్ధి పనులు

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్:** అభివృద్ధిలో, క్లీన్ అండ్ గ్రీన్‌లో కరీంనగర్ కార్పొరేషన్‌ను తెలంగాణలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోని చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్రాల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.కరీంనగర్ పర్యటనలో భాగంగా మంగళవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ దుర్శేడ్ గోపాల్ పూర్‌లో రూ.78 లక్షల యూఐడిఎఫ్ నిధులతో డ్రెయిన్, సిసి రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భూపతి రవీందర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఇప్పటికే యూఐడిఎఫ్ కింద 50 కోట్ల రూపాయలు వచ్చినయ్. ఆ నిధులతో సిసి రోడ్లు, డ్రెయిన్ పనులను స్టార్ట్ చేశామని, ఈ స్కీం కింద మరో 30 కోట్ల రూపాయలు కూడా రాబోతున్నయన్నారు. నగరంలో గల్లీగల్లీలో సిసి రోడ్లను, డ్రెయిన్లను నిర్మిసామని, స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దామని అన్నారు. అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, అర్బన్ డెవలప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చాయని, వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసిందని, శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. రూ.840 కోట్ల యూసిఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయని, కరీంనగర్‌లో మోడల్ రోడ్లను నిర్మిస్తామని, స్కై వాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తామన్నారు.

## వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా అధిగమిద్దామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. సూపర్ ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ ప్రణాళిక తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.వర్షపాతం, రానున్న మూడు నెలల్లో వర్షపాతం, నీటి పారుదల, వివిధ పంటల సాగు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేశన్ ద్వారా వివరించారు. ఒక ఎకరంలో వరి సాగు చేసే నీటితో ఐదు నుంచి ఆరు ఎకరాల్లో ఆరుతడి పంటలు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత వేడి వాతావరణం తక్కువ వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు రానురాను తగ్గుతున్నాయని వివరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మిగతా జిల్లాలతో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. వచ్చే నెల నవంబర్ 30 వరకు జిల్లాలోని ఆయా మండలాల్లో కేతు బచావో అభియాన్ అలాగే సూపర్ ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖ ఏఈలు ప్రతి మంగళ, బుధవారాల్లో ఆయా సమావేశాలకు హాజరై ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి మట్టాలు, విద్యుత్ వ్యవస్థ తదితర అంశాలపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాన్నారు.పశుసంవర్ధక శాఖ అధికారులు జీవాలకు అవసరమైన గడ్డి దాన సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, గడ్డి పెంచేందుకు కావాల్సిన విత్తనాలు ముందస్తుగా అందుబాటులో పెట్టాలని ఆదేశించారు.విబిజి రామ్ జీ కింద తెలంగాణ జలసిరి పనులను జిల్లాలో ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, మిషన్ భగీరథ ఎస్ఇ రాములు, డిఆర్‌డిఒ లక్ష్మీ నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఎన్‌డిపిసిఎల్ ఎస్ఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులపై విద్యార్థులు మౌనం వీడాలి

### సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** లైంగిక వేధింపులకు గురైన విద్యార్థులు మౌనం దాల్చకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మంగళవారం సురక్షిత్ బచ్పన్ అభియాన్ పథకం కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు.18 ఏళ్లలోపు బాలబాలికలు ఎదుర్కొనే లైంగిక, మానసిక, శారీరక వేధింపులను భరించాల్సిన అవసరం లేదన్నారు..ఎవరితోనూ చెప్పుకోలేని పరిస్థితి ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా డయల్ 112 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.అంతకుముందు ఉపాధ్యాయులు అందించిన మొక్కను పాఠశాల ఆవరణలో నాటా రు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమని జడ్జి పేర్కొన్నారు. జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి,సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్య రాజారాం,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, మధుసూదన్‌రెడ్డి,తోగిటి రాజశేఖర్,నేరెళ్ల శ్రీధర్, జెడి సుధాకర్, వెంకటగిరి, గణేష్,సురేష్, మోహన్,రామేశ్వరరావు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ భూముల ఆక్రమణలు సహించేది లేదు

**ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి**

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**ప్రజాపక్షం /నిర్మల్ :** జిల్లాలో నీటిపారుదల శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.మంగళవారం పట్టణంలోని ధర్మసాగర్ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఆక్రమణలను కలెక్టర్ పరిశీలించారు. చెరువుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, మ్యాపులను పరిశీలించారు. ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసేందుకు చేపట్టిన నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ధర్మసాగర్ చెరువు వద్ద అనధికారికంగా నిర్మించిన లేఅవుట్ ఫెన్సింగ్ గోడను అధికారులు కూల్చివేశారు.వెంచర్ నిర్మాణ పనులకు వినియోగిస్తున్న యంత్రాలు,సామగ్రి,ఇసుక తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని నీటిపారుదల శాఖ భూములు, చెరువుల పరిధిలో ఆక్రమణలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఆక్రమణలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో నీటిపారుదల శాఖ ఇఇ అనిల్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసీల్దార్ రాజు,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కెజిబివిలో మౌలిక వసతులు కల్పిస్తాం

విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా,నిత్యజీవిత అనుభవాలతో అనుసంధానం చేసుకొని నేర్చుకునేలా ఆచరణాత్మక బోధన అందించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. మంగళవారం కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహ ప్రాంగణంలో ప్రతిరోజూ మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని పూటలా నాణ్యమైన,పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం వందకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహంలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.4.80 లక్షలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. డ్రైనేజీ నిర్మాణంతో పాటు అవసరమైన ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.కోతుల బెడద నివారణకు సోలార్ కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను నిత్యజీవితంలోని అంశాలతో అనుసంధానం చేసుకొని చదివితే విషయ పరిజ్ఞానం మరింత మెరుగుపడుతుందని విద్యార్థులకు సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ కమల్ సింగ్,ఎంపిఒ శోభన, ఎంఇఒ ముత్యం, సర్పంచ్ దశరథ్, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పొలం వద్ద బోరు వేయించేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రంగాయపల్లి గ్రామానికి చెందిన రాజుబోయిన లక్ష్మణ్ (42) మంగళవారం తన పొలం వద్ద బోరు వేయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో బోరు పనులకు సంబంధించిన విద్యుత్ పరికరాలను ఉపయోగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి అండగా నిలిచిన వ్యక్తి అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వ్యవసాయ పనులు నిర్వహించే సమయంలో విద్యుత్ పరికరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

## 'ఖేలో ఇండియా' క్రీడా పోటీలకు ఏర్పాట్లు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**ప్రజాపక్షం/మాక్లూర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026–27 లో భాగంగా డిసెంబర్‌లో జాతీయస్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి జిల్లాలో ఎంపిక చేసిన క్రీడా వేదికను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జాతీయస్థాయిలో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా, టెన్నిస్ పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ మాక్లూర్ మండలం దాస్‌నగర్ సమీపంలో నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌ను సందర్శించి టెన్నిస్ పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా వేదిక ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ఎంపిక చేయడం ఎంతో ప్రతిష్టాత్మకమైన విషయమంటూ ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకుఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్‌డిఒ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఇన్‌చార్జి డిఇఒ సాయగౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి పవన్‌కుమార్, డిఎం అండ్ హెచ్ఒ రాజశ్రీ, పరమేశ్వర్, ప్రకాష్‌యాదవ్, కరస్పాండెంట్ సంతోష్, లత, అధికారులు పాల్గొన్నారు.

## పూలు, కూరగాయ పంటలపై రైతుల ఆసక్తి



**ప్రజాపక్షం/రేగోడు:** రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటున్నారు. వరి, జొన్న, పెసర, మినుము, కంది, పత్తి పంటలను కాకుండా పూల తోటలు, కూరగాయ పంటలకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. రేగోడుతో పాటు పోచారం, జగిరాల తదితర గ్రామాల్లో బంతిపూల సాగు చేశారు. రేగోడులో బోరు బావుల కింద వేసిన బంతి పూల తోటలు బాగానే దిగబడి వచ్చిందని రైతులు తెలిపారు. తెలంగాణలో పెద్ద పండుగలైన బతుకమ్మ, దుర్గ భవాని నవరాత్రులు, దసరా, దీపావళి పండుగలకు పువ్వుల డిమాండ్ బాగానే ఉంటుంది. ఈసారి బంతి పూల దిగుబడి బాగానే వచ్చినా మార్కెట్‌లో ధర ఆశించిన స్థాయిలో లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో కిలో 100 రూపాయలు విక్రయిస్తుండగా పూల తోటలోకి వచ్చిన వారికి తక్కువ ధరకే విక్రయిస్తున్నామని తెలిపారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో కూరగాయ పంటలు సాగు చేశామని, నీటి సౌకర్యాలు ఉన్నప్పటికీ కూరగాయలు ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా పంట ఎండ తీవ్రతకు వాడిపోతున్నాయని తెలిపారు. హార్టికల్చర్ పంటలపై ప్రభుత్వం రాయితీ ఇస్తూ అధికారులు అవగాహన కల్పిస్తే సాగు మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఎఇఒ కృపారావు మాట్లాడుతూ.. హార్టికల్చర్ పంటలు వేసుకుంటున్న రైతులకు వాటిపై అవగాహన కల్పిస్తూ సూచనలు ఇస్తున్నామని తెలిపారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిఐ రంగకృష్ణ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, బాధ్యతలు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర గురించి వివరించారు. ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని గుర్తు చేశారు. ఓపెన్ హౌస్‌లో భాగంగా పోలీస్ శాఖలో ఉపయోగించే ఆయుధాలు, వివిధ పరికరాలు, దర్యాప్తు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేసి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్రమశిక్షణ, చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్ కుమార్, ఎఎస్ఐ జగన్నాథం, ఆర్ఐ భవాని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణలో అగ్నిమాపక కేంద్రం కీలకం**

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ప్రజాపక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ మండల కేంద్రంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు,ప్రకృతి వైపరీత్యాలు,ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణలో అగ్నిమాపక శాఖ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఇప్పటివరకు ఖానాపూర్ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు నిర్మల్ లేదా ఇతర ప్రాంతాల నుండి ఫైర్ ఇంజన్ రావాల్సి వచ్చేదని, దీంతో సమయం వృథా అయ్యేదని గుర్తు చేశారు. ఖానాపూర్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కావడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.ప్రజల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణం పూర్తయితే ఖానాపూర్‌తో పాటు పరిసర మండలాల ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ సోయబ్, కౌన్సిలర్లు సత్యం, నిమ్మల రమేష్, తొడసం ఇందిరా, గుమ్ముల అశోక్, గొర్రె తిరుమల, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మజీద్, సంబంధిత శాఖ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాలికను మోసం చేసిన నిందితుడికి శిక్ష

**వివరాలు వెల్లడించిన ఎస్‌పి శ్రీనివాసరావు**



**ప్రజాపక్షం / మెదక్ :** బాలికను మాయమాటలతో నమ్మించి వెంట తీసుకెళ్లిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా నా విధిస్తూ మెదక్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను ఆమె తండ్రి 2025 అక్టోబర్ 14న హాస్టల్‌కు వెళ్లేందుకు బస్సు ఎక్కించారు. అయితే బస్సు వడియా రం వద్ద ఆగకపోవడంతో బాలిక చేగుంటలో ది గింది. తనకు పరిచయమున్న ఆనంద్ అనే యువకుడికి ఫోన్ చేయగా, అక్కడికి చేరుకున్న అతడు మాయమాటలు చెప్పి బాలికను వెంట తీసుకెళ్లా డు. అనంతరం మేడ్చల్, నిజామాబాద్ మీదుగా సికింద్రాబాద్‌కు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై తూ ప్రాన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా, పోలీసులు బాలికను గుర్తించి భరోసా కేంద్రానికి తరలించారు. కేసును సమగ్రంగా దర్యాప్తు చేసిన పోలీసులు కీలక సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించడంతో న్యాయస్థానం నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధించింది. ఈ కేసులో స మర్థవంతంగా పనిచేసిన దర్యాప్తు అధికారి ఎస్ఐ జ్యోతి, కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సిడిఒ నాగరాజు, లీగల్ అడ్వైజర్ శ్వేతతో పాటు సంబంధిత సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారిపై నేరాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి స్పష్టం చేశారు.

## ఉత్తర తెలంగాణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివక్ష

**కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే బ్రిడ్జిలను నిర్లక్ష్యం చేస్తోంది**

**ఎంపి అరవింద్, శాసనసభ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి**

**రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం ఎంపి, ఎమ్మెల్యేల భిక్షాటన**



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఉత్తర తెలంగాణపై సిఎం రేవంత్‌రెడ్డి వివక్ష చూపిస్తున్నారని శాసనసభ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మాధవనగర్ ఆర్‌ఒబి రెండవ అతి ప్రాధాన్యత గల పని అని, తాను నిరసన దీక్ష చేస్తూ భిక్షాటన అడుగుతున్నానని ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందూరు బిజెపి ఆధ్వర్యంలో భారీ నిరసన దీక్ష చేపట్టారు. ఇందుకోసం ఎంపి అరవింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డిలతో పాటు బిజెపి నాయకులు భిక్షాటన చేశారు. ఈ దీక్షా శిబిరానికి బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి కేవలం కొడంగల్‌కు సిఎంగా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలోని నిధులన్నీ కొడంగల్‌కే తరలిస్తూ ముఠామేస్త్రిగా వ్యవహరిస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. అనంతరం ఎంపి అరవింద్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే బ్రిడ్జిలపై పూర్తి నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ఎంపి అరవింద్ ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కమీషన్ల భయానికి కాంట్రాక్టర్లు పారిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రైల్వే బ్రిడ్జి పనులకు రాష్ట్ర వాటాగా వచ్చే నిధులను ఇప్పించాలని ఎంపి అరవింద్ కోరారు. ఈ నిరసన దీక్షా కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, స్రవంతిరెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, భరత్‌రెడ్డి, ప్రమోద్, నాయకులు, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

## నిధుల మంజూరుకు మంత్రి సీతక్క ఆదేశం



**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రంలోని అత్యంత పురాతనమైన మార్కండేయ మందిర పునర్‌నిర్మాణ పనులకు రూ.50 లక్షల నిధుల కేటాయింపు కోసం అవసరమైన ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని దేవాదాయ శాఖ కమిషన్‌ను మంత్రి సీతక్క ఆదేశించారు. మండల పద్మశాలి సంఘం విజ్ఞప్తి మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ మంత్రి సీతక్క దృష్టికి నిధుల మంజూరు అంశాన్ని తీసుకెళ్లారు. వెంటనే ఆమె నిధుల ప్రక్రియను ప్రారంభించాలని కమిషనర్‌ను ఆదేశించారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వెంకటగిరి, కోశాధికారి శ్రీనివాస్‌లతో పాటు నాయకులు మంత్రి సీతక్కను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్, రాజు, నరేందర్, గంగాకిషన్, కోటేశ్వర్, ఆనంద్, సురేష్, శ్రీహరి పాల్గొన్నారు

## 'సురక్షిత బచ్చన్ అభియాన్' అవగాహన కార్యక్రమం




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సురక్షిత బచ్చన్ అభియాన్ పాఠశాల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వివిధ పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంగారెడ్డి కార్యదర్శి బి.సౌజన్య ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ప్రాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ పరిధిలోని కేంద్రీయ విద్యాలయంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది, పోలీసులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, భద్రత, బాలలపై జరిగే లైగింక వేధింపులు, ఇతర ప్రమాదాల నుంచి రక్షణ పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. మంచి స్పర్శ– చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించడం, ప్రమాదకర పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉం డటం, తమకు ఏదైనా అసౌకర్యం, ప్రమాదం ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నమ్మకమైన పెద్దలకు తెలియజేయడం వంటి అంశాలను వివరించారు. అలాగే బాలలపై లైగింక నేరాల నుంచి రక్షణ చట్టం పోక్సో చట్టం 2012 గురించి వివరిస్తూ బాలలపై జరిగే నేరాలను అరికట్టడంలో చట్టం కల్పించే రక్షణ బాధ్యత, బాలబాలికలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, రక్షణ వ్యవస్థల గురించి తెలియజేశారు. ప్రతి చిన్నారి హక్కులను గౌరవాన్ని, భద్రతను కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసు అధికారులు కూడా బాలల భద్రత, ప్రమాదకర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవసరమైనప్పుడు పోలీసుల స హాయం పొందే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమను తాము గౌరవించుకోవడంతో పాటు ఇతరులను గౌరవించాలని, ఏ చిన్నారి ప్రమాదంలో ఉన్నా మౌనంగా ఉండకుండా తగిన సహాయం కోరాలని, చట్టాన్ని తీసుకొని పాటించాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొని బాలల రక్షణకు సంబంధించిన అవగాహన కార్యక్రమానికి సహకరించారు.

## ఎల్ నినో నేపథ్యంలో ఆరుతడి పంటలే సాగు చేయాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా రైతులు రబీలో ఆరుతడి పంటలనే సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అందుబాటులోని నీటి వనరులు, భూగర్భజలాల లభ్యత, విద్యుత్ సరఫరా తదితర పరిస్థితులను పరిగణలోకి తీసుకుని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వరి మినహా ఇతర పంటల సాగుకు చౌడు భూములు వంటి నేల రకాలు సహకరించకపోతే క్రాప్ హాలీడే పాటించాలని, వరి సాగు మాత్రం చేయవద్దని స్పష్టం చేశారు. నందిపేట్ మండలంలోని నూత్‌పల్లి రైతువేదికలో మంగళవారం మంగళవారం 'ఖేత్ బచావ్ అభియాన్' కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్‌లో వేసిన వరి పంట పూర్తిస్థాయిలో చేతికందేంత వరకు జిల్లా యంత్రాంగం తరఫున కాపాడుతామని రైతులకు భరోసా కల్పించారు. అయితే రబీలో మాత్రం వరి పంటకు సాగు నీరందించే పరిస్థితి ఉండదని కలెక్టర్ వెల్లడించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగంలోకి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు కీలక సూచనలు చేశారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పెసర్లు, మినుములు, శనగతో పాటు జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటలసాగును చేపట్టడం ఎంతో శ్రేయస్కరమని రైతులకు సూచించారు. భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయని, రానున్న రోజుల్లో సేద్యానికి కరెంట్ సరఫరాకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశముందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బందుల్లో పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాస్‌రావు, ఉద్యానవనశాఖ అధికారిణి సంధ్య, సర్పంచ్ రాజిరెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సారూ.. ఇదేమి పాలన?

**మొదటి జాబితాలో పేరు..**

**రెండో దఫాలో మాయం!**

**పేదల ఇందిరమ్మ ఇళ్లలో లోపం ఎవరిది?**

**అధికారులదా?.. రాజకీయ నాయకులదా?**



**ప్రజాపక్షం/నిర్మల్ :** పాలకులు మారుతున్నారు..అధికారులు మారుతున్నారు.. కానీ నిరుపేదల బతుకులు మాత్రం మారడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. న్యూలోలం గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం మొదటి జాబితాలో పేరు చూసుకుని సంబరపడగా, రెండో దఫా జాబితాలో పేరు కనిపించకపోవడంతో నిరాశలో మునిగిపోయింది.అసలు లోపం ఎక్కడుంది? అధికారుల నిర్లక్ష్యమా? రాజకీయ జోక్యమా? నిర్మల్ జిల్లా కలెక్టర్ సారు.. దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై లేదా?. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు పరిశీలించి దరఖాస్తును ఎల్ 3 నుంచి ఎల్ 1 స్థాయికి తీసుకొచ్చారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని, మొదటి జాబితాలోనే ఇల్లు మంజూరవుతుందని హామీ ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. దీంతో తమ సొంతింటి కల నెరవేరుతుందని ఆశపడ్డారు. కానీ రెండో దఫా జాబితాలో పేరు మాయమైంది.ఈ సమస్యపై ప్రజావాణిలో, కలెక్టరేట్‌లో సుమారు పదిసార్లు వినతిపత్రాలు సమర్పించినా పరిష్కారం లభించలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా భారీ వర్షాలు కురిసినప్పుడల్లా పాఠశాల భవనంలోనో, సంఘం గదిలోనో, గ్రామపంచాయతీ కార్యాలయంలోనో తల దాచుకోవాలని అధికారులు సూచించినట్లు వారు చెబుతున్నారు.

### పేదల ఇళ్లలో రాజకీయ పంచాయితీనా?

గ్రామంలో రెండు వర్గాల మధ్య సాగుతున్న రాజకీయ పోరు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై ప్రభావం చూపుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తోందని, నిజంగా ఇల్లు లేని పేదలు మాత్రం ఎదురుచూస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే పక్కా ఇళ్లు ఉన్నవారికి కూడా ఇళ్లు మంజూరవుతున్నాయనే ఆరోపణలపైనా విచారణ జరగాలి.అయితే ఈ ఆరోపణల్లో వాస్తవాలను నిర్ధారించేందుకు జిల్లా యంత్రాంగం నిష్పక్షపాతంగా పరిశీలన చేపట్టాలి. మొదటి జాబితాలో పేర్లు ఉండి తర్వాత కనిపించని దరఖాస్తుల వివరాలను సమీక్షించి, పేరు తొలగింపునకు కారణాలు వెల్లడించాలి.

### ఇప్పటికైనా స్పందించండి!

న్యూలోలం గ్రామానికి చెందిన బాధిత కుటుంబం సమస్యను పరిష్కరించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందో జిల్లా అధికారులు స్పష్టం చేయాలి. దరఖాస్తు స్థితిగతులను పరిశీలించి, అర్హత ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి. రాజకీయ జోక్యం, అధికారుల నిర్లక్ష్యంపై వస్తున్న ఆరోపణలను కూడా నిగ్గు తేల్చాలి. మొదటి జాబితాలో ఉండి రెండో దఫాలో మాయమైన పేర్లపై సమగ్ర విచారణ జరపాలి. పదిసార్లు వినతులు ఇచ్చిన బాధితుల సమస్యకు పరిష్కారం చూపాలి. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా పారదర్శక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## గణేష్‌కు మాజీ మంత్రి నివాళి

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం బిఆర్ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు తొలుపునూరిదానయ్య కుమారుడు గణేష్ మృతిపట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. మంగళవారం పువ్వాడ అజయ్‌కుమార్ వి.వెంకటాయపాలెం గ్రామంలో వారి స్వగృహంలో దానయ్యను పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా రవి, పగడాల నాగరాజు, బత్తుల మురళీప్రసాద్, కుతుంబాక నరేష్, పోట్లపల్లి రాజా, మాధంశెట్టి హరిప్రసాద్ పాల్గొన్నారు.



## వెంచర్‌లో విద్యుత్ వైర్లు చోరీ

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రభుత్వ అనుమతి పొందిన ఓ వెంచర్‌లో నాలుగు లక్షల విలువైన విద్యుత్ తీగలు చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రఘునాథపాలెం మండలం కోయచలక క్రాస్ రోడ్డులో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర ఎస్టేట్ వెంచర్‌నందు సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వెంచర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల నుంచి విద్యుత్ తీగలను చోరీ చేశారు. దీని విలువ సుమారు నాలుగు లక్షలు ఉంటుందని వెంచర్ నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వెంచర్‌లో విద్యుత్ సామగ్రి మాయం కావడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎవరైనా చోరీ చేశారా, లేదా అక్రమంగా తరలించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంచర్‌లో విద్యుత్ తీగలను గుర్తించి విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. దీనికి సంబంధించి రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రెండు లారీలు ఢీ డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/వైరా :** ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై మరోసారి ప్రమాదం చోటుచేసుకుంది. రెండు లారీలు మంగళవారం ఉదయం ఢీకొనడంతో గ్రానైట్ రాళ్లు క్యాబిన్‌పై పడి డ్రైవర్ మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... వైరా పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం బ్రిడ్జి సమీపంలో తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ రాళ్లను తీసుకెళ్తున్న లారీ ఎదురుగా కల్లూరు వైపు నుంచి వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో గ్రానైట్ రాళ్లు లారీ క్యాబిన్‌పై పడడంతో డ్రైవర్ షేక్ అనికుల్ క్యాబిన్‌లో చిక్కుకుని మృతిచెందాడు. ఈ ప్రమాదంతో హైవేలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వైరా ఎస్ఐ రామారావు సిబ్బందితో అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. దేవరపల్లి వెళ్లే వాహనాలను వైరా నుంచి తల్లాడ మీదుగా దారి మళ్లించారు.



## విష పురుగు కాటుకు చిన్నారి మృతి

### జాతీయ రహదారిపై బంధువులు, కుటుంబ సభ్యుల ఆందోళన -ట్రాఫిక్ జామ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన బాలికకు విష పురుగు కాటు వేయడంతో మృతి చెందిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన అయ్యదేవర ధన్యశ్రీ(5)కి విషపురుగు కుట్టడంతో అంగన్‌వాడీ కేంద్రంలోనే అనారోగ్యానికి గురైంది. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా మంగళవారం మృతిచెందింది. ధన్యశ్రీ తల్లిదండ్రులు రవి, స్వప్నది చింతకాని మండలం కోదుమూరు. టేదుమూరు ఓ ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నారు. రవి ఓ ప్రైవేటు దుకాణంలో కూలీగా పనిచేస్తుండగా స్వప్న కూలీ పనులకు వెళ్తుంది. అంగన్‌వాడీకి పంపిన పాప ప్రాణాలు కోల్పోవడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో దింపిన కొద్దిసేపటికే పాపకు ఒళ్లంతా దురదలు వచ్చి ఇబ్బంది పడటాన్ని ఆయా గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. అంగన్‌వాడీ కేంద్రంలోని విషపురుగు కాటుకు గురైందని ధన్యశ్రీ బంధువులు బైపాస్ రోడ్డు టేడ్డు బ్రిడ్జి వద్ద ఆందోళన నిర్వహించారు. దీనితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పోలీసులు ట్రాఫిక్‌ను ఖమ్మం నగరం వైపుకు మళ్లించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, మహిళా శిశు సంక్షేమ అధికారి ప్రమీల ఘటనా స్థలంకు చేరుకుని ధన్యశ్రీ బంధువులతో చర్చించారు. సంబంధిత అంగన్‌వాడీ ఆయాను సస్పెండ్ చేస్తామని ధన్యశ్రీ కుటుంబానికి రెండు లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. టౌన్ ఎసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, ఎఐఎస్ఎఫ్ నాయకులు లక్ష్మణ్, మనోజ్, ఎఐవైఎఫ్ నాయకులు శ్రవణ్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపూడి రవి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### పట్టభద్రుల ఎంఎల్సీ అభ్యర్థిగా ..

# రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి ఎంపిక హర్షణీయం

### ఎంఎల్సీ ఎన్నికల్లో సర్వోత్తమరెడ్డిని గెలిపించండి

### ఓటర్ల నమోదుపై దృష్టి సారించండి

### సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రానున్న పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయానికి పార్టీశ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంఎల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని ఎఐసిసి, పిసిసి ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ఉన్నత విద్యావంతుడిగా విశిష్ట రాజకీయ నేపథ్యం కలిగిన వ్యక్తిగా సర్వోత్తమరెడ్డి పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై సమగ్ర అవగాహన కలిగిన నేత అని కొనియాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గ ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపించినవిధంగానే రాబోయే ఎంఎల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఇతర జిల్లాల కంటే మిన్నగా ఖమ్మం జిల్లాలో పార్టీ యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ఎంఎల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నుంచి ఎన్నికల ప్రచారం ముగిసే వరకు పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని సర్వోత్తమరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఎంఎల్సీ అభ్యర్థి సర్వోత్తమరెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో తన వాణిని వినిపిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ శ్రేణులు దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాలరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, వడ్డెబోయిన నర్సింహారావు, సాధు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ రఘునాథపాలెం మండలం అధ్యక్షుడు దేవ్ సింగ్, సర్పంచ్‌లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటర్ల నమోదు వేగవంతం

### క్షేత్రస్థాయి పనులే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయి

### ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించిన మాజీ మంత్రి పువ్వాడ, ఎంఎల్సీ తక్కెళ్లపల్లి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాబోయే పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఎంఎల్సీ ఓట్ల నమోదు ప్రక్రియను బిఆర్ఎస్ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్, గాంధీచౌక్, జిల్లా కోర్టు, ఎస్‌బిఐటి కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటర్ల నమోదు కేంద్రాలను ఎంఎల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావుతో కలిసి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల నిబంధనల ప్రకారం గతంలో ఓటు ఉన్నవారు సైతం తప్పనిసరిగా మరల కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గతంలో ఓటు ఉందన్న ధీమాతో ఉండకుండా ప్రతి పట్టభద్రుడితో దరఖాస్తు చేయించే బాధ్యతను బిఆర్ఎస్ శ్రేణులు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల డేటా ఆధారంగా డివిజన్లు, ఇంటి నెంబర్ల వారీగా అర్హులను గుర్తించి ఫోన్ల ద్వారా నమోదు ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఫోన్లలో అందుబాటులోకి రాని వారి ఇళ్లకు వెళ్లి ఓటు నమోదు చేయించాలని సూచించారు. న్యాయవాదుల నమోదులో లీగల్ సెల్ విభాగం చొరవ చూపాలన్నారు.

ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు, నివాస ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి పట్టభద్రున్ని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. 2023లో పట్టభద్రులైన వారిని నూతన అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ల నమోదు గడువు మరో 10 రోజుల్లో ముగియనున్నందున ప్రతి కార్యకర్త రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. మైకులు, ఉపన్యాసాల కంటే క్షేత్రస్థాయిలో చేసే పనులే ఎన్నికల్లో పార్టీ విజయానికి బాటలు వేస్తాయన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను ఖమ్మం నగరంలో తానే స్వయంగా సమీక్షిస్తానని, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు నాయకులంతా సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, మగ్బూల్, రోజ్‌లీనా, నాగండ్ల కోటేశ్వరరావు, బిక్కసాని జశ్వంత్, బత్తుల మురళీ, పసుమర్తి రాంమోహన్, మెంతుల శ్రీశైలం, లీగల్ సెల్ ప్రతినిధులు బిచ్చాల తిరుమలరావు, కొత్తా వెంకటేశ్వరరావు, మేకల సుగుణారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ‘ధంసలాపురం’ చెరువులో

## గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

### చెరువును పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ధంసలాపురం చెరువులో విస్తరించిన గుర్రపుడెక్క మొక్కలను ప్రత్యేక యంత్రం ద్వారా తొలగింపుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం ధంసలాపురం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులో నీటి ఉపరితలంపై పెద్ద ఎత్తున విస్తరించిన గుర్రపుడెక్క, ఇతర జల కలుపు మొక్కలను తొలగించేందుకు ఆక్వాటిక్ వీడ్ హార్వెస్టర్ అనే ప్రత్యేక యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రం ద్వారా గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ వేగవంతంగా సాగడంతోపాటు మానవ శ్రమ కూడా తగ్గుతుందన్నారు. గుర్రపుడెక్క అధికంగా విస్తరించడం వల్ల నీటిలో ఆక్సిజన్ స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. గుర్రపుడెక్కను తొలగించడం ద్వారా నీటి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు జలవనరులను పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ గుర్రపుడెక్క తొలగింపు పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎ.మల్లేశం, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, కార్పొరేషన్ డిఇ నవ్యజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

## కరువు పరిస్థితులపై అప్రమత్తం

### భూగర్భ జలాల పరిరక్షణ, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

### నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వండి

### ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎలినినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రానున్న రోజుల్లో నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చేతికందే దశలో ఉన్న పంటలను కాపాడడంతో పాటు యాసంగిలో నీటి ఆధారిత పంటలను సాగు చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కలెక్టర్ అంకిత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రస్తుత పరిస్థితులు, నీటి నిల్వలు, వ్యవసాయం, విద్యుత్, పశు సంవర్థక శాఖ మొదలైన వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోతుందని దీనిపై ప్రత్యేక దృష్టిసారించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, వచ్చే జులై వరకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో వేడి మరింత పెరిగే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వాతావరణ పరిస్థితులను వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. వానాకాలం పంట సాగు చేసి చేతికందే దశలో ఉన్న దానిని కాపాడటానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నీటిపారుదల శాఖ మంత్రితో మాట్లాడి నీటిని విడుదల చేయిస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. యాసంగిలో ఎవరూ నీటి ఆధారిత పంటలను సాగు చేయకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖాధికారులపై ఉందని తొలి దశలోనే కఠినంగా వ్యవహరించాలన్నారు. పంట వ్యర్థాలకు నిప్పు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

యాసంగికి సంబంధించి పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతు ఏ విత్తనం కోరితే ఆ విత్తనం అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి బిందు సేద్యం ఉంటేనే అనుమతి ఇవ్వాలని ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి వృథాను తగ్గించాలని అదేవిధంగా రెగ్యులేటర్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను మూసివేసి కాలువల్లో నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు తాగునీటి అవసరాలను తీరుస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పాత తాగునీటి సరఫరా పథకాలను పునరుద్ధరించాలని, అవసరమైతే బోర్లను రిపేర్ చేయాలని మంత్రి ఆదేశించారు. గతంలో వాడుకలో ఉండి ఇప్పుడు వృథాగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను తిరిగి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విబి జీరాంజీ పథకం కింద నీటి వనరుల పెంపునకు సంబంధించి ఇంకుడు గుంటలు, బోర్ రీచార్జ్ గుంటలు, వ్యవసాయ కుంటలు, నీటి సంరక్షణ నిర్మాణాలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఈ నిధులకు 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, ఏడువేల కోట్లు నిధులు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పశుగ్రాసం కొరత రాకుండా తగు చర్యలు తీసుకోవాలని, పచ్చిగడ్డి పెంపకాన్ని ప్రోత్సహించాలని, నీటితొట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతర పర్యవేక్షణ అవసరం అన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేస్తే ప్రజలకు అన్ని వసతులు సమకూరుతాయని ఆయన తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మహిళా కండక్టర్ ప్రవళికను పరామర్శించిన రీజినల్ మేనేజర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆర్టీసి మహిళా కండక్టర్ ప్రవళికను టిజిఎస్ ఆర్టీసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ పరామర్శించారు. మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవళిక ఆదివారం విధినిర్వహణలో ఉండగా ఓ మహిళా ప్రయాణికురాలు ఘర్షణ పడింది. ఈ క్రమంలో సదరు మహిళ ప్రవళికపై దాడికి దిగి బస్సులో నుంచి తోసివేసింది. ఈ ప్రమాదంలో ప్రవళిక కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ తక్షణమే స్పందించి ప్రవళికకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రవళికను మంగళవారం ఆర్ఎం సరిరామ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అవసరమైన మేర అత్యుత్తమ చికిత్స అందించాలని, ఎలాంటి లోటుపాట్లు రానివ్వదని వైద్యులను కోరారు. బాధిత ఉద్యోగినికి ఆర్టీసి యాజమాన్యం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆర్ఎం తెలిపారు. ఆర్టీసి సిబ్బందిపై ఇలాంటి దాడులు జరగడం పట్ల కార్మిక వర్గాలు, ప్రజా సంఘాలు తీవ్ర విచారం, ఆగ్రహం వ్యక్తం చేశాయి. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ఎంపిఓలు, కార్యదర్శులు స్థానికంగా అందుబాటులో ఉండాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు స్థానిక కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎవరికీ సెలవులు అనుమతించబడవన్నారు. లోతట్టు ప్రాంతాలు, పాత మట్టి ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను గుర్తించి అవసరమైన సందర్భాలలో ముందస్తుగా సురక్షిత భవనాలకు తరలించాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీటి భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని, తాగునీటి ట్యాంకులను సూపర్ క్లోరినేషన్ చేయించాలన్నారు. లైన్ డిపార్ట్‌మెంట్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయ సహకారాలను అందించాలన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే కంట్రోల్ రూముకు సమాచారం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.



## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఐటిడిఎ అధికారుల ఆకస్మిక తనిఖీ

### విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిపై సమీక్ష

**ప్రజాపక్షం/బూర్గంపాడు :** బూర్గంపాడు మండలం ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్ చందన, భద్రాచలం ఎటిడిఓ రాధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. తొలుత ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించి ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల కాలపట్టికలు, ఉపాధ్యాయుల డైరీలు, కంప్యూటర్ ప్రయోగశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నిరంతర శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు బి.పిచ్చయ్యకు పాఠశాలకు సంబంధించిన పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహాన్ని పరిశీలించి, నిల్వ గది శుభ్రంగా, క్రమబద్ధంగా ఉండటంపై వార్డెన్ బి.రాములును అభినందించారు. పాఠశాల, వసతి గృహాల్లో పరిశుభ్రతను ప్రాధాన్యమిస్తూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచిబంచారు. ఈ తనిఖీలో ప్రధానోపాధ్యాయుడు బి.పిచ్చయ్య, సీనియర్ ఉపాధ్యాయులు బి.భీమా, బి.ప్రసాదరావు, బివి, రాజేష్, జి.భద్రు, జి.రాములు, టి.విజయ, బి.విజయ, వార్డెన్ బి.రాములు, రవి, వెంకట్, ధర్మరాజు, నరసింహారావు, కిషన్, రమేష్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేదాకా

# నిరసనలు ఆపబోం

- 'సర్'కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతాయి
- దేశం అంతటా కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారు
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శలు



**న్యూఢిల్లీ :** జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంత వరకు లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించేంత వరకు 'సర్'కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తమ నిరసనలను విరమించబోవని ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశ రాజధానిలోని త్రిలోక్‌పురిలో జరిగిన 'జన్ సున్వాయి' కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కింద ఆ ప్రాంతంలోని కేవలం నాలుగు బూత్‌ల నుంచే 416 మంది ఓటర్ల పేర్లను చట్టవిరుద్ధంగా తొలగించారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియపై ఫిర్యాదుల ప్రజా విచారణ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీతో పాటు సిపిఐ (ఎంఎల్) నాయకుడు దీపాంకర్ భట్టాచార్య, స్వరాజ్ ఇండియాకు చెందిన యోగేంద్ర యాదవ్ కూడా ఉన్నారు. 'ఇక్కడ నాలుగు బూత్‌లలో 416 మంది ఓటర్లను చట్టవిరుద్ధంగా తొలగించడం మేము చూశాం. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రశ్నించాం, కానీ ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించి దాక్కుంటున్నారు. అయినా మేము ఆగము. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను తొలగించే వరకు ప్రతిపక్షం తమ పోరాటాన్ని కొనసాగిస్తుంది. భారత దేశం అంతటా కోట్లాది మంది ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోతున్నారు' అని ఆయన రాహుల్ పేర్కొన్నారు. తాము ఈ విషయాన్ని చాలా కాలంగా లేవనెత్తుతున్నామని, అయితే ఇప్పుడు అత్యున్నత స్థాయిలో ఓట్లు దొంగిలించబడుతున్నాయని యావత్ దేశం అర్థం చేసుకోవడం ప్రారంభించిందని చెప్పారు. పేదలను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు, వారి హక్కులను లాక్కుంటున్నారని మండిపడ్డారు. 'ఇలా ఎందుకు జరుగుతోంది? కొద్దిమంది బిలియనీర్లకు చెందిన కొత్త భారతదేశాన్ని సృష్టించే ప్రయత్నం జరుగుతోంది.

**ప్రజా ఉద్యమం అణచివేతకు తీవ్ర యత్నం : ఖర్గే**

ఓట్ల దొంగతానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం ఎక్స్‌లో ఆరోపించారు. వారి దారి మళ్లించే ఎత్తుగడలు, బూటకపు ప్రచారం కేవలం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని మసకబారుస్తున్నాయని ఆయన అన్నారు. ప్రతి పౌరుడి ఓటును, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఇండియా కూటమి తన ప్రజాస్వామ్య పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన అన్నా రు. 'ఎన్నికల సంఘం రహస్యాలు మరిన్ని బయట పడుతూ, ఓట్ల దొ ంగతనం బట్టబయలవుతున్న వేళ, మోదీ–షా ప్ర జా ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు! వారు సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు రక్షిస్తున్నారు? అని ఖర్గే ప్రశ్నించారు. 'ఈ దారి మళ్లించే ఎత్తుగడలు, బూటకపు ప్ర చారం కేవలం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తూ, మన ప్రజాస్వామ్యాన్ని మసకబారుస్తున్నాయి!' అని ఆయన అన్నారు. దేశంలోని వివిధ ప్రాం తాల్లో జరిగినట్లు ఆరోపించబడుతున్న ఎన్నికల అవకతవకల ఉదాహరణలను జాబితా చేస్తూ ఒక గ్రాఫిక్‌ను కూడా ఖర్గే ఎక్స్‌లో షేర్ చేశారు. వెలుగులోకి వచ్చినప్పటికీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటానికి మోదీ ప్రభుత్వం సాధ్యమైన అన్ని ఎత్తుగడలూ వేస్తోందని కాంగ్రెస్ అధినేత సోమవారం ఆరోపించారు.

# తమిళనాడులో జైల్ బ్రేక్

- తేనిలోని సబ్‌జైల్ నుంచి 17 మంది ఖైదీలు పరార్ • గంటల్లోనే నలుగురిని పట్టుకున్న పోలీసులు



**తేని :** తమిళనాడులోని తేని జిల్లాలో ఉన్న సబ్ జైల్ నుంచి 17 మంది ఖైదీలు పరారయ్యారు. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. వైద్య అత్యవసర పరిస్థితి ఉందని నటిస్తూ, జైలు అధికారులను మభ్యపెట్టిన వారు పారిపోయారు. అయితే, పారిపోయిన వారిలో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. కొన్ని రోజుల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సి. జోసెఫ్ విజయ్ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యాన్ని ప్రశ్నిస్తూ ప్రతిపక్షాలు ఈ ఘటనపై తీవ్ర విమర్శలు చేశాయి. తమిళనాడులో 30 ఏళ్ల తర్వాత ఇలాంటి ఘటన జరగడం ఇదే మొదటిసారి అని డిఎంకె అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పేర్కొన్నారు. తేని జిల్లాలోని ఆండిపట్టి సమీపంలో ఉన్న తెక్కంపట్టి ఉపజైలు నుండి సోమవారం రాత్రి పొద్దుపోయాక 17 మంది విచారణ ఖైదీలు గార్డులను లొంగదీసుకుని పారిపోయారు. దీంతో వారి కోసం అంతర్రాష్ట్ర స్థాయిలో భారీ గాలింపు చర్యలు చేపట్టారు. తీవ్ర నిర్లక్ష్యం వహించినందుకు తొమ్మిది మంది జైలు అధికారులను తక్షణమే సస్పెండ్ చేశారు. విచారణ ఖైదీలందరినీ ఒకే గదిలో గుంపుగా ఉంచారు. వారు ఒక నకిలీ వైద్య అత్యవసర పరిస్థితిని సృష్టించారు. సహాయం చేయడానికి విధుల్లో ఉన్న జైలు సిబ్బంది గది తాళం తీసి లోపలికి ప్రవేశించిన వెంటనే, ఖైదీలు అకస్మాత్తుగా, హింసాత్మకంగా దాడి చేసి, భద్రతా సిబ్బందిని లొంగదీసుకున్నారు. ఈ దాడిలో ముగ్గురు అధికారులు గాయపడగా, ఖైదులు ఆ ప్రాంగణం నుండి పారిపోయారు. అయితే, వారిలో నలుగురిని కొద్దిసేపటికే తిరిగి పట్టుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ భారీ భద్రతా లోపంపై ప్రాథమిక విచారణ అనంతరం, జైళ్ల డైరెక్టర్ జనరల్ సందీప్ రాయ్ రాథోర్, ఖైదీలు పారిపోయిన సమయంలో విధుల్లో ఉన్న తొమ్మిది మంది జైలు గార్డులు, అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం సబ్ జైలులో ఉన్నత పోలీసు అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న సమగ్ర ఉన్నత స్థాయి విచారణ పూర్తయిన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామని న్యాయశాఖ మంత్రి ఆర్. నిర్మల్ కుమార్ ధృవీకరించారు. ఖైదీలు మూడు భద్రతా గేట్లతో పాటు ప్రధాన ద్వారం కూడా ఎలా బద్దలు కొట్టారో తెలుసుకోవడానికి మదురై జైలు డిఐజి మురుగేశన్ ఉపజైలులో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహిస్తున్నారు. పట్టుబడిన నలుగురు ఖైదీలను ప్రస్తుతం కానవళక్కు పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. హత్య, దొంగతనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి వివిధ నేరాలకు గతంలోనే అదుపులోకి తీసుకున్న మిగిలిన 13 మంది పరారీలో ఉన్న ఖైదీల కోసం సమగ్ర గాలింపు కొనసాగుతోంది. ఈ ఉల్లంఘనకు ప్రతిస్పందనగా, తమిళనాడులోని అన్ని జైళ్లలో భద్రతను కట్టుదిట్టం చేశామని, గస్తీని, సిసిటివి నిఘాను ముమ్మరం చేశామని ఒక అధికారి తెలిపారు. పరారీలో ఉన్న వారికి బయటి నుంచి సహాయం అందిందా లేదా వారు ఆ ప్రాంతం నుంచి పారిపోవడానికి స్థానిక వాహనాలను ఉపయోగించారా అని గుర్తించడానికి సమగ్ర దర్యాప్తు జరుగుతోందని ఆయన అన్నారు. ఖైదీల పరారీ ఘటనను వివరిస్తూ ఖైదీలు మూర్ఛ వచ్చినట్లు నటిస్తూ సమన్వయంతో పారిపోయారని ఒక అధికారి తెలిపారు. ఉమ్మడి సెల్‌లోని కొందరు ఖైదీలు, తమలో ఒకరికి ఆరోగ్యం బాగాలేదని, తక్షణ సహాయం అవసరమని చెబుతూ విధుల్లో ఉన్న వార్డెన్‌ను పిలిచారు. సహాయం చేయడానికి సిబ్బంది తాళం తీసి సెల్‌లోకి ప్రవేశించగానే, ఖైదీలు అకస్మాత్తుగా హింసాత్మక దాడికి పాల్పడి, భద్రతా సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో ముగ్గురు అధికారులు గాయపడ్డారు. ఆ తర్వాత వారు అక్కడి నుంచి పారిపోయారు. ఈ దక్షిణ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల, అంతర్రాష్ట్ర స్థాయిలో భారీ గాలింపు చర్యలు చేపట్టారు. పొరుగున ఉన్న కేరళ పోలీసులను కూడా అప్రమత్తం చేశారు. సరిహద్దుకు ఆవలి వైపున పశ్చిమ కనుమల అటవీ ప్రాంతాలు, ఇడుక్కి జిల్లాలో చురుకైన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పారిపోయిన వారిలో ప్రవీణ్ కుమార్, సిలంబరసన్, రాజా సికందర్, రాజ్‌కుమార్ అనే నలుగురిని మంగళవారం ఉదయం తిరిగి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, పరారీలో ఉన్న 13 మంది ఇంకా పరారీలోనే ఉన్నారు. పారిపోయిన వారిని పట్టుకోవడానికి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సౌత్ జోన్) విజయేంద్ర బిదారి 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఖైదీలలో చాలామంది మదురై, దాని పరిసర ప్రాంతాలకు చెందినవారు కావడంతో పొరుగున ఉన్న దిండిగల్ జిల్లాలో కూడా వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులను హై అలర్ట్‌లో ఉంచారు.

## నాలుగు హైకోర్టులకు కొత్త సిజెలు

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు
- తెలంగాణకు జస్టిస్ తపబ్రత చక్రవర్తి నియామకం



**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం, వివిధ హైకోర్టులకు నలుగురు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తులుగా నియమించాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బి.వి. నాగారత్న కూడా సభ్యులుగా ఉన్న ఈ కొలీజియం, ఈనెల 26న సమావేశమై, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషిని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం గుజరాత్ హైకోర్టు లో పనిచేస్తున్న జస్టిస్ మనష్ రంజన్ పాఠక్ ను గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తపబ్రత చక్రవర్తిని నియమించాలని కూ డా కొలీజియం సిఫార్సు చేసింది. అదే విధంగా ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ సింగ్‌ను నియమించాలని సూచించింది.

### నాడు ఎన్నికల వ్యవస్థ ధ్వంసం
# నేడు ప్రజల గొంతు అణచివేత

కాంగ్రెస్ మండిపాటు : జ్ఞానేశ్ కుమార్ అభిశంసన కార్యక్రమానికి ప్రభుత్వం అనుమతి నిరాకరణ

**న్యూఢిల్లీ :** ఇండియా కూటమి నవంబరు 1వ తేదీన ఢిల్లీలో ర్యాలీ నిర్వహించనుంది. అంతకు ముందు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ అభిశంసన కార్యక్రమం నిర్వహించాలని భావించింది. అయితే ఆ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. కాంగ్రెస్ పేర్కొంది. ఎన్నికల వ్యవస్థను ధ్వంసం చేసిన తర్వాత ప్రభుత్వం సామాన్య ప్రజల గొంతును నొక్కివేయడానికి కూడా ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని అశోక్ హోటల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు తొలుత తమకు అనుమతి ఇచ్చిందని, అయితే పోలీసుల జోక్యం తర్వాత అనుమతి నిరాకరించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు రామ్‌లీలా మైదాన్‌ను కాంగ్రెస్ బుక్ చేసుకుందని, కార్యక్రమాన్ని ఆ ప్రదేశానికి మార్చాలని నిర్ణయించుకుందని ఆయన తెలిపారు. ఓటు దొంగతనం ఆరోపణపై రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న జరిగే ర్యాలీకి ముందుగా, అక్టోబర్ 30న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ అభిశంసనకు ఇండియా కూటమికి చెందిన 21 పార్టీలు ప్రణాళిక రూపొందించాయని అన్నారు. తమ నేతలు రామ్‌లీలా మైదానికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాగా, వారిని పోలీసులు అడ్డుకున్నారని, కారణం ఏమిటో తెలియదని ర్యాలీ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఢిల్లీ కాంగ్రెస్ నాయకులతో కలిసి రామ్‌లీలా మైదానానికి వచ్చిన వేణుగోపాల్ అన్నారు. 'అయితే అది ఢిల్లీ పోలీసుల నిర్ణయం కాదు, ప్రధాని మోదీ, అమిత్ షాల నిర్ణయం. వాళ్ళు తమ పెంపుడు కుక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారు' అని ఆయన ఆరోపించారు. ఎన్ని అనుమతులు నిరాకరిస్తారు? ఎంత మందిని ఆపుతారు? అని అమిత్ షాను ప్రశ్నించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు లేదా సిఇసి పదవి నుంచి తొలగించే వరకు తాము ఆగబోమని ఆయన స్పష్టం చేశారు. 'ఒక చిన్న సమావేశానికి కూడా ప్రధాని మోదీ, అమిత్ షా ఎంత భయపడుతున్నారో మాకు తెలియదు... మేము వారి ఒత్తిడికి లొంగబోము, మా కార్యక్రమాన్ని నిర్వహిస్తాము. దాన్ని ఎలా నిర్వహించాలో మాకు తెలుసు' అని వేణుగోపాల్ అన్నారు.

**'సర్'పై ఇసి అఫిడవిట్..**

### సమాధానం కోసం పిటిషనర్లకు
# 'సుప్రీం' పది రోజులు గడువు



**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై ఎన్నిక ల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు 10 రోజుల గడువు ఇచ్చి ంది. ఎస్ఐఆర్ చట్ట నిబంధనలకు అనుగుణంగానే చేపట్టామని, ఈ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలను ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదించారని ఇసి తన అఫిడవిట్‌లో పేర్కొంది. మరోవైపు, బిహార్‌లో ఎస్ఐఆర్ సందర్భంగా ఓటరు నమోదు కోసం ఉపయోగించే ఫారం–6లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే మార్పులు చేశారన్న ఆరోపణలపై దాఖలైన తాజా పిటిషన్‌పైనా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహనతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల సం ఘం సోమవారం రాత్రి దాఖలు చేసిన అఫిడవిట్‌పై పది రోజుల్లోగా ప్రత్యుత్తర అఫిడవిట్ సమర్పించాలని తొలి పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యురాలు దోలా సేన్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పై ఎన్నికల సంఘం, ఇతర సంబంధిత పక్షాలకు కూడా నోటీసులు జారీ చేసింది.

**ఫారం–6లో మార్పులపై వివాదం**

బిహార్ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారం 6లో మార్పులు చేశారంటూ దోలా సేన్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆమె తరపున సీనియర్ న్యాయవాది, ఎంపి మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. ఫారం–6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం ఉందని ఎన్నికల సంఘం తప్పుగా పేర్కొంటోందని ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం6లో ఎలాంటి మార్పులూ చేయలేదని తన 248 పేజీల అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు విచారకరమని పేర్కొంది.

**ఎస్ఐఆర్‌కు చట్టబద్ధత ఉందన్న ఇసి**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఇసి తన వైఖరిని వెల్లడించింది. ఎస్ఐఆర్ నిర్వహణకు చట్టపరమైన అధికారం ఉందని, సంబంధిత ఉత్తర్వులకు ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ అఫిడవిట్‌ను కోర్టులో దాఖలు చేయడానికి కూడా ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఉప ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేతురు తరపున ఈ సమాధానాన్ని దాఖలు చేశారు.

## ఎన్నికలకు కచ్చిత తేదీని ప్రకటించాలి

జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ విద్యార్థులు డిమాండ్

జెఎంఐఎస్‌యు పునరుద్ధరణకు 16 రోజులుగా నిరసనలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ విద్యార్థి సంఘం (జెఎంఐఎస్‌యు) పునరుద్ధరణను డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసన మంగళవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. యూనియన్ రాజ్యాంగానికి ఆమోదం లభించిన 15 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాలని విశ్వవిద్యాలయం నిర్ణయించినప్పటికీ, విద్యార్థులు తమ ఆందోళనను విరమించుకోవడానికి నిరాకరిస్తున్నారు. 2006 నుంచి జరగని ఈ ఎన్నికలకు ఒక కచ్చితమైన తేదీని, రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ఒక స్పష్టమైన కాలపరిమితిని ఇవ్వాలని నిరసన చేస్తున్న విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అధికారయంత్రాంగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కొనసాగుతున్న ఆందోళనల మధ్య తరగతులను ఆన్‌లైన్‌కు మార్చడాన్ని, క్యాంపస్ సౌకర్యాలను మూసివేయడాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. 'జామియా అధికారయంత్రాంగం, ఢిల్లీ పోలీసుల సహాయంతో, విద్యార్థి సంఘం ఎన్నికలను ధృవీకరించే నోటీసు ఇవ్వడం తప్ప మిగతావన్నీ చేస్తోంది. మేము క్యాంపస్ మూసివేతను తిరస్కరిస్తున్నాము! ఆన్‌లైన్ తరగతులను తిరస్కరిస్తున్నాము! అంగుళం కూడా వెనక్కి తగ్గము! జెఎంఐఎస్‌యును పునరుద్ధరించండి!' అని జామియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొంది. విశ్వవిద్యాలయానికి చెందిన అన్ని గేట్లు, ప్రవేశ మార్గాలను మూసివేశారని కూడా విద్యార్థులు ఆరోపించారు. భద్రతా సిబ్బంది, విశ్వవిద్యాలయ భద్రతా సలహాదారుతో కలిసి, క్యాంపస్ గేట్ల వద్ద విద్యార్థులను పోలీసులకు అప్పగిస్తున్నారని, ఇది 'ఏకపక్ష' నిర్బంధాలకు అరెస్టులకు దారితీస్తోందని విద్యార్థులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైబ్రరీ, ఇతర క్యాంపస్ సౌకర్యాలను మూసివేయడం, ఆన్‌లైన్ తరగతులకు మారడంతో పాటు, విద్యార్థులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని కూడా వారు పేర్కొన్నారు. జెఎంఐ విద్యార్థి సంఘాన్ని తక్షణమే పునరుద్ధరించాలని, చేయాలని ఆ సంఘాలు డిమాండ్ చేశాయి.

# తెలంగాణలో జిల్లాల వారీగా కరువు మండలాలు




**1.ఆదిలాబాద్ (20 మండలాలు):** ...భీంపూర్ (తీవ్ర), ఇంద్రవెల్లి (తీవ్ర),ఆదిలాబాద్ అర్బన్ (తీవ్ర), గాదిగూడ (మధ్యస్థ), నార్నూర్ (మధ్యస్థ), గుడిహత్నూర్ (మధ్యస్థ), ఆదిలాబాద్ రూరల్ (మధ్యస్థ), మావల (మధ్యస్థ), తాంసి (మధ్యస్థ), బజార్హత్నూర్ (మధ్యస్థ), బోథ్ (మధ్యస్థ), నేరడిగొండ (మధ్యస్థ), ఇచ్చోడ (మధ్యస్థ), ఉట్నూర్ (మధ్యస్థ), సొనాల (మధ్యస్థ), జైనథ్ (మధ్యస్థ), బేల (మధ్యస్థ), సిరికొండ (తీవ్ర), సాత్నాల (మధ్యస్థ), భోరజ్ (మధ్యస్థ).

**2. భద్రాద్రి కొత్తగూడెం (16 మండలాలు):** ఆళ్లపల్లి (తీవ్ర), లక్ష్మీదేవిపల్లి (తీవ్ర),పాల్వంచ (తీవ్ర), భద్రాచలం (తీవ్ర), పినపాక (మధ్యస్థ), చర్ల (మధ్యస్థ), దుమ్ముగూడెం (మధ్యస్థ), అశ్వాపురం (మధ్యస్థ), మణుగూరు (మధ్యస్థ), అన్నపురెడ్డిపల్లి (మధ్యస్థ), చుంచుపల్లి (మధ్యస్థ), కొత్తగూడెం (మధ్యస్థ), బూర్గంపాడు (మధ్యస్థ), ములకలపల్లి (మధ్యస్థ), దమ్మపేట (మధ్యస్థ), అశ్వారావుపేట (మధ్యస్థ).

**3. హనుమకొండ (14 మండలాలు):..** వేలేరు (మధ్యస్థ), ఎల్కతుర్తి (మధ్యస్థ), కమలాపూర్ (మధ్యస్థ), హసన్పర్తి (మధ్యస్థ), కాజీపేట (మధ్యస్థ), హనుమకొండ (మధ్యస్థ), ఐనవోలు (మధ్యస్థ), దామెర (మధ్యస్థ), ఆత్మకూరు (మధ్యస్థ), శాయంపేట (మధ్యస్థ), పరకాల (మధ్యస్థ), భీమదేవరపల్లి (మధ్యస్థ), ధర్మసాగర్ (మధ్యస్థ), నడికూడ (మధ్యస్థ).

**4. జగిత్యాల (3 మండలాలు):** జగిత్యాల రూరల్ (మధ్యస్థ) , జగిత్యాల (మధ్యస్థ), కొడిమ్యాల (మధ్యస్థ).

5. జనగామ (4 మండలాలు):.. :రఘునాథపల్లి (తీవ్ర), తరిగొప్పుల (మధ్యస్థ), జాఫర్గఢ్ (మధ్యస్థ), పాలకుర్తి (మధ్యస్థ).

**6. జయశంకర్ భూపాలపల్లి (5 మండలాలు):** మహదేవ్‌పూర్ (మధ్యస్థ), ముత్తారం మహదేవ్‌పూర్ (మధ్యస్థ), కాటారం (మధ్యస్థ), మలహర్‌రావు (మధ్యస్థ), కొత్తపల్లి (గోరి) (మధ్యస్థ).

**7. జోగులాంబ గద్వాల (13 మండలాలు):** కాలూర్ తిమ్మానదొడ్డి (తీవ్ర), ధారూర్ (తీవ్ర), గద్వాల (తీవ్ర), ఇటిక్యాల (తీవ్ర), మల్దకల్ (తీవ్ర), గట్టు (తీవ్ర), అయిజ (తీవ్ర), రాజోలి (తీవ్ర), వడ్డేపల్లి (తీవ్ర), మానవపాడు (తీవ్ర), ఉండవెల్లి (తీవ్ర), అలంపూర్ (తీవ్ర), ఎర్రవల్లి (తీవ్ర).

**8. కామారెడ్డి (4 మండలాలు):**జుక్కల్ (మధ్యస్థ),పెద్ద కొడప్గల్ (మధ్యస్థ), సదాశివనగర్ (మధ్యస్థ), మహమ్మద్నగర్ (మధ్యస్థ).

**9. కరీంనగర్ (3 మండలాలు):**కరీంనగర్ రూరల్ 2 (మధ్యస్థ), కరీంనగర్ (మధ్యస్థ), హుజూరాబాద్ (మధ్యస్థ).

**10. ఖమ్మం (17 మండలాలు):..:** సింగరేణి (తీవ్ర), కామేపల్లి (తీవ్ర), రఘునాథపాలెం (తీవ్ర), కుసుమంచి (తీవ్ర), నేలకొండపల్లి (తీవ్ర), ముదిగొండ (తీవ్ర), ఖమ్మం అర్బన్ (తీవ్ర), బోనకల్ (తీవ్ర), మధిర (తీవ్ర), ఎర్రుపాలెం (తీవ్ర), ఖమ్మం రూరల్ (మధ్యస్థ), కొణిజర్ల (మధ్యస్థ), ఏనుకూరు (మధ్యస్థ), కల్లూరు (మధ్యస్థ), పెనుబల్లి (మధ్యస్థ), సత్తుపల్లి (మధ్యస్థ), వేంసూర్ (మధ్యస్థ).

**11. కొమురం భీం ఆసిఫాబాద్(5మండలాలు):** జైనూర్ (మధ్యస్థ), సిర్పూర్ (యు) (మధ్యస్థ), కౌటాల (మధ్యస్థ), చింతలమానెపల్లి (మధ్యస్థ), బెజ్జూర్ (మధ్యస్థ).

**12. మహబూబాబాద్ (7 మండలాలు):** డోర్నకల్ (మధ్యస్థ), కురవి (మధ్యస్థ), గూడూరు (మధ్యస్థ), నెల్లికుదురు (మధ్యస్థ), సీరోలు (మధ్యస్థ), కొత్తగూడ (మధ్యస్థ), ఇనుగుర్తి (మధ్యస్థ).

**13. మహబూబ్‌నగర్ (13 మండలాలు):**చిన్నచింతకుంట (తీవ్ర), కోయిల్కొండ (తీవ్ర), గండీడ్ (మధ్యస్థ), హన్వాడ (మధ్యస్థ), మహబూబ్‌నగర్ రూరల్ (మధ్యస్థ), దేవరకద్ర (మధ్యస్థ), అడ్డకల్ (మధ్యస్థ), మూసాపేట (మధ్యస్థ), మహబూబ్‌నగర్ అర్బన్ (మధ్యస్థ), బాలానగర్ (మధ్యస్థ), రాజాపూర్ (మధ్యస్థ), జడ్చర్ల (మధ్యస్థ), కౌకుంట్ల (మధ్యస్థ).

**14. మంచిర్యాల (11 మండలాలు):** జన్నారం (మధ్యస్థ), దండేపల్లి (మధ్యస్థ), హాజీపూర్ (మధ్యస్థ), వేమనపల్లి (మధ్యస్థ), నెన్నెల (మధ్యస్థ), మందమర్రి (మధ్యస్థ), మంచిర్యాల (మధ్యస్థ), నస్పూర్ (మధ్యస్థ), భీమారం (మధ్యస్థ), చెన్నూర్ (మధ్యస్థ), కోటపల్లి (మధ్యస్థ).

**15. మెదక్ (1 మండలం):** మనోహరాబాద్ (మధ్యస్థ).

**16. మేడ్చల్ మల్కాజిగిరి (9 మండలాలు):** కుత్బుల్లాపూర్ (తీవ్ర), మేడిపల్లి (తీవ్ర), ఘట్‌కేసర్ (తీవ్ర),మేడ్చల్ (మధ్యస్థ), బాచుపల్లి (మధ్యస్థ), అల్వాల్ (మధ్యస్థ), మల్కాజిగిరి (మధ్యస్థ), కాప్రా (మధ్యస్థ), కీసర (మధ్యస్థ).

**17.ములుగు (4 మండలాలు):** గోవిందరావుపేట (మధ్యస్థ), ఏటూరు నాగారం (మధ్యస్థ), వెంకటాపురం (మధ్యస్థ), మంగపేట (మధ్యస్థ).

**18.నాగర్‌కర్నూల్ (13 మండలాలు):**ఊర్కొండ (తీవ్ర), వెల్దండ (తీవ్ర), చారకొండ (తీవ్ర), వంగూరు (తీవ్ర), అమ్రాబాద్ (తీవ్ర), పదర (తీవ్ర), బల్మూర్ (తీవ్ర), లింగాల (తీవ్ర), పెద్దకొత్తపల్లి (తీవ్ర), కోడేర్ (తీవ్ర), బిజినేపల్లి (మధ్యస్థ), కల్వకుర్తి (మధ్యస్థ), అచ్చంపేట (మధ్యస్థ).

**19. నల్లగొండ (28 మండలాలు):** నకిరేకల్ (తీవ్ర), చండూరు (తీవ్ర), మర్రిగూడ (తీవ్ర), చింతపల్లి (తీవ్ర), నాంపల్లి (తీవ్ర), నిడమనూరు (తీవ్ర), దామరచర్ల (తీవ్ర), అడవిదేవులపల్లి (తీవ్ర), తిరుమలగిరి సాగర్ (తీవ్ర), పెద్దవూర (తీవ్ర), పెద్ద అడిశర్లపల్లి (తీవ్ర), నేరెడుగొమ్ము (తీవ్ర), గట్టుప్పల్ (తీవ్ర), చిత్యాల (మధ్యస్థ), కేతేపల్లి (మధ్యస్థ), నల్లగొండ (మధ్యస్థ), త్రిపురారం (మధ్యస్థ), మడుగులపల్లి (మధ్యస్థ), వేములపల్లి (మధ్యస్థ), దేవరకొండ (తీవ్ర), చందంపేట (తీవ్ర), గుండ్లపల్లి (తీవ్ర), కనగల్ (తీవ్ర), మునుగోడు (తీవ్ర), నార్కట్‌పల్లి (తీవ్ర), శాలిగౌరారం (తీవ్ర), తిప్పర్తి (మధ్యస్థ), మిర్యాలగూడ (మధ్యస్థ).

**20. నారాయణపేట (13 మండలాలు):**దామరగిద్ద (తీవ్ర), నారాయణపేట (తీవ్ర), మాగనూర్ (తీవ్ర), కృష్ణ (తీవ్ర), మఖ్తల్ (తీవ్ర),నర్వ (తీవ్ర), మరికల్ (తీవ్ర), ధన్వాడ (తీవ్ర), గుండుమాల్ (తీవ్ర), కోస్గి (తీవ్ర), మద్దూర్ (తీవ్ర), ఉట్కూర్ (తీవ్ర),కొత్తపల్లి (తీవ్ర).

**21. నిర్మల్ (9 మండలాలు):**ఖానాపూర్ (తీవ్ర), కుబీర్ (మధ్యస్థ), భైంసా (మధ్యస్థ), కుంటాల (మధ్యస్థ), నిర్మల్ అర్బన్ (మధ్యస్థ), సోన్ (మధ్యస్థ), లక్ష్మణచాంద (మధ్యస్థ), కడ్డంపెద్దూర్ (మధ్యస్థ), దస్తూరాబాద్ (మధ్యస్థ).

**22.నిజామాబాద్ (18 మండలాలు):** నవీపేట్ (మధ్యస్థ), నందిపేట్ (మధ్యస్థ), ఆర్మూర్ (మధ్యస్థ), ముప్కాల్ (మధ్యస్థ), మెండోరా (మధ్యస్థ), ఎర్గట్ల (మధ్యస్థ), వేల్పూర్ (మధ్యస్థ), మాక్లూర్ (మధ్యస్థ), నిజామాబాద్ నార్త్ (మధ్యస్థ), నిజామాబాద్ రూరల్ (మధ్యస్థ), నిజామాబాద్ సౌత్ (మధ్యస్థ), ముగ్పాల్ (మధ్యస్థ), ఇందల్వాయి (మధ్యస్థ), మోస్రా (మధ్యస్థ), చందూర్ (మధ్యస్థ),ఆలూర్ (మధ్యస్థ), వర్ని (మధ్యస్థ), పోతంగల్ (మధ్యస్థ).

**23. రాజన్న సిరిసిల్ల (2 మండలాలు):** వీర్నపల్లి (మధ్యస్థ), ఇల్లంతకుంట (మధ్యస్థ).

**24. రంగారెడ్డి (18 మండలాలు):** గండిపేట్ (తీవ్ర), రాజేంద్రనగర్ (తీవ్ర), హయత్‌నగర్ (తీవ్ర), అబ్దుల్లాపూర్‌మెట్ (తీవ్ర), కొత్తూర్ (తీవ్ర), బాలాపూర్ (మధ్యస్థ), సరూర్‌నగర్ (మధ్యస్థ), ఇబ్రహీంపట్నం (మధ్యస్థ), యాచారం (మధ్యస్థ), ఆమనగల్ (మధ్యస్థ), కేశంపేట (మధ్యస్థ), కందుకూరు (మధ్యస్థ), మహేశ్వరం (మధ్యస్థ), శంషాబాద్ (మధ్యస్థ), చేవెళ్ల (మధ్యస్థ), షాబాద్ (మధ్యస్థ), ఫారూఖ్‌నగర్ (మధ్యస్థ), జిల్లెడు చౌదరిగూడెం (మధ్యస్థ).

**25. సంగారెడ్డి (28 మండలాలు):**జహీరాబాద్ (తీవ్ర), కోహీర్ (తీవ్ర), మనూరు (మధ్యస్థ), రాయ్కోడ్ (మధ్యస్థ), నయకల్ (మధ్యస్థ), మొగ్దంపల్లి (మధ్యస్థ), మునిపల్లి (మధ్యస్థ), ఆందోల్ (మధ్యస్థ),పుల్కల్ (మధ్యస్థ), హత్నూర్ (మధ్యస్థ), జిన్నారం (మధ్యస్థ), అమీన్‌పూర్ (మధ్యస్థ), ఝరాసంగం (మధ్యస్థ), నాగల్గిద్ద (మధ్యస్థ), పటాన్‌చెర్ (మధ్యస్థ), సదాశివపేట (మధ్యస్థ), వట్పల్లి (మధ్యస్థ), గుమ్మడిదల (మధ్యస్థ), కంది (మధ్యస్థ), సంగారెడ్డి (మధ్యస్థ), రామచంద్రాపురం (మధ్యస్థ), కల్హేర్ (మధ్యస్థ), కంగ్టి (మధ్యస్థ), కొండాపూర్ (మధ్యస్థ), సిర్గాపూర్ (మధ్యస్థ), నారాయణఖేడ్ (మధ్యస్థ), నిజాంపేట్ (మధ్యస్థ), చౌటకూర్ (మధ్యస్థ).

**26. సిద్దిపేట (8 మండలాలు):** కొమురవెల్లి (తీవ్ర), బెజ్జంకి (మధ్యస్థ), వర్గల్ (మధ్యస్థ), ములుగు (మధ్యస్థ), మర్కూక్ (మధ్యస్థ), చేర్యాల (మధ్యస్థ), నారాయణరావుపేట (మధ్యస్థ), ధూల్మిట్ట (మధ్యస్థ).

**27. సూర్యాపేట (23 మండ-లాలు):** అనంతగిరి (తీవ్ర), చిలుకూరు (తీవ్ర), పాలకీడు (తీవ్ర), చింతలపాలెం (తీవ్ర), నాగారం (మధ్యస్థ), తిరుమలగిరి (మధ్యస్థ), నూతనకల్ (మధ్యస్థ), జాజిరెడ్డిగూడెం (మధ్యస్థ), సూర్యాపేట (మధ్యస్థ), ఆత్మకూరు (ఎస్) (మధ్యస్థ), మోతె (మధ్యస్థ), చివ్వెంల (మధ్యస్థ), పెన్పహాడ్ (మధ్యస్థ), మునగాల (మధ్యస్థ), నడిగూడెం (మధ్యస్థ), కోదాడ (మధ్యస్థ), గరిడేపల్లి (మధ్యస్థ), నేరేడుచర్ల (మధ్యస్థ), మేళ్లచెరువు (మధ్యస్థ), తుంగతుర్తి (మధ్యస్థ), మద్దిరాల (మధ్యస్థ), మట్టంపల్లి (మధ్యస్థ), హుజూర్‌నగర్ (మధ్యస్థ).

**28. వికారాబాద్ (20 మండలాలు):** మార్పల్లి (తీవ్ర),నవాబ్‌పేట (తీవ్ర), కుల్కచర్ల (తీవ్ర), దోమ (తీవ్ర), బట్వారం (తీవ్ర), పెద్దేముల్ (తీవ్ర), తాండూరు (తీవ్ర), బషీరాబాద్ (తీవ్ర), యెల్లాల్ (తీవ్ర), కొడంగల్ (తీవ్ర), దౌల్తాబాద్ (తీవ్ర), మోమిన్‌పేట్ (మధ్యస్థ), వికారాబాద్ (మధ్యస్థ), పరిగి (మధ్యస్థ), ధారూర్ (మధ్యస్థ), బొంరాస్‌పేట్ (మధ్యస్థ), దుద్యాల్ (మధ్యస్థ), కోటపల్లి (మధ్యస్థ), పూడూర్ (మధ్యస్థ), చౌడాపూర్ (మధ్యస్థ).

**29. వనపర్తి (11 మండలాలు):**అమరచింత (తీవ్ర), పాన్గల్ (తీవ్ర), కొత్తకోట (తీవ్ర), ఆత్మకూరు (తీవ్ర), వీపనగండ్ల (తీవ్ర), ఎదుల (తీవ్ర), పెద్దమందడి (మధ్యస్థ), ఘన్‌పూర్ (మధ్యస్థ), గోపాల్‌పేట (మధ్యస్థ), వనపర్తి (మధ్యస్థ), పెబ్బేరు (మధ్యస్థ).

**30. వరంగల్ (8 మండలాలు):** దుగ్గొండి (మధ్యస్థ), నర్సంపేట (మధ్యస్థ), చెన్నారావుపేట (మధ్యస్థ), సంగెం (మధ్యస్థ), పర్వతగిరి (మధ్యస్థ), నెక్కొండ (మధ్యస్థ), ఖిల్లా వరంగల్ (మధ్యస్థ), వరంగల్ (మధ్యస్థ).

**31. యాదాద్రి భువనగిరి (17 మండలాలు):** తుర్కపల్లి (ఎం) (తీవ్ర), మోత్కూర్ (మధ్యస్థ), రాజాపేట (మధ్యస్థ), మోటకొండూర్ (మధ్యస్థ), యాదగిరిగుట్ట (మధ్యస్థ), భువనగిరి (మధ్యస్థ), బొమ్మలరామారం (మధ్యస్థ), బీబీనగర్ (మధ్యస్థ), భూదాన్ పోచంపల్లి (మధ్యస్థ), రామన్నపేట (మధ్యస్థ), అడ్డగూడూరు (మధ్యస్థ), ఆలేరు (మధ్యస్థ), ఆత్మకూర్ (ఎం) (మధ్యస్థ), చౌటుప్పల్ (మధ్యస్థ), గుండాల (మధ్యస్థ), నారాయణపూర్ (మధ్యస్థ), వలిగొండ (మధ్యస్థ).

# రిగ్గింగ్‌తో లులా గెలుపు: ట్రంప్ అక్కసు ఆరోపణ

- తనకుతానే ప్రతిపక్ష నేతగా ప్రకటించుకున్న ఫ్లావియా
- 2027 జనవరి 5న లులా పదవీ బాధ్యతల స్వీకరణ

**వాషింగ్టన్:** బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో లూయిజ్ ఇనా సియో లులా డా సిల్వా సాధించిన విజయం రిగ్గింగ్‌తో కూడుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాధార ఆరోపణలు చేశారు. ''ఎన్నికలు వివాద రహితంగా ఉండలేదు, లులా ఎన్నిక నాకు చాలా దారుణంగా అనిపించింది'' అని మధ్యంతర ఎన్నికల ర్యాలీలో పాల్గొనేందుకు మిస్సిస్సిపీకి బయలుదేరేముందు ట్రంప్ విలేకరులతో చెప్పారు. ''ఓట్ల లెక్కింపు విధానం చాలా దారుణంగా ఉందని నాకు అనిపించింది, నిజం చెప్పాలంటే ఇది అసలు రిగ్గింగ్‌తో కూడిన ఎన్నిక''న్నారు. లులా ప్రధాన ప్రత్యర్థి ఫ్లావియా బోల్సెనారో ఈ ఎన్నికను ఎట్టకేలకు తాత్కాలికంగా అంగీకరించినప్పటికీ అనేక విధాలుగా జరిగిందని సవాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నాలుగోసారి, అదికూడా రన్‌ఆఫ్ ఎన్నికల్లో లక్షలమంది ప్రజాసమీకరణ ద్వారా అసాధ్యమైన గెలుపును సుసాధ్యం చేసుకున్న లులా డసిల్వా 2027 జనవరి 5వ తేదీన అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. మొదటిరౌండ్ ఎన్నికల ఫలితాల తర్వాత జానేనెస్ విస్తారంగా సోషల్ మీడియాలో భారీ ప్రచారం నిర్వహించి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించారు. వాట్సాప్‌లో ''లూలాస్ ఆర్మీ'' అనే పేరుతో ఆయన మెసేజింగ్ యాప్ ద్వారా గొప్ప పాత్ర నిర్వహించారు. దాదాపు 1.10 కోట్లమంది ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడంలో ఈ మెసేజింగ్ యాప్ కీలకపాత్ర నిర్వహించింది. బ్రసిలియా విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ రాజకీయ సంబంధాల ప్రొఫెసర్ జూలియానో కోర్టిన్‌హాస్ మాట్లాడుతూ, సోషల్ మీడియా ద్వారా నిర్వహించిన లులా అనుకూల ప్రచారంవల్ల మెటా నిర్వహించిన పక్షపాత ధోరణిని లులా అడ్డుకోగలిగారన్నారు. ఇద్దరు ప్రధాన అభ్యర్థులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని మెటాకు బ్రెజిల్ కోర్టు అక్టోబరు 15న తీర్పు చెప్పింది. సోమవారం ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత బ్రెజిల్ ఎలక్టోరల్ కోర్టు కూడా లులా డసిల్వా విజయాన్ని సమర్థించింది. ఆదివారం జరిగిన ఎన్నికల్లో 51.8 శాతం ఓట్లు సంపాదించుకున్న లులాకు ప్రధాన ప్రత్యర్థి ఫ్లావియా బోల్సెనారో కంటే 44 లక్షల ఓట్లు అధికంగా లభించాయి. అమెరికా ప్రోత్సహిస్తున్న మితవాద ప్రభంజనాన్ని అడ్డుకున్న లులా ప్రజాదరణ ట్రంప్ సహించలేకపోతున్నారని లులా అనుచరులు విమర్శించారు.



కాగా లులాను ప్రతిఘటించిన ప్రధాన ప్రత్యర్థి ఫ్లావియా బోల్సెనారో మొదట ఈ ఎన్నికల ఫలితాలను ఒప్పుకోకుండా తిరస్కరించారు. ఆ తర్వాత ఆయన తనను తాను ప్రతిపక్ష నాయకుడుగా ప్రకటించుకున్నారు. దేశంలో ప్రతిపక్షంగా పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఐనప్పటికీ తాను ఈ ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తానని అన్నారు. పోలీసులు తన పాస్‌పోర్టులను స్వాధీనం చేయాలని అధికారం, తనను ఎవ్వరూ అడ్డుకోలేరని, తన గొంతు నొక్కలేరని ఉద్ఘాటించారు. తనను జైలులో పెట్టే అవకాశం ఉందని ఆయన భయాలు వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలక్రితం జరిగిన ఎన్నికల్లో మూడోసారి లులా డసిల్వా విజయం సాధించినప్పుడు ఫ్లావియా బోల్సెనారో తండ్రి జైర్ బోల్సెనారో దేశంలో కుట్రకు ప్రయత్నించారన్న ఆరోపణలపై 27 ఏళ్ళు జైలుశిక్ష అనుభవిస్తున్నారు. తనను కూడా జైలుపాలు చేసే అవకాశం ఉందని ఫ్లావియా భయాలు వ్యక్తం చేశారు. ఈ విజయంతో రాజకీయ ముందు ఫ్లావియా పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఈ ఎన్నికలను సవాలు చేస్తానన్నారు.

# భద్రతామండలిలో వీటో అధికారం లేకపోతే ఎలా?

- సభ్యులందరికీ సమానహక్కులుండాలి
- భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని డిమాండ్

**న్యూయార్క్:** భద్రతామండలిలో వీటో అధికారంలేని సభ్యత్వం ద్వితీయశ్రేణి పౌరసత్వం కాగలదని, వారు రెండో తరగతి దేశాలుగా మారపోతారని ఐక్యరాజ్యసమితిలో భారత దేశ శాశ్వత ప్రతినిధి, రాయబారి హరీశ్ పర్వతనేని అన్నారు. ఇంటర్–గవర్నమెంటల్ ప్లీనరీలో ''వీటో అధికారంపై క్లస్టర్ చర్చ'' అనే అంశంపై సోమవారం ఆయన మాట్లాడుతూ, భద్రతామండలిలో వీటో అధికారం లేని తాత్కాలిక సభ్యులసంఖ్యను పెంచాలనే ఆలోచన విరమించాలని కోరారు. పాతకాలపు భద్రతామండల ఈ కొత్త యుగం సమస్యలను ప్రతిబింబించలేదని, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు తీసుకురావాలని దీర్ఘకాలంగా భారత్ కోరుతోంది. ఇప్పటికి ఎనిమిది విడతలుగా భారత్ వంతులవారీ పద్ధతిలో భద్రతామండలిలో పనిచేసింది.

15 సభ్యదేశాలున్నాయని, వీటిల్లో ఐదు దేశాలకు మాత్రమే వీటో అధికారాలు ఉన్నాయని, రెండేళ్ళ కాలానికిగాను వంతులవారీగా ఎన్నికయ్యే మిగిలిన పది దేశాలకు వీటో అధికారాలు లేవని, ఈ దేశాలన్నీ ద్వితీయశ్రేణి దేశాలుగా మిగిలిపోతాయని పేర్కొన్నారు. భద్రతామండలిలో సభ్యదేశాలకు నిష్పక్షపాతంగా సమాన హక్కులు ఉండాలని, సమానస్థాయిలో వీటో చేసే అధికారాలు ఉండాలని హరీశ్ పర్వతనేని కోరారు. వీటో అధికారంలేని సభ్యదేశాలు ద్వితీయశ్రేణికి దిగజారిపోతాయని, తద్వారా ఐదు శాశ్వత సభ్యదేశాలకు మాత్రమే ఎప్పటికీ నియంత్రణాధికారాలు ఉంటాయని అన్నారు. భద్రతామండలిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలకు మాత్రమే వీటో అధికారాలు కొనసాగుతున్నాయి. భద్రతామండలిలో వీటో అధికారంపై భారతదేశం సూత్రబద్ధమైన వైఖరి అనుసరిస్తోందన్న విషయం అందరికీ తెలిసినదేనని, సంస్కరించిన భద్రతామండలిలో



శాశ్వత సభ్యులందరికీ ఖచ్చితంగా వీటో అధికారం ఉండి తీరాల్సిందేనని ఉద్ఘాటించారు.

భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావాలని, దశాబ్దాలనాటి ఈ మండలికి కాలం చెల్లిందని, కొత్త విధానాలు తీసుకురావాలని భారత్, చైనా సహా పలుదేశాల నుండి తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. ఈ సంస్కరణలను భద్రతామండలికి విస్తరించాలని హరీశ్ కోరారు. భద్రతామండలిలో వీటో అధికారం లేకుండా దీర్ఘకాలిక సభ్యత్వంగల మరో కేటగిరీని సృష్టించడం ద్వారా ఆ దేశాలన్నీ ద్వితీయశ్రేణి దేశాలస్థాయికి నెట్టివేయబడతాయని విమర్శించారు. వీటో అధికారంతోను లేదా లేకుండాను మరో శాశ్వతసభ్యదేశాల కేటగిరీని సృష్టిస్తే ఇప్పటికే సంక్లిష్టంగా మారిన చర్చల ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారిపోతుందని, చాలా అసమానత్వం ఏర్పడుతుందని, సమానత్వం సాధించే పరిస్థితిని సంక్లిష్టం చేసినట్లు కాగలదని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఇజ్రాయెల్‌లో 45 శాతం పోలింగ్

- మొదటి మూడు గంటల్లో రికార్డుస్థాయి నమోదు
- నవంబర్ 4 ఫలితాలు

**టెల్అవీవ్:** ఇజ్రాయెల్ చరిత్రలో అత్యంత కీలకమైన పార్లమెంటు ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ అక్కడి కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 7.00 గంటలకు ప్రారంభమైంది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి దాదాపు 45 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1973 ఎన్నికల తర్వాత ఇదే అత్యధికం. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, ఆయన ప్రధాన ప్రత్యర్థి, మాజీ సైన్యాధిపతి గాడి ఐసెన్‌కోట్‌ల మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని సర్వేలు అంచనా వేస్తున్నాయి. కాగా మూడు గంటల వ్యవధిలో రికార్డుస్థాయిలో 16.68 శాతం ఓటింగ్ జరిగింది.1981 తర్వాత ఈ విధంగా పోలింగ్ నమోదు కావడం ఇదే మొదటిసారి అని సెంట్రల్ ఎలక్షన్స్ కమిటీ(సిఇసి) తాత్కాలిక డైరెక్టర్ జనరల్ దిన్ లివ్‌నెహ్ చెప్పారు. ఉదయం పది గంటల సమయానికల్లా 1.2 మిలియన్ అర్హులైన ఓటర్లు ఓటు హక్కు ఉపయోగించుకున్నారని, గత ఎన్నికలలో ఇదే సమయానికి 15.9 శాతం పోలింగ్ జరిగిందని చెప్పారు. 1981లో ఇదేవిధంగా భారీ ఓటింగ్ జరిగినప్పుడు అప్పటి ప్రధానమంత్రి మెనాఛెమ్ బెగిన్ తిరిగి ఎన్నికయ్యారు. రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ కేంద్రాలు తెరచే ఉంటాయి. భారత్‌లోని మిజోరాం రాష్ట్ర పరిమాణంలో ఉండే ఇజ్రా



యెల్ దేశంలో పోలింగ్ నిమిత్తం 12,018 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నవంబరు నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు.

73 లమంది అర్హులైన ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ తీర్పు చెప్పనున్నారు. ఈ సారి ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేస్తున్న 5,00,000 మంది యువ ఓటర్ల తీర్పు కీలకం కానున్నది. దేశ భద్రతతోపాటు విపరీతంగా పెరిగిపోయిన జీవన వ్యయాలు, మితవాదం కూడా ఎన్నికల ప్రచారాంశాలుగా ముందుకు వచ్చాయి. ఈ ఎన్నికలు ట్రంప్ అనుంగు మిత్రుడైన బెంజిమన్ నెతన్యాహూకు పెద్ద అగ్నిపరీక్షగా మారాయి. ముందస్తు పోలింగ్ సర్వేల అంచనాల ప్రకారం దేశంలో ఏ కూటమికీ లేదా పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చే అవకాశాలు లేవు. అందువల్ల ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి చర్చోపచర్చల మల్లగుల్లాలవల్ల జాప్యం జరిగే పరిస్థితులు కూడా ఎదురుకావచ్చు. అధికార కూటమిని ఖరారు చేసే విషయంలో కొన్ని వారాలు లేదా నెలలపాటు ఎన్నికల అనంతరం రాజకీయ పోరాటం కొనసాగవచ్చునని అంతర్జాతీయ మీడియా అంచనా వేసింది. ప్రస్తుత ప్రధానమంత్రి నెతన్యాహూ, మాజీ సైన్యాధిపతి గాడి ఐసెన్‌కోట్ మధ్య నువ్వా–నేనా అనే రీతిలో పోటీ జరుగుతోంది. ఇప్పటివరకూ ఎన్నికలో జరిగిన ప్రచారమంతా ఇజ్రాయెల్ దేశాన్ని ఎవరు భద్రంగా చూసుకోగలరనే అంశం చుట్టూ తిరిగింది.నెతన్యాహూ తనను తాను ''మిస్టర్ సెక్యూరిటీ''గా చెప్పుకుంటున్నారు. ఆయన అధికారం కోల్పోతే ఆయన కుటుంబం పూర్తి అభద్రతలో పడుతుంది. అంతర్జాతీయస్థాయిలో ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉండటంతో ఎలాగైనా అధికారం నిలబెట్టుకోవాలని ఆయన తంటాలు పడుతున్నారు. రెండు అరబ్ పార్టీ కూటములు కూడా పోటీలో ఉన్నాయి. ఇజ్రాయెల్‌లో ఐదూశాతం మంది అరబ్బులు ఉన్నారు.

2023 అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ పై సామూహికదాడిచేసి 1200 మందిని కాల్చి చంపారు. మరో 251 మందిని బందీలుగా తీసుకుపోయారు. దీంతో అప్పటివరకూ స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత, నిరసన ప్రదర్శనలను ఎదుర్కొన్న నెతన్యాహూ ప్రజల దృష్టిని గాజావైపు మళ్ళించారు. 74000 మంది పాలస్తీనియన్లు ఈ మారణహోమంలో హతులయ్యారు. మరో 1,75,000 మంది గాయపడ్డారు. 22 లక్షలమంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారు.హమాస్ దాడి చేయకపోయి ఉంటే నెతన్యాహూ బహుశా ప్రజా నిరసనోద్యమం ద్వారా పదవీచ్యుడై ఉండేవారు. న్యాయస్థానాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవడంకోసం న్యాయమూర్తుల అధికారాలకు కోత పెడుతూ 2023లో న్యాయ సంస్కరణల చట్టాన్ని నెతన్యాహూ తీసుకువచ్చారు. నెతన్యాహూ ఏదైనా ఒక ప్రజావ్యతిరేక చట్టం చేస్తే అది రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే అధికారాలను కూడా న్యాయస్థానం నుండి లాగేసుకునే సంస్కరణలను ఆయన తీసుకురావడంతో ఇజ్రాయెల్‌లో ప్రజాగ్రహం పెల్లుబికింది. వేలాదిమంది రోజుల తరబడి రాత్రి పగలూ తేడా లేకుండా నిరసన ప్రదర్శనలు చేస్తూ వచ్చారు. సుప్రీంకోర్టు మెజార్టీ తీర్పుద్వారా ఈ చట్టాన్ని రద్దు చేసింది. ఈ అక్రమాలకు పాల్పడిన పాపం ఆయనను వెంటాడుతున్న సమయంలో హమాస్ దాడి ఆయనకు వజ్రాయుధంలా దొరికింది. నెతన్యాహూ గెలుపుకోసం ట్రంప్ ఎంతో ప్రయత్నం చేస్తున్నారు. విదేశాలలో స్థిరపడిన వేలాదిమంది ఇజ్రాయెలీలు నుండి స్వదేశానికి చేరుకున్నారు. వీరిలో ఎక్కువమంది అమెరికాలో స్థిరపడినవారే ఉండటం విశేషం.

### సౌదీకి సైనిక సహాయం యెమెన్‌పై యుద్ధ ప్రకటనే

# హౌతీలహెచ్చరికతో గల్ఫ్‌లో ఉద్రిక్తత



**సనా:** సౌదీ అరేబియాకు ఈజిప్టు సైనిక సహాయం అందించడం యెమెన్‌పై యుద్ధ ప్రకటన చేయడమేనని యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల రాజకీయ విభాగంలో సీనియర్ అధికారి మహ్మద్ అల్ అలీ–హౌతీ హెచ్చరించారు. దీంతో గల్ఫ్ ప్రాంతంలో మళ్ళీ ఉద్రిక్తతలు పెరిగాయి. సౌదీ అరేబియా ప్రాదేశిక సమగ్రత, రక్షణకోసం ప్రతిపాదించిన తీర్మానాన్ని ఈజిప్టు పార్లమెంటు అక్టోబరు 26న ఆమోదించింది. దీంతో హౌతీ తిరుగుబాటుదారుల నాయకుడు పైవిధంగా స్పందించారు. ఈ సైనిక మద్దతు కేవలం ఈజిప్టు భూభాగాన్ని సంరక్షించడానికి, దాని ప్రాదేశికతను కాపాడటంకోసం మాత్రమేనని ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ అల్–సిసి ప్రకటించారు. కానీ హౌతీల నాయకుడు అల్–హౌతీ టెలిగ్రామ్ వేదికగా స్పందిస్తూ, ఈ తీర్మానం ఆమోదించడం యెమెన్ రిపబ్లిక్‌పై యుద్ధ ప్రకటనగా అభివర్ణించారు. ఇటీవలికాలంలో సౌదీ అరేబియాపై హౌతీ తిరుగుబాటు సైన్యాలు తమ దాడులను ఇబ్బడిముబ్బడిగా పెంచాయి. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, వైమానిక స్థావరాలు, చమురు కేంద్రాలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తూ ఉండటంతో మక్కా ఒప్పందానికి అనుగుణంగా ఈజిప్టు పార్లమెంటు తన సైన్యాన్ని పంపేందుకు మూడింట రెండు వంతుల మెజార్టీ ద్వారా తీర్మానం చేసి అధ్యక్షుడికి అధికారాలు ఇచ్చింది.

## చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

వివేక్ వెంకటస్వామిలతో కలిసి మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. భూ సర్వే నిర్వహణకు సంబందించిన పలువురు తహసీల్దార్లు ,సర్వేయర్లతో ముఖాముఖి నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఎన్ని గ్రామాలను కేటాయించారు. ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తియింది. ఏవిధంగా సర్వే నిర్వహిస్తున్నారు, రోజుకు ఎన్ని ఎకరాల భూమి సర్వే చేస్తున్నారు. సర్వే పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతొంది తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో సంబందిత రైతుకు తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లు ,సర్వేయర్లకు సూచించారు. భూమి విస్తీర్ణం సరిహద్దులకు సంబందించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు ఏలాంటి సందేహాలు లేకుండా వివరించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అదికారులు సర్వే ప్రకియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ రైతుల సమస్యలు ,అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబందిత అధికారులు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతల వారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ. 230 కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు

**డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం**

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్దప్రాతికకన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతగా పూర్తి పారదర్శకంగా ,అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు, తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ,ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబందించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు సంబందిత జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అందించిన సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో సిసి ఎల్‌ఏ కమీషనర్ లోకేష్ కుమార్, స్టాంపులు రిజిస్టేషన్ శాఖ స్పెషల్ సెక్రటరి రాజీవ్ గాంధీ ,హనుమంతు ,గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్, గౌతమ్, ఎంపిలు రఘునందన్‌రావు, సురేష్ షెట్కర్ ,ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్తప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట ,మెదక్, కలెక్టర్లు ప్రతీక్‌జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతో పాటు అదనపు కలెక్టర్లు ,సబ్ కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికారులు తహసీల్దార్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమరశంఖం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు. ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ, కార్యవర్గ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ అమెరికాలో యుద్ధ పరిణామాలపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, క్యూబాపై అమెరికా ఒత్తిళ్లు కొనసాగుతున్నప్పటికీ ఆ దేశ ప్రజలు వెనక్కి తగ్గడంలేదని పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను తొలగించి ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీస్తున్నారన్నారు. ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంపై బాధ్యులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలిచి ఉద్యమాలను ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడితేనే ప్రజల ఆదరణ లభిస్తుందన్నారు. ఇందుకు ఇటీవల ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ సాధించిన విజయం నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా కార్మికుల పక్షాన నిలిచిన యూనియన్‌కు కార్మికులు అద్భుతమైన విజయాన్ని అందించారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులను సాంబశివరావు కోరారు.

**ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నేతలలకు సిపిఐ రాష్ట్ర సమితి అభినందనలు**

టిజిఎస్‌ఆర్‌టిసి రాష్ట్రస్థాయి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం సాధించినందుకు యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్నలను సిపిఐ రాష్ట్ర సమితి అభినందించింది. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ యూనియన్ నాయకులను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో యూనియన్‌కు మద్దతుగా నిలిచిన కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాటం సాగించాలని నాయకులకు వారు సూచించారు. కార్మికుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత, న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేయాలని వారు ఉద్బోధించారు.

## ఇంకా భ్రమల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

కెటిఆర్, హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. ఎల్‌నినో ప్రభావం దేశమంతటా ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణలో సమీప భవిష్యత్తులో బిజెపి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం బిజెపికి ఉన్న ఎనిమిది ఎంపి స్థానాల్లో రెండింటిని నిలబెట్టుకున్నా గొప్పేనని అన్నారు. బిజెపి ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా మళ్లీ గెలవరని ఆయన వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో 40 శాతం సీట్లు కాంగ్రెస్‌కే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాలు గెలుచుకోవడమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. నవంబర్‌లోగా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత నేరుగా ఎన్నికలపైనే దృష్టి సారిస్తామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమన్వయం దేశంలో మరెక్కడా లేదని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తున్నారని, ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను చూశానని తెలిపారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని, పార్టీ మాత్రం శాశ్వతమని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, పార్టీయే తమకు ప్రధాన బలమని అన్నారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలతో లబ్ధి పొందిన వారు, దాదాపు 90 వేల ఉద్యోగాలు కల్పించామని, ఆ ఉద్యోగాలు పొందినవారంతా కాంగ్రెస్‌కు అండగా ఉంటారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలే వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి దోహదం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

## భారీ మానవహారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ మానవహారం నిర్మించింది. ఒక క్రమ పద్ధతిలో పౌరులను ఓటు హక్కుకు దూరం చేయడంతోపాటు ఓటువేసే ప్రాథమిక ప్రజాస్వామ్యహక్కుపై దాడికి వ్యతిరేకంగా దేశంలో పెరుగుతున్న ప్రజాగ్రహాన్ని ఈ మానవహారం ప్రతిబింబించింది.ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ''జంతర్ మంతర్ అనేది ప్రజలు తమ ప్రజాస్వామ్య బద్ధమైన నిరసన హక్కును ప్రతిబింబించే ఒక చారిత్రక ప్రదేశం. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా అసమ్మతి వ్యక్తం చేయకుండా అడ్డుకునేందుకు ఈ ప్రదేశంలో అనుమతి నిరాకరించడం అంటే, ప్రజా ఉద్యమాల పట్ల ప్రభుత్వానికి ఎంతగా అసహనం పెరిగిపోయిందో అర్థమవుతోంది. ప్రజల నిరసన హక్కును ఒక పద్ధతి ప్రకారం అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ప్రజలకు ఎన్నికల హక్కులను, వారి హక్కులను తెలియజేయడానికి, వారికి జరిగిన అన్యాయాన్ని తెలియజేయడానికి గొంతెత్తి నినదించే హక్కును తిరస్కరిస్తే ప్రజాస్వామ్యం మనుగడ సాగించదని సిపిఐ ఉద్ఘాటించి చెబుతున్నది. స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడంకోసం భారత ఎన్నికల సంఘానికి రాజ్యాంగబద్ధమైన బాధ్యతలు అప్పగించారు. కానీ ఇప్పుడు ఎన్నికలసంఘం నిబద్ధత, విశ్వాసం కోల్పోయి అసాధారణ సంక్షోభంలో కూరుకుపోయింది. ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ ప్రక్రియను రద్దుచేయాలి, ఓటర్ల జాబితాలను పాత విధానంలో పునరుద్ధరించాలి, జంతర్ మంతర్‌ను పునఃప్రారంభించాలి. దేశ ప్రజాస్వామ్య విస్తార ప్రయోజనాలను ఆశించి, రాజ్యాంగబద్ధమైన జవాబుదారీతనాన్ని నిలబెట్టేందుకు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి తీరాలి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ మానవహారంలో డి.రాజాతోపాటు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్, రాజ్యసభ సభ్యుడు పి.సంతోశ్ కుమార్, రామకృష్ణ పాండా, డా.గిరీశ్ శర్మ, అన్నీరాజా, కె.ప్రకాశ్ బాబు, కె.రామకృష్ణ, పార్లమెంటులో సిపిఐ సభ్యుడు పి.పి.సునీర్, సిపిఐ ఢిల్లీ కార్యదర్శి, జాతీయ కార్యవర్గసభ్యుడు ప్రొఫెసర్ దినేశ్ వర్ష్నే, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషాసిధు, ఎఐకెఎస్ అధ్యక్షుడు రాజన్ కృష్ణసాగర్, బికెఎంయు కార్యదర్శి వి.ఎస్.నిర్మల్, ఎఐవైఎఫ్ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా, ఎఐవైఎస్ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేసరి, ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ తదితరులు వేలాదిమంది ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, కార్మికసంఘాలతో కలిసి ఈ మానవహార కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని ప్రజాస్వామ్యశక్తులు, రాజకీయపార్టీలు, పౌర సంఘ సంస్థలు ఈ పోరాటంలో పాల్గొనాలని, ఎన్నికల సంఘాన్ని జవాబుదారీ చేసేందుకు, ఎలాంటి రహస్యాలు లేకుండా బాహాటత్వ విధానాలు పాటించేందుకు వీలుగా, ఓట్‌చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాన్ని ఉద్ధృతంగా ముందుకు తీసుకువెళ్ళాలని సిపిఐ ఈ సందర్భంగా పిలుపు ఇచ్చింది.

## కరువు మండలాలు

(మొదటి పేజీ తరువాయి)

28 మండలాల్లో 21 తీవ్ర కరువు జాబితాలో ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో 13 మండలాల్లో 10, వనపర్తి జిల్లాలో 11 మండలాల్లో 6, వికారాబాద్ జిల్లాలో 20 మండలాల్లో 11, ఖమ్మం జిల్లాలో 17 మండలాల్లో 10 తీవ్ర కరువు కేటగిరీలో ఉన్నాయి.

254 మధ్యస్థ కరువు మండలాలు : సంగారెడ్డి 28, నల్లగొండ 28, సూర్యాపేట 23, ఆదిలాబాద్ 20, వికారాబాద్ 20, రంగారెడ్డి 18, నిజామాబాద్ 18, ఖమ్మం 17, యాదాద్రి భువనగిరి 17, భద్రాద్రి కొత్తగూడెం 16, హనుమకొండ 14, నాగర్ కర్నూల్ 13, మహబూబ్ నగర్ 13, నారాయణపేట 13, జోగులాంబ గద్వాల 13.

**17 శాతం లోటు వర్షపాతం**

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 740.6 మి.మీ. కాగా, 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 17 శాతం లోటు ఉంది. 33 జిల్లాల్లో 18 జిల్లాలు లోటు వర్షపాతం ఎదుర్కొన్నాయి. బలపడుతున్న ఎల్‌నినో పరిస్థితులు, బలహీనమైన బంగాళాఖాత అల్పపీడనాలు, సుదీర్ఘ పొడి వాతావరణమే ఇందుకు కారణమని ప్రభుత్వం పేర్కొంది. ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. వరి సాగు 18 శాతం తగ్గి 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో ప్రస్తుత నిల్వ 585 టిఎంసిల సామర్థ్యానికి గాను 179.63 టిఎంసిలకే పరిమితమైంది. దీంతో తాగునీరు, వ్యవసాయం, పశుగ్రాసం, విద్యుత్ రంగాలకు ముప్పు పొంచి ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**శాస్త్రీయ అంచనా ఆధారంగా నిర్ణయం**

ఆటోమేటెడ్ వర్షపాత గణాంకాలు, పొడి వాతావరణ వివరాలను ఆధారంగా చేసుకుని తొలి దశ (ట్రిగ్గర్1) అంచనా వేశారు. అనంతరం వ్యవసాయం (పంటల విస్తీర్ణం లోటు), రిమోట్ సెన్సింగ్ (వృక్ష స్థితి సూచిక), నేల తేమ, భూగర్భ జలాలు అనే నాలుగింటిలో కనీసం మూడు ప్రభావ సూచికల ఆధారంగా రెండో దశ (ట్రిగ్గర్2) మదింపు చేశారు. ప్రతి మండలంలోని 10 శాతం గ్రామాల్లో క్షేత్ర స్థాయి నమూనా సర్వేలు నిర్వహించి, ఆ ఫలితాలను కరువు తీవ్రతకు తుది ప్రాతిపదికగా తీసుకున్నారు. అక్టోబర్ 23న జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం 365 మండలాలను కరువు ప్రభావితంగా ప్రకటించాలని సిఫార్సు చేసింది.

**శాసనసభ తీర్మానం**

ఎల్‌నినో వల్ల తలెత్తిన వర్షాభావ పరిస్థితులపై సెప్టెంబర్ 18న శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. అంచనా కోసం కేంద్ర బృందాన్ని పంపాలని, ఎన్‌డిఆర్‌ఎఫ్ సాయం మంజూరు చేసి ఎస్‌డిఆర్‌ఎఫ్ వాటాను విడుదల చేయాలని కోరింది. పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీరు, పశుగ్రాసం, భూగర్భ జలాలు, జలవనరుల పునరుద్ధరణకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. వీబీజీ రామ్ జీ కింద అదనంగా 50 రోజుల పని కల్పించి, ఎక్కువ ఎరువులు, అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్, రూ. 20,000 కోట్ల ప్రత్యేక కరువు సహాయ ప్యాకేజీ ఇవ్వాలని కోరింది. 202627కు ఎఫ్ఆర్‌బిఎం రుణ పరిమితిని జిఎస్‌డిపిలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలని, కేంద్ర, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో సడలించిన నిబంధనలతో అదనపు సాయం అందించాలని తీర్మానం కోరింది.

**ఉత్తర్వుల్లోని ముఖ్యాంశాలు :**

**కేంద్రానికి నివేదిక :** ఉత్తర్వులు, నోటిఫికేషన్, ట్రిగ్గర్2 వివరాలు, తీవ్ర కరువు మండలాల గ్రామ స్థాయి గణాంకాలతో కేంద్ర సాయం కోరుతూ మెమోరాండంను ప్రణాళిక శాఖ ఏడు రోజుల్లోగా సిద్ధం చేయాలి.

**నోటిఫికేషన్ :** జిల్లా కలెక్టర్లు ఈ నోటిఫికేషన్‌ను ఆంగ్లం, తెలుగులో జిల్లా గెజిట్ ప్రత్యేక సంచికలో వెంటనే ప్రచురించాలి. రైతులు రుణ సౌకర్యాలు పొందేందుకు, సహాయ చర్యల కోసం ఇది అవసరం.

**సహాయ చర్యలు :** డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీటి సరఫరా పెంపు, పశుగ్రాసం, అవసరమైన చోట గోశాలలు (పశు శిబిరాలు), వీబీజీ రామ్ జీ కింద ఉపాధి కల్పన చేపట్టాలి.

**రుణ ఉపశమనం:** రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, బలవంతపు రుణ వసూళ్ల నిలుపుదల గురించి రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బిసి)తో కలెక్టర్లు మాట్లాడాలి.

**ఇన్‌పుట్ సబ్సిడీ :** ఎన్‌డిఆర్‌ఎఫ్ నుంచి కేంద్ర సాయం అందిన నెలలోగా వ్యవసాయ శాఖ డిబిటి ద్వారా సబ్సిడీ చెల్లించాలి. లబ్ధిదారుల జాబితాలను కలెక్టర్ల, ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో ప్రచురించాలి.

**పర్యవేక్షణ :** వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల డైరెక్టర్లు, పౌరసరఫరాల సంస్థ ఎండితో కలిసి కలెక్టర్లు తక్షణ సహాయ చర్యలు చేపట్టి, లబ్ధిదారులు, వ్యయ రిజిస్టర్ నిర్వహించాలి. పురోగతి నివేదికలను రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖకు సమర్పించాలి.

**పట్టణ ప్రాంతాలు :** నోటిఫై చేసిన మున్సిపల్, పట్టణ ప్రాంతాలను కరువు మండలాల నుంచి తొలగించాలి. అయితే తాగునీటి విషయంలో వాటిని కరువు ప్రభావిత మండలాలతో సమానంగా పరిగణిస్తారు.

**నేడు అఖిలపక్ష భేటీ**

తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. కరువు నివారణకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకోనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రభుత్వం కోరనున్నట్లు డిప్యూటీ సిఎం కార్యాలయం తెలియజేసింది.

# న్యూజిలాండ్‌తో సిరీస్ భారత్ కైవసం

## సెంచరీతో రప్ఫాడించిన అభిషేక్ శర్మ



న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా జోరు కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ భారత్ అదిరిపోయే విజయాన్ని అందుకుంది. అభిషేక్ శర్మ(38 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లతో 113) విధ్వంసకర శతకంతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఐదు టి–20ల సిరీస్‌లో భాగంగా వెల్లింగ్టన్ వేదికగా మంగళవారం జరిగిన మూడో టి–20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 199 పరుగుల లక్ష్యాన్ని భారత్ 40 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఈ గెలుపుతో ఐదు టి–20ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే టీమిండియా 3–0తో కైవసం చేసుకుంది. అభిషేక్ శర్మతో పాటు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ(19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 45) దూకుడుగా ఆడటంతో భారత్ 13.2 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జెమీసన్(2/41) రెండు వికెట్లు తీయగా.. మాథ్యూ ఫిషర్, మిచెల్ సాంట్నర్ చెరో వికెట్ తీసారు. భారత ఓపెనర్ల ధాటికి న్యూజిలాండ్ బౌలర్లు తలలు పట్టుకున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 198 పరుగులు చేసింది. డారిల్ మిచెల్(52 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 89 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. ఫిన్ అలెన్(25 బంతుల్లో 5 సిక్స్‌లతో 40), బెవాన్ జాకబ్స్(23 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 39 నాటౌట్) దూకుడుగా ఆడారు. భారత బౌలర్లలో నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ చెరో వికెట్ తీశారు.

**వైభవ్, అభిషేక్ ఊచకోత..** లక్ష్య ఛేదనలో తొలి ఓవర్ నుంచే భారత్ దూకుడుగా ఆడింది. ఫస్ట్ బాల్‌నే వైభవ్ సూర్యవంశీ బౌండరీ బాది ఇన్నింగ్స్‌ను దూకుడుగా ప్రారంభించాడు. ఇదే ఓవర్‌లో వైభవ్, అభిషేక్ చెరో సిక్సర్ బాదారు. ఆడమ్ మిల్నే వేసిన రెండో ఓవర్లో 6, 6, 4 బాదిన అభిషేక్ శర్మ.. మైఖేల్ బ్రేస్ వేసిన మూడో ఓవర్లో 4, 6, 4 బాదాడు. దాంతో 2.2 ఓవర్‌లలోనే భారత్ 50 పరుగులు చేసింది. జెమీసన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు కొట్టిన అభిషేక్ 15 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అభిషేక్ హాఫ్ సైడ్ బౌండరీలు బాదితే.. వైభవ్ లెగ్ సైడ్ కొట్టాడు. దాంతో 5 ఓవర్లలోనే 100 పరుగులు చేసిన భారత్.. పవర్ ప్లేలో 118 పరుగులతో రికార్డ్ స్కోర్‌తో వరల్డ్ రికార్డ్ నమోదు చేసింది.

**35 బంతుల్లోనే శతకం..** భారీ షాట్ ఆడే క్రమంలో హాఫ్ సెంచరీ ముంగిట వైభవ్(45) ఔటవ్వగా.. తొలి వికెట్‌కు నమోదైన 133 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. వైభవ్ ఔటైనా.. అభిషేక్ చెలరేగాడు. 90 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఫిషర్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ ఇచ్చిన క్యాచ్‌ను మిచెల్ సాంట్నర్ నేలపాలు చేశాడు. ఈ అవకాశంతో అభిషేక్ చెలరేగి మిచెల్ సాంట్నర్ జెమీసన్ బౌలింగ్‌లో బౌండరీ బాది 35 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అంతర్జాతీయ టి–20ల్లో అతనికి ఇది నాలుగో శతకం కావడం గమనార్హం. ఆ తర్వాత వరుసగా 6, 4 బాదిన అభిషేక్.. క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అభిషేక్ ఔటైన అనంతరం భారత్ పరుగుల వేగం తగ్గింది. ఆచితూచి ఆడిన శ్రేయస్ అయ్యర్(5) సాంట్నర్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే సంజూ శాంసన్ (18)ను జెమీసన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. కానీ క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ బౌండరీ బాది భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

# క్రికెట్ చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డులు

## 9 ఫోర్లు, 11 సిక్స్‌లతో అభిషేక్ ఊచకోత

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ రికార్డుల మోత మోగించాడు. క్రికెట్ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని ఘనతలను అందుకున్నాడు. ఐదు టి–20ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో మంగళవారం వెల్లింగ్టన్ వేదికగా జరిగిన మూడో టి–20లో అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 38 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లతో 113 పరుగులు చేశాడు. అతని విధ్వంసంతో భారత్ 199 పరుగుల లక్ష్యాన్ని మరో 40 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.

**సూర్యకుమార్ యాదవ్ రికార్డ్ సమం..** ఈ ఇన్నింగ్స్‌తో అభిషేక్ పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. అంతర్జాతీయ టి–20ల్లో అత్యధిక సెంచరీలు బాదిన రెండో భారత బ్యాటర్‌గా సూర్యకుమార్ యాదవ్‌తో సమంగా నిలిచాడు. రోహిత్‌శర్మ 5 శతకాలతో అగ్రస్థానంలో ఉన్నాడు.

**40 బంతుల్లోపు మూడో శతకం..** బంతుల్లోపే సెంచరీ చేయడం అభిషేక్ శర్మకు ఇది మూడో సారి. అఫ్గానిస్తాన్‌పై 30 బంతుల్లోనే సెంచరీ బాది ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా ఇప్పటికే అభిషేక్ శర్మ కొనసాగుతున్నాడు. తాజాగా 35 బంతుల సెంచరీతో ఈ ఫాస్టెస్ట్ సెంచరీ జాబితాలో మరోసారి చేరాడు. టెస్ట్ నేషన్స్ టీమ్స్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ బాదిన ఆటగాళ్లలో అభిషేక్ శర్మ అగ్రస్థానంలో ఉండగా.. సికిందర్ రాజా(33), ఫిన్ అలెన్(33), డేవిడ్‌మిల్లర్(35), రోహిత్ శర్మ(35) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. టి–20ల్లో 40 బంతుల్లోపు అభిషేక్ శర్మ నాలుగు శతకాలు నమోదు చేశాడు. అతని తర్వాత ఉర్విల్ పటేల్, వైభవ్ సూర్యవంశీ 2 శతకాలతో కొనసాగుతున్నారు.

**ఇషాన్ రికార్డ్ బద్దలు..** న్యూజిలాండ్‌పై ఫాస్టెస్ట్ సెంచరీ బాదిన భారత బ్యాటర్‌గానూ అభిషేక్ శర్మ నిలిచాడు. ఈ క్రమంలో ఇషాన్ కిషన్(42 బంతులు) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై జరిగిన సిరీస్‌లో ఇషాన్ ఈ ఫీట్ సాధించాడు.

**అంతర్జాతీయ టి–20ల్లో ఏకైక ఆటగాడిగా..** అంతర్జాతీయ టీ20ల్లో 15 బంతుల్లోపూ అత్యధిక హాఫ్ సెంచరీలు బాదిన ఏకైక ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు. అతను మొత్తం 15బంతుల్లోపు మూడు హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. అంతర్జాతీయ టి–20ల్లో 10 కంటే ఎక్కువ సిక్స్‌లు బాదడం అభిషేక్ శర్మకు ఇది మూడోసారి.

**కోహ్లీ రికార్డ్ బద్దలు..** టి–20 క్రికెట్లో అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్‌గానూ అభిషేక్ శర్మ నిలిచాడు. అంతర్జాతీయ టి–20లు, ఐపిఎల్, డొమెస్టిక్ క్రికెట్లో కలిపి అభిషేక్ 11 సెంచరీలు నమోదు చేశాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ(10 శతకాలు) రికార్డును అధిగమించాడు. కోహ్లీ ఆర్సీబీ తరఫున 9 శతకాలు నమోదు చేయగా.. భారత్ తరఫున ఒకే ఒక్క శతకాన్ని అందుకున్నాడు. ఓవరాల్‌గా ఈ జాబితాలో క్రిస్ గేల్ 22 శతకాలతో టాప్లో ఉన్నాడు. అతని తర్వాత బాబర్ ఆజామ్ (13) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

## మహిళ

# లింగ సమానత్వంలో భారత్ వెనుకంజ

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) విడుదల చేసిన తాజా 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్' ప్రకారం, భారత్ 148 దేశాల జాబితాలో కాకుండా, నివేదికలో పరిశీలించిన 145 ఆర్థిక వ్యవస్థల్లో 131వ స్థానంలో ఉంది. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, శ్రీలంకలతో పోలిస్తే భారత్ వెనుకబడి ఉండడం ఆందోళన కలిగించే అంశం. సమాన హక్కుల విషయంలో భారత స్కోరు 64.5 శాతంగా ఉండగా, ప్రపంచ సగటు 69.2 శాతం. కనీసం సగటును కూడా దాటలేకపోవడం, దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు, వారి పట్ల సమాజంలో చూపుతున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. దక్షిణాసియాలో ప్రస్తుత పురోగతి కొనసాగితే సంపూర్ణ లింగ సమానత్వం సాధించడానికి సుమారు 149 సంవత్సరాలు పట్టవచ్చని ఈ సర్వే అంచనా వేసింది. ఇది మహిళలకు విద్య కల్పించడం మాత్రమే సరిపోదని, ఆ విద్యకు తగిన ఉద్యోగాలు, ఆదాయం, అధికారాలు కూడా కల్పించాలన్న మౌలిక సూత్రాన్ని సూచిస్తోంది.అన్నిరంగాల్లోనూ మహిళలకు వివక్ష కొనసాగుతున్నప్పటికీ, సాంకేతిక రంగంలో, ప్రత్యేకించి కృత్రిమ మేధ(ఎఐ) రంగంలో ఇది మరింత తీవ్రంగా ఉంది. ఎఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, వాటికి శిక్షణ ఇవ్వడం, వాటిని ఉపయోగించే విధానాలను రూపొందించడం వంటి పనుల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువ. తాజా నివేదిక ప్రకారం, డేటా అనోటేటర్లలో మహిళలు దాదాపు సగం మంది ఉన్నప్పటికీ, ఎఐ డెవలపర్లు, డిప్లాయ్‌మెంట్ ఇంజినీర్లలో వారి వాటా సుమారు ఐదో వంతు మాత్రమే. ఎఐ వ్యవస్థలు నేర్చుకోవడానికి చిత్రాలు, పదాలు, ఇతర సమాచారానికి గుర్తులు లేదా లేబుళ్లు జోడించడాన్ని డేటా అనోటేషన్ అంటారు. అంటే, మహిళలు ఎఐ అభివృద్ధికి అవసరమైన సహాయక పనుల్లో ఎక్కువగా ఉన్నా, సాంకేతిక రూపకల్పన, కీలక నిర్ణయాలు, అధిక వేతనాలు లభించే ఉద్యోగాల్లో వారిసంఖ్య తక్కువ. మన దేశంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం(స్టెమ్) కోర్సుల్లో పట్టభద్రులైన వారిలో 40 నుంచి 43 శాతం మహిళలే అయినప్పటికీ, ఎఐ రంగంలో వారి ప్రాతినిధ్యం అంతగా పెరగడం లేదు. ఎఐ వ్యవస్థలు మనుషులు అందించిన డేటా ఆధారంగా నేర్చుకుంటాయి. ఆ డేటాలో ఇప్పటికే ఉన్న లింగ వివక్ష ఉంటే, ఎఐ కూడా అదే వివక్షను కొనసాగించవచ్చు. ఉదాహరణకు మహిళలను కొన్ని ఉద్యోగాలకు తక్కువగా ఎంపిక చేసేలా ఎఐ పనిచేయవచ్చు. లేదా మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని తగినంతగా పరిగణించకపోతే తప్పు అంచనాలు రావచ్చు. రుణాల మంజూరులో మహిళలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. మహిళలు, గ్రామీణ విద్యార్థుల అవసరాలను గుర్తించడంలో ఎఐ విఫలమవవచ్చు. ముఖ్యంగా పేద, గ్రామీణ, అణగారినవర్గాలకు చెందిన మహిళలు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంది. మహిళల విద్యలో పురోగతి సాధించినప్పటికీ, అది



తగిన ఆర్థిక అవకాశాలుగా మారడం లేదు. ఈ పరిస్థితికి కారణాలు ఎన్నో ఉన్నాయి. ఇంటి పనులు, పిల్లల సంరక్షణ వంటి వేతనం లేని బాధ్యతలు మహిళలపైనే ఎక్కువగా ఉండటం, భద్రతా సమస్యలు, లింగ ఆధారిత హింస వంటివి వాటిలో కొన్ని మాత్రమే. ఉద్యోగాలు, నాయకత్వ పదవుల్లో సమాన అవకాశాలు లేకపోవడం, డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్, సాంకేతిక శిక్షణ అందుబాటులో లేకపోవడం, సామాజిక, సాంస్కృతిక ఆంక్షలు వంటి సమస్యలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా, మహిళలను ఎఐ సాంకేతికత వినియోగదారులుగా మాత్రమే కాకుండా, దాని రూపకల్పన, అభివృద్ధి, విధాన నిర్ణయాల్లోనూ భాగస్వాములుగా చేయాలి. బాలికలకు అధునాతన డిజిటల్ నైపుణ్యాలు, ఎఐ శిక్షణ అందించాలి. మహిళలకు అధిక వేతనాలు లభించే సాంకేతిక ఉద్యోగాలు, నాయకత్వ అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ సేవల్లో ఉపయోగించే ఎఐ వ్యవస్థల్లో లింగ వివక్షను నివారించాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటు ధరలో ఇంటర్నెట్‌ను అందుబాటులో ఉంచి, శిక్షణ అందించాలి. పిల్లల సంరక్షణ సదుపాయాలు, మహిళల భద్రత, సమాన వేతనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇలాంటిచర్యలు తీసుకుంటే, లింగ వివక్ష కొంత వరకైనా తగ్గవచ్చు.

## వీల్‌చైర్... నా గుర్తింపు కాదు

గాయని, గేయరచయిత్రి, 29 ఏళ్ల ఆంటోనియా సిన్‌బాల్డి తన రెండేళ్ల వయసులో జరిగిన కారు ప్రమాదం తర్వాత వీల్‌చైర్‌ను ఉపయోగిస్తున్నది. ఈ ఏడాది జూన్ 20న న్యూజెర్సీలోని ఓ రెస్టారెంట్‌లో ఆమె తన పుట్టినరోజు వేడుక జరుపుకుంది. ఆమె కోసం ప్రత్యేకించి 'యాపిల్ డెజర్ట్' కేక్ ఒకటి వచ్చింది. అయితే దానిపై 'హ్యాపీ వీల్‌చైర్ బర్త్‌డే' అనే సందేశం ఉండడంతో ఆంటోనియా ఆశ్చర్యానికి గురైంది. ఆ సందేశం తర్వాత సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందింది. రెస్టారెంట్ వివరణ ప్రకారం, సిబ్బందికి ఆమెను గుర్తించేందుకు అంతర్గతంగా 'వీల్‌చైర్' అనే పదాన్ని ఉపయోగించారు. అయితే ఒక ఉద్యోగి ఆ నోట్‌ను తప్పుగా అర్థం చేసుకొని, అవే పదాలను ఆమెకు ఉద్దేశించిన కేక్‌పై రాశాడు. ఆమెను అవమానించాలనే ఉద్దేశం తమకు లేదని, జరిగిన ఘటనకు చింతిస్తున్నామని రెస్టారెంట్ క్షమాపణలు చెప్పింది. అయితే ఆ ఘటన తనను బాధించిందని ఆంటోనియా అంటున్నది. ప్రజలు తనను వీల్‌చైర్ ఉపయోగించే వ్యక్తిగా మాత్రమే కాకుండా, తన కంటూ వ్యక్తిత్వం, ప్రతిభ, భావాలు ఉన్న ఒక మనిషిగా చూడాలని ఆమె కోరుతున్నది. 'నా వీల్‌చైర్.. నా గుర్తింపు కాదు' అంటూ సరళంగానేగానీ, చాలా బలంగా ఉన్న ఆమె సందేశం మహిళల, ప్రత్యేకించి అంగ వైకల్యాన్ని ఎదుర్కొంటున్న మహిళల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తున్నది. దివ్యాంగుల పట్ల చాలా మందిలో ఉన్న చులకన భావం, వారిని ప్రస్తావించే విధానం ఇప్పుడు కేవలం అమెరికాలోనేగాక, ప్రపంచ వ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది.




## కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

### మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేందర్ : ఎఐటియుసిలో చేరికలు




**ప్రజాపక్షం/మావల:** రిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం 15 మంది కార్మికులు ఎండి.ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఎఐటియుసిలో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ తాత్కాలిక టెండర్ ఏజెన్సీ సూపర్‌వైజర్ల వేధింపులు ఆపాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎఐటియుసిలో చేరిన వారిలో పొచ్చన్న, కార్తీక్, ఆకాష్, సురేష్ తదితరులు ఉన్నారు.

## అర్హులైన విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు

### కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసికి ఎఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/వరంగల్:** అర్హులైన విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ మెడికల్, పిజి, డిప్లొమా అడ్మిషన్ కు సంబంధించి కాంపిటేటివ్ అథారిటీ కన్వీనర్ కోట నోటిఫికేషన్ గడువు పొడిగించాలని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి భాష బోయిన సంతోష్, వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసి డాక్టర్ కె.రమేష్ రెడ్డికి ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో మెడికల్, పిజి, డిప్లొమా అడ్మిషన్లకు సంబంధించి కాంపిటేటివ్ అథారిటీ కన్వీనర్ కోటాకు అక్టోబర్ 14న నోటిఫికేషన్ విడుదలైందన్నారు. అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఈ ప్రక్రియలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. దీనివల్ల అనేక మంది అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని, వారికి మరో అవకాశం కల్పించేందుకు లేట్ ఫీజు, ఫైనల్ ఫీజుతో దరఖాస్తు చేసుకునేలా గడువును పొడిగించి, కాంట్రాక్ట్ అసిస్టెంట్ కన్వీనర్ కోటాకు మరోసారి నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు సుర నరేష్, తోకరి అజయ్ పాల్గొన్నారు.

# జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి




### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలోని పోచం మైదాన్ సర్కిల్‌లో ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 15వ రోజు చేరింది. సమ్మెకు తాటిపాముల వెంకట్రాములు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్‌ఖన్నా, జెఎసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ దిలీప్, డాక్టర్ కిరణ్, డాక్టర్ హుస్సేన్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ సునీతదేవి, డాక్టర్ నిఖిల్, డాక్టర్ రాజారామ్, డాక్టర్ యశస్విని, డాక్టర్ అనిత, డాక్టర్ సదానందం, డాక్టర్ రమ్య, డాక్టర్ మధు, డాక్టర్ హారిక , డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్చన, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు రవీందర్, మేరుగు అనిల్‌కుమార్, స్వప్న, కళ్యాణి, మంజుల, సుమలత, నూకల అంజి యాదవ్, తీగల సతీష్‌కుమార్, ఆచంట అభిషేక్, శ్వేత, ప్రేమలత, శ్రీనివాస్ బాబు, రంజిత్, రాకేష్, జ్యోతి, సుల్తానా, పేసీన, ఉప్పలమ్మ, నర్మద, రాజేశ్వరి, ప్రభావతి, అనిత, శ్రీలత, జూకంటి మౌనిక, ఎంఎన్ఓ ఏకుల చిరంజీవి, బండి రాజేష్, కుమార్, గౌస్‌పాషా, గూడెపు ప్రభాకర్, రజియా తదితరులు పాల్గొన్నారు

# కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

### నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులు హరిస్తుందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు హరిస్తూ, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలని ఆయన కోరారు. శ్రమదోపిడీకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లాలాలజపతిరాయ్ అధ్యక్షతన అక్టోబర్ 31, 1920లో దేశంలో బొంబాయి కేంద్రంగా ఎఐటియుసి ఆవిర్భవించిందన్నారు. దేశ కార్మికవర్గానికి 8 గంటల పని, పని భద్రత, కార్మిక చట్టాలు అమలు చేయడంతో పాటు దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొట్టమొదటి ఏకైక సంఘం ఎఐటియుసి అన్నారు. భారత కార్మికవర్గాన్ని ఐక్యం చేసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనటంతో పాటు కార్మిక చట్టాలను సాధించి పెట్టిందన్నారు. కానీ నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకరావటంతో కార్మిక హక్కులు హరించి యజమానులకు హక్కులు కల్పిస్తున్నారన్నారు. ఈనెల 31న ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మిక లోకం ఘనంగా జరుపుకోవాలని, జిల్లావ్యాప్తంగా ఎఐటియుసి జెండాలను ఆవిష్కరించి సభను సమావేశాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో హన్మాండ్లు, చక్రపాణి, కవిత, అనిల్, గవర్ధన్, ఫిరోజ్‌అలీ, ఇమ్రాన్‌అలీ, నవీన్ పాల్గొన్నారు.




# రైతులు సంఘటితమైతేనే పంటలకు గిట్టుబాటు ధర

### వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులు సంఘటితమై రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పిఓలు), మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మార్కెటింగ్ చేసుకుంటే పంటలకు మెరుగైన ధరలు, మార్కెట్ సౌకర్యాలు పొందవచ్చని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తం' 112వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ రైతు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ పలు అంశాలపై రైతు సంఘాలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలులో రైతు సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, చిన్న రైతులకు అద్దెకు యంత్రాలు అందించడంతోపాటు సంఘాలకు ఆదాయ మార్గాలు కల్పించనున్నట్లు అధికారులు వివరించారు. పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, డ్రోన్లు, కంబైన్ హార్వెస్టర్లు సహా 37 రకాల యంత్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, నేల సంరక్షణకు చేపట్టాల్సిన 'ఖేత్ బచావో అభియాన్'పై అవగాహన కల్పించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో సాగు చేస్తున్న గెర్కిన్స్, యాదాద్రి భువనగిరి జిల్లాలో మునగ ఆకుల పొడి తయారీ, ఎగుమతుల ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలను ఎగుమతిదారులు వివరించారు. రబీ సీజన్‌లో నీటి లభ్యతను బట్టి పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర ఆరుతడి పంటలను ఎంచుకోవాలని, సిఫారసు చేసిన విత్తనాలనే కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు.




# సినిమా టికెట్ల ధరలు పెంచుతూ సామాన్యులపై భారం తగదు

### ఆ భారాన్ని ప్రజలపై మోపే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారు?

### సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ బడ్జెట్ సినిమాల నిర్మాణ వ్యయాన్ని తిరిగి రాబట్టుకునేందుకు టికెట్ ధరలు పెంచుతూ సామాన్య ప్రేక్షకులపై భారం మోపడం సమంజసం కాదని సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. 'ఆదర్శ కుటుంబం' సినిమా టికెట్ ధరల పెంపు నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సినిమా నిర్మాణం వ్యాపారమని, దానిపై వచ్చే లాభనష్టాలకు నిర్మాతలే బాధ్యత వహించాలని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. నిర్మాతలు విలాసవంతంగా ఖర్చు పెట్టి సినిమాలు తీస్తే, ఆ భారాన్ని ప్రజలపై మోపే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. నిర్మాణ వ్యయాన్ని తిరిగి రాబట్టుకునే పేరుతో టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ సామాన్య ప్రేక్షకుల జేబులకు చిల్లులు పెట్టడం ఎంతవరకు సమంజసమని డాక్టర్ నారాయణ నిలదీశారు. ప్రజల సొమ్ముతో సినిమా యాజమాన్యాలకు ప్రయోజనం చేకూర్చడం 'అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు' ఉందని విమర్శించారు. సినిమా టికెట్ ధరల పెంపు ద్వారా ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపే విధానాన్ని ప్రభుత్వం పునర్‌పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు.

## తప్పులు దొర్లకుండా జనగణన

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జనగణనపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, చార్జ్ ఆఫీసర్లకు, అదనపు చార్జ్ ఆఫీసర్లకు శిక్షణా తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన రెండో దశ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు, అధికారుల బాధ్యతల గురించి వివరించారు. జనాభా గణన ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, సిపిఓ కిషన్, జడ్‌పి సిఇఒ శిరీష, ఆర్‌డిఓలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ట్రైనర్లు ఓబులాల్, జంగయ్య పాల్గొన్నారు.

## లారీని ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** మిర్యాలగూడ పట్టణ శివారు ఏడుకోట్ల తండా వద్ద నార్కట్‌పల్లి –అద్దంకి రాష్ట్ర రహదారిపై ఆర్‌టిసి బస్సు ప్రమాదానికి గురైంది. మంగళవారం ఉదయం నల్గొండ నుంచి వస్తున్న మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి గాయపడిన వారిని అంబులెన్స్‌లో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఈ ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. విషయం తెలుసుకున్న నల్లగొండ డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్య సిబ్బందికి సూచించారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ తరపున ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దేశిడి శేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ వేగవంతం : కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి,పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డిలు, ఇరిగేషన్ అధికారులు, భూసేకరణ అధికారులతో భూసేకరణ ప్రక్రియ,ప్రాజెక్టుల పురోగతిపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 2026 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మంజూరైన భూసేకరణ నిధులను అర్హులైన లబ్ధిదారులకు చెల్లించిన తర్వాత సంబంధిత భూముల రికార్డుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి అవార్డులను త్వరగా జారీ చేసి, ప్రాజెక్టుల పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పెండింగ్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వ నిధులు సద్వినియోగమయ్యేలా సేకరించిన ప్రతి గుంట భూమి ప్రజోపయోగానికి వచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి హాజరయ్యారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యం

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, పంటల మార్పిడితో పాటు రైతు సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మిర్యాలగూడ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కోనిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి కోరారు. మంగళవారం మిర్యాలగూడ మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఉన్న రైతు వేదికలో ప్రత్యేక రైతు నేస్తం, ఖేతీ బచావో అభియాన్‌పై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. రాబోయే యాసంగి సీజన్‌లో కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలైన పెసర్లు, మినుములు, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎఒ మేకల రుషేంద్ర మణి, సర్పంచ్ పి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎల్. వీరన్న, రైతు సంఘం అధ్యక్షులు ఎం.నర్సిరెడ్డి, ఎన్.వెంకటపాల్‌రెడ్డి, పిఎసిఎస్ సిఇఒలు బి.సతీష్, పి.నాగయ్య, ఐకెపి సిసి ఎం.ప్రవీణ్ రెడ్డి, ఎఫ్‌పీఓ ప్రతినిధులు వెంకన్న, రవి, రైతు నాయకులు నాగిరెడ్డి, జె.మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎఇఒలు ఎం.రమేష్, నల్లగంటి నాగయ్య, రూపావతి, పార్వతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** సామాజికవేత్త, ఇఎల్వీ ఫౌండేషన్ చైర్మన్ ఇఎల్వీ భాస్కర్‌పై కొంతమంది చేస్తున్న అసత్యపు ప్రచారాలు మానుకోవాలని ఫౌండేషన్ సభ్యులు బండమీది కిరణ్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఫౌండేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన సంపదలో 50శాతం ఫౌండేషన్ కోసం పేద ప్రజలకు సేవ చేయడానికే వీలునామా రాసి ఇచ్చిన వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని అన్నారు. నియోజకవర్గంలో పేద విద్యార్థులకు, ప్రజలకు ఆర్థికంగా ఆదుకుంటూ ప్రజల సమస్యలపై పని చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు ఎలిజాల శ్రీను, పట్నం బాలకృష్ణ, ఓర్సు విజయ్, గండి సునీల్, పందుల రవితేజ, రాసమళ్ళ ముత్యాలు, కంచర్ల ప్రేమ్‌దాసు, సికిమెట్ల హేమేందర్, వీరస్వామి, ప్రశాంత్, మురళి, వంశీ, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఓటు నమోదు కోసం పార్టీల పోటీ

● నవంబర్ 6తో ముగియనున్న గడువు

● ఓటు నమోదు పట్టభద్రుల భాద్యత అని సూచిస్తున్న ప్రజాస్వామ్యవాదులు




**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి రాజకీయ సందడి అప్పుడే మొదలైంది. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ప్రస్తుతం రాజకీయ పార్టీలకు, నాయకులకు ప్రధాన ఎజెండాగా మారింది. ఓటు నమోదుకు నవంబర్ 6వ తేది చివరి గడువు కావడంతో కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి నాయకులు పోటాపోటీగా పట్టభద్రులను కలుస్తూ ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేసే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటు నమోదు ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

**ఓటరు నమోదుపైనే పార్టీల దృష్టి**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ముందుగా అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడం అత్యంత కీలకమని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. దీంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు, ఉద్యోగులు, నిరుద్యోగ పట్టభద్రులను వ్యకిగతంగా కలుస్తున్నారు. ఓటరు నమోదుకు అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం గురించి వివరిస్తూ సహకరిస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా తమ పార్టీకి అనుకూలంగా ఉండే పట్టభద్రులను ఓటర్ల జాబితాలో చేర్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో తమ రాజకీయ బలాన్ని చాటుకోవాలని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు బ్యాంకును పెంచుకోవడమే లక్ష్యంగా ముందస్తు కార్యాచరణను అమలు చేస్తున్నాయి.

**కాంగ్రెస్ అభ్యర్థిగా సర్వోత్తమ్‌రెడ్డి**

నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా ఇప్పటికే మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని ప్రకటించింది. దీంతో కాంగ్రెస్ శ్రేణులు అభ్యర్థి విజయమే లక్ష్యంగా ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలని, ప్రతి గ్రామంలోనూ ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు సూచిస్తున్నారు. మరోవైపు బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు తమ అభ్యర్థులపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అభ్యర్థుల ప్రకటనకు ముందే ఓటరు నమోదుపై దృష్టి సారించడం ద్వారా ఎన్నికల సమాయానికి బలమైన పునాది ఏర్పాటు చేసుకోవాలని ఆయా పార్టీలు భావిస్తున్నాయి.

**ఎన్నికల నోటిఫికేషన్‌పై ఉత్కంఠ**

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన తుది ఎన్నికల నోటిఫికేషన్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటరు తయారీ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 6 వరకు ఫారం 18 ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు షెడ్యూల్ నిర్ణయించారు. దీంతో ప్రస్తుతానికి రాజకీయ పార్టీల ప్రధాన దృష్టి ఓటరు నమోదు ప్రక్రియపైనే కేంద్రీకృతమైంది.



## పిఎంశ్రీ పాఠశాలలో జిల్లా అకడమిక్ ప్యానెల్ బృందం ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** పట్టణంలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా అకడమిక్ ప్యానెల్ తనిఖీ బృందం మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఖాన్ అకాడమీ, డిజిటల్ లెర్నింగ్, ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలపై బృందం నోడల్ అధికారి పందిరి నర్సిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు, బృందం సభ్యులు మండవ ఉపేందర్, జాఫర్, బూర వెంకటేశ్వర్లు, సైదులు, జానకిరాములు, మండవ సైదులు, ఆనంద భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టంతో కఠిన శిక్షలు

● అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మైనర్లు అయిన బాలబాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించడానికి 2012వ సంవత్సరంలో ఫోక్సో చట్టం రూపొందించబడి అమలులోనికి వచ్చిందని ఆ చట్టం ద్వారా కఠిన శిక్షలు విధించబడుతాయని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని విజయ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ చట్టం ద్వారా ఎవరు ఫిర్యాదు చేసినా వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయన్నారు. అందువల్ల బాధితులు నిర్భయంగా తమకు జరిగిన అన్యాయాన్ని ఫిర్యాదు చేయవచ్చన్నారు. మైనారిటీ తీరని బాలిబాలికల సమ్మతితో ఏదైనా చట్ట వ్యతిరేకమైన పని చేసినట్లయితే ఆ సమ్మతి చట్ట ప్రకారం పరిగణించబడదని అది శిక్షార్హమేనని స్పష్టం చేశారు. బాలికల శారీరక అవయవాలను ఉద్దేశపూర్వకంగా అభ్యంతరకరంగా, అసభ్యకరంగా తాకినట్లయితే ఈ చట్టం ప్రకారం కఠిన శిక్షకు అర్హులవుతారని హెచ్చరించారు. అత్యవసర సమయాలలో బాల బాలికలు 1098, 112 లాంటి అత్యవసర సర్వీస్ నంబర్లకు నిర్భయంగా ఫోన్ చేయాలని సూచించారు. న్యాయ సహాయం కొరకు 1500 నంబర్‌కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నాగేష్ రాథోడ్, సైదా హుస్సేన్, చనగాని మహేష్, ఆసోజు రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత, కరస్పాండెంట్ సుందరి, న్యాయసేవ అధికార సంస్థ సిబ్బంది అనిత, సుశీల, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ సృష్టించిన కరువు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** రాష్ట్రంలో పంట పొలాలు ఎండిపోవడానికి ప్రధాన కారణం కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలేనని కాంగ్రెస్ సృష్టించిన కరువు తప్ప ప్రకృతి కరువు కాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ పొలాలు ఎండకుండా డిండి ఆయకట్టుకు రెండు దఫాలు నీళ్లు ఇచ్చి పంటలను కాపాడామని అన్నారు. స్వయంగా ఈ ప్రాంత ఎమ్మెల్యే రైతులకు ప్రాజెక్టు నీళ్లు విడిచి ఆశపెట్టి రైతులను నిట్టనిలువునా ముంచారని అన్నారు. ఎండిన పంటలకు నష్టపోయిన రైతులను ఎవరు ఆదుకుంటారో చెప్పాలని అన్నారు. బీమా, నెట్టెంపాడు, కోహెల్‌సాగర్ కెసిఆర్ హయాంలో పూర్తి చేశారని, కెఎల్‌ఐ ద్వారా నీళ్లు తెచ్చి డిండి రైతుల పంటలను కాపాడడంలో ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏది ఉన్నా లేకున్నా పాలన చేతకాకపోయినా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడేది ఎల్ నినో లేదంటే కెసిఆర్ మీద నిందలు వేయడం తప్ప మరేమి లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపనతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కానీ ప్రజలకు అర్థమైందని ప్రజలను బాగుచేసే ప్రభుత్వం కాంగ్రెస్ కాదని, ఇది కేవలం స్కాం, స్కీమ్‌ల ప్రభుత్వం అని ఇక కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఎంతో కష్టపడి నా కోసం పనిచేశారని, దురదృష్టవశాత్తు గెలవలేకపోయామని ఇప్పుడు అన్ని విధాలుగా అవకాశం ఉందని కచ్చితంగా పనిచేయాల్సిన అవసరం ఉందని రాకేష్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో చింతల వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాయకులు బిల్యానాయక్, రమేష్‌నాయక్, కిషన్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షులు టివిఎన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, రవికుమార్, అంజయ్య, వల్లపు రెడ్డి, దస్రు, శ్రీనివాసరావు, ప్రవీణ్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు, కృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

# గుట్టలో ప్రమాదకర ఫ్లెక్సీల కలకలం

● ఫ్లెక్సీలు తొలగించాలని కలెక్టర్‌కు స్థానికుల వినతి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై అక్రమంగా ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీ బోర్డులు ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ ఫ్లెక్సీలను వెంటనే తొలగించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కార్యాలయం ముందే ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు రాయగిరి నుంచి యాదగిరిగుట్ట వెళ్లే ప్రధాన రహదారిపై గతంలోనూ ఫ్లెక్సీల వల్ల పలు ప్రమాదాలు జరిగాయని స్థానికులు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం గేటు ఎదుట ఉన్న ఒక భారీ ఫ్లెక్సీ బోర్డు అకస్మాత్తుగా విరిగిపడి, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న స్థానిక నివాసి బింగి పాండురంగంపై పడింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమవ్వగా, స్థానిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు ఆయన తలకు 8 కుట్లు వేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ పరిణామంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**పట్టించుకోని మున్సిపల్ అధికారులు**

రహదారులు, ఫుట్‌పాత్లపై ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీ బోర్డుల గురించి మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ రోజు ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు, జనావాస ప్రాంతాల్లో ఉన్న అనుమతి లేని, ప్రమాదకరమైన ఫ్లెక్సీ బోర్డులను వెంటనే తొలగించాలి. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా మున్సిపల్ పరిధిలో అక్రమ ఫ్లెక్సీల నివారణకు శాశ్వత నిబంధనలు అమలు చేయాలి. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

● ఓటరు జాబితా పరిశీలకురాలు దేవసేన

**ప్రజాపక్షం/చండూరు/మునుగోడు :** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాల్సిన అవసరం ఉందని, ఇందులో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర చాలా ముఖ్యమని జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన అన్నారు. మంగళవారం చండూరు ఆర్‌డిఒ, మునుగోడు ఇఆర్వో కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజలకు ఇబ్బంది లేకుండా సాగడంలో అధికారులతో పాటు రాజకీయ పార్టీల పాత్ర కీలకమని, అధికారులతో కలిసి పనిచేయాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ మునుగోడులో ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా జరిగిందని, ప్రతి వారం సమావేశాలు నిర్వహించి తమ సందేహాలను ఇఆర్వో, ఆర్‌డిఒ ఎప్పటికప్పుడు నివృత్తి చేశారని, ఇఆర్వో, ఎఇఆర్వోలు బాగా కృషి చేశారని అభినందించారు. కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో అన్ని హియరింగ్స్ పూర్తి చేశామని, ఫారం 6, 7, 7ఎలను పరిశీలించామని, అన్ కలెక్టెడ్ ఫారాలను బిఎల్ఎల సమక్షంలో పరిశీలించామని తెలిపారు. అభ్యంతరాల పరిష్కారానికి నవంబర్ 5 చివరి తేదీ అని, నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, నల్లగొండ ఆర్‌డిఒ వై.అశోక్‌రెడ్డి, మిర్యాలగూడ ఆర్‌డిఒ రమణారెడ్డి, చండూరు ఆర్‌డిఒ, మునుగోడు ఇఆర్వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



**జాగ్రత్తగా కొత్త ఓటర్ల జాబితా మార్పు చేర్పులు..**

కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో తొలగింపులు, మార్పు చేర్పులను జాగ్రత్తగా పరిశీలించి చేయాలని జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన బిఎల్ఒలకు సూచించారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 171వ పోలింగ్ కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ బి.చంద్రశేఖర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ పద్మతో ముఖాముఖి మాట్లాడి ఎస్ఐఆర్ నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన ఓటర్లకు హియరింగ్ తర్వాత వారి పేరు జాబితాలో ఉందో లేదో ఇంటికి వెళ్లి తెలియజేస్తున్నామని కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, చండూరు ఆర్‌డిఒ శ్రీదేవి, మునుగోడు తహసీల్దార్ నేలపట్ల నరేష్, ఆర్ఐ వంశీ, జీపీఓ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చట్టానికి లోబడి నడుచుకోవాలి

● ఎస్‌పి నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రతి పౌరుడు పోలీసు త్యాగాలకు గుర్తుగా ప్రతి ఒక్కరు సత్‌ప్రవర్తనతో చట్టానికి లోబడి నడుచుకోవాలని ఎస్‌పి కె.నరసింహ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో పోలీసు అమరవీరుల సంస్మరణ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను, పోలీసులుచేసే కఠినతరమైన విధులను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో నిర్వహించినట్లు వివరించారు. ప్రతి పౌరుడు పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, అర్మ్‌డ్ డిఎస్‌పి నరసింహ చారి, సిఐలు రాజశేఖర్, వెంకటయ్య, రామారావు, శివకుమార్, ఆర్‌ఐలు నారాయణ రాజు, ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్‌ఎస్ఐ సురేష్, ఎస్ఐలు, యువత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు చిరస్మరణీయం



ఎస్‌పి శరత్ చంద్ర పవర్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా దేశం కోసం, ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి పట్టణంలో బైక్ ర్యాలీని ఎస్‌పి శరత్ చంద్ర పవార్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం 154 మంది, మన తెలంగాణలో నలుగురు పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలు చిరస్మరణీయమని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం, పోలీసుల సేవలు, విధి నిర్వహణలో వారు ఎదుర్కొనే సవాళ్లపై ప్రజల్లో అవగాహన కల్పించడం అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్, 12వ బెటాలియన్ అడిషనల్ కమెండెంట్ నాగేశ్వరావు, నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం

**ప్రజాపక్షం/కోదాడ :** విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడంతోపాటు ప్రాణాపాయంలో ఉన్న చిన్నారులకు అండగా నిలిచేలా పోలీసులు సేవా స్ఫూర్తిని చాటారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం మంగళవారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోదాడ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు 200 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పట్టణ సిఐ శివశంకర్, రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి, మునగాల సిఐ ప్రతాప్‌లింగం, హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు, సబ్ డివిజన్‌కు చెందిన ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మొగుళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో గ్రామ పంచాయతీ, అంగన్వాడీ, మహిళా సమైక్య భవనాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.
మొగుళ్లపల్లి మండలంలోని కొరికిశాల గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు, బద్దంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇప్పలపల్లి, పర్లపల్లి గ్రామాలతో పాటు మొగుళ్లపల్లి మండల కేంద్రంలో మహిళా సమైక్య భవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరువు జిల్లాగా హనుమకొండను ప్రకటించాలి: ఎన్ఎ స్టాలిన్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎల్ నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో కరువు జిల్లాగా హనుమకొండ జిల్లాను, అన్ని మండలాలను ప్రకటించి ఆదుకోవాలని, అదేవిదంగా కరువు పరిస్థితులలో ఒక్కరికీ 12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసర వస్తువులు చౌక దుకాణాల ద్వారా సరఫరా చేయాలని పాలక వర్గాలను సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ డిమాండ్ చేశారు. మంగళవారం రామారంలోని ఒఆర్ఆర్ బ్రిడ్జి శాఖ సిపిఐ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న తీవ్రమైన కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, కరువు జిల్లాగా హనుమకొండ జిల్లాను అన్ని మండలాలను ప్రకటించి ఆదుకోవాలని, అదేవిదంగా చౌకధరల దుకాణాల ద్వారా ప్రస్తుతం అందిస్తున్న ఒక్కరికీ 6 కిలోల బియ్యానికి తోడు మరో 6 కిలోల బియ్యం కలిపి మొత్తం 12 కిలోల బియ్యం, అదేవిదంగా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని, నష్టపోయిన పంటలకు, రైతులకు నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని, కరువు వలన పని కోల్పోతున్న అసంఘటిత కార్మికులకు ప్రత్యేక పథకం ద్వారా ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం, నాయకులు పార్వతం భాగ్య, రాగల్ల ప్రభాకర్, గోల్కొండ సారయ్య , గడ్డం సారయ్య, వంకుడోతూ రాజు కుమార్, జన్ను మంజుల, భోగం అనురాధ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిలో విద్య, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కెజిబివి) ఆకస్మికంగా సందర్శించిన ఆయన విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, పారిశుధ్యం, విద్యాబోధన తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల వంటగదిని సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు తయారు చేస్తున్న ఆహార పదార్థాలు, భోజన మెనూ వివరాలను వం ట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేలా క్రమం తప్పకుండా చదవాలని సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.లలిత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, విద్యాబోధన, పాఠశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల విద్యార్థుల విషయాలవారీగా అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల తరగతి హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతిరోజూ నిర్ణీత మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డులను సమర్థంగా వినియోగించుకోవాలని, ఆధునిక బోధనా పద్ధతులతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు సెలవు పెట్టాల్సి వస్తే తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే వెళ్లాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా బోధన సాగిస్తూ, వారికి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో కమ్యూనిటీ మొబైల్ అధికారి సామల రమేష్, ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి, గణపతి, శైలజ, కెజిబివి ప్రత్యేక అధికారి స్వప్నతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

నెల్లికుదురులో రూ.7.50 కోట్ల వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కేసముద్రం/మహబూబాబాద్:** రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, అలాగే మహబూబాబాద్ జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారని రాజ్యసభ సభ్యులు వేం నరేపందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో సుమారు 7.50 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న 'తెలంగాణ పబ్లిక్ స్కూల్ నూతన భవన నిర్మాణానికి, కేసముద్రం మహమూద్ పట్నంలో కెజిబివి కళాశాల నూతన భవనాన్ని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ & డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి వారు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సభల్లో వారు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే కేసముద్రం మండల కేంద్రాన్ని రూ. 500 కోట్లతో ఫోర్‌వే రోడ్లు, డివైడర్లతో అభివృద్ధి చేశామని, అదే బాటలో ఇప్పుడు నెల్లికుదురును తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. చారిత్రక నెల్లికుదురు రంగస్వామి దేవాలయ అభివృద్ధికి వెంటనే రూ. 1 కోటి ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. 1.2 కిలోమీటర్ల మేర ఫోర్‌వే రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులతో పాటు అంబేద్కర్ కూడలిని సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. ఇక విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల కోసం బొద్దుగొండలో శరవేగంగా నిర్మిస్తున్న రాష్ట్రంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వచ్చే జూన్ 12న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు, అదేవిధంగా కార్పొరేట్‌కు దీటుగా రూ. 7.50 కోట్ల వ్యయంతో నెల్లికుదురులో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వారు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో కెజిబివిల ఆధునీకరణతో పాటు ఉన్నత విద్య కోసం జెఎన్‌టియు, కేసముద్రంలో 70 కోట్ల రూపాయలతో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటవుతున్నాయన్నారు.



మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు 200 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులు ప్రారంభమయ్యాయని, నెల్లికుదురులో రానున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ప్రీప్రైమరీ బ్లాక్, డిజిటల్ తరగతులు అందుబాటులోకి వస్తాయన్నారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా రాష్ట్రంలోనే టాప్ 5లో నిలిచిందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ కోరారు.

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం:** భవన ప్రారంభోత్సవం అనంతరం ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఎస్‌పి నేరుగా విద్యార్థినుల భోజనశాలకు వెళ్లి వారితో పాటు కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి చదువు, లక్ష్యాలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి డాక్టర్ శబరిష్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, తొర్రూరు ఆర్.డి.ఒ గణేష్, వెంకన్న, శ్రీకాంత్ రెడ్డి, జ్యోతి, గాయత్రి, చందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, యాదవ రెడ్డి అరుణ్, తహసీల్దార్ నరేష్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి నాయకులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నరేందర్ రెడ్డికి ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/నెక్కొండ:** స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్న కేశవులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం కేసముద్రం మండల కేంద్రంలో ఆయనను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మృతి చెందిన రైతు కుటుంబానికి రూ. 2 లక్షల బీమా చెక్కు అందజేత




**ప్రజాపక్షం/గూడూరు:** ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతు కుటుంబానికి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసి) అండగా నిలిచింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గాజులగట్టు గ్రామానికి చెందిన రైతు కంచె సునిల్ గత ఫిబ్రవరి నెలలో ప్రమాదశాత్తు చెరువులో పడి మృతి చెందారు.సునిల్ స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ద్వారా పంట రుణం పోంది ఉండటంతో ఆయనకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్( జిపిఎ) ఇన్యూరెన్స్ వర్తించింది. దీని ఆధారంగా డిసిసిబి వరంగల్ బ్యాంక్ మంజూరు చేసిన రూ 2లక్షల ప్రమాధ బీమా చెక్కును బాధిత కుటంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో డిసిసి బ్యాంక్ సిఇఒ వజీర్ సుల్తాన్ గూడూరు పిఎస్ఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి డిసిసి జనరల్ మేనేజర్ ఉష డిప్యూటి జనరల్ మేనేజర్ అశోక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మధు కృష్ణమోహన్ రాజు స్రవంతి తదితరులు పాల్గోన్నారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ సహకార సంఘూల ద్వారా రుణాలు పోందిన రైతులకు ఏదైనా ఆపద సంభవిస్తే బీమా పథకాలు వారి కటుంబాలకు కొండంత అండగా నిలుస్తాయని బ్యాంక్ అధికారులు పేర్కోన్నారు.

## కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయింపు

కలెక్టర్, డిసిసిబి పర్సన్-ఇన్‌ఛార్జి చాహత్ బాజ్‌పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, డిసిసిబి పర్సన్ఇన్‌ఛార్జి (పిఐసి) కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి ప్రకటించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజనసభ సమావేశం హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, బ్యాంకు పర్సన్‌ఇన్‌ఛార్జి (పిఐసి) కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. బ్యాంకు ఒఎస్‌డి వెంకటేశ్వర్లు, జిఎం ఉషాశ్రీ, ఇతర బ్యాంకు అధికారులు, పిఎసిఎస్ అధ్యక్షులు, ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ సర్టిఫికేషన్, వార్షిక ఆర్థిక నివేదికలు, బ్యాలెన్స్ షీట్, లాభనష్టాల ఖాతా, నికర లాభాల వినియోగం ఆడిటర్ల నియామకం వంటి అంశాలను పరిశీలించారు. బ్యాంకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.10.23 కోట్ల నికర లాభాన్ని సాధించగా, సభ్య పిఎసిఎస్ లకు రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటించారు. కలెక్టర్ 50 శాతం కంటే ఎక్కువ రికవరీ సాధించిన అర్హత గల సొసైటీలకు రూ.50 లక్షల వరకు, మిగిలిన ఎ, బి కేటగిరీ ఆడిట్ ర్యాంకింగ్ సొసైటీలకు రూ.30 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాల (ఎల్ టి లోన్స్) సదుపాయం కల్పించే అంశాన్ని వెల్లడించారు. రుణ బకాయిదారులకు ఉపశమనం కల్పించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఒటిఎస్) పథకాన్ని 31 మార్చి 2027 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు శాఖల విస్తరణలో భాగంగా భూపాలపల్లి, ములుగు, ఘనపూర్ శాఖల భవన నిర్మాణాలకు స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు. గూడూరు బ్రాంచ్‌కి చెందిన కస్టమర్ కంచె సునీల్ ప్రమాద మరణ బీమా క్లెయిమ్ కింద రూ.2 లక్షల పరిహార చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కొన్ని సొసైటీల ప్రతినిధులు బ్యాంకు అనుబంధం గురించి లేవనెత్తిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్ ఎన్. రవి, పిఐసి కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. సహకార సంఘాల ఆర్థిక బలోపేతం, రుణ సదుపాయాల విస్తరణ, రికవరీ మెరుగుదల రైతులకు మెరుగైన సేవలు అందించడంపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డిసిఒలు బి. మోహన్, మహ్మద్ వజీర్ సుల్తాన్, నిరజ, వల్యా నాయక్, సర్దార్ సింగ్ డిడిఎం చంద్రశేఖర్, పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులు మండలాల్లోనే అందుబాటులో ఉండాలి

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** అర్నబ్ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో తుఫాన్ ప్రభావం, ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. అక్టోబర్ 28 ఉదయం నుండి 29 ఉదయం వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయని తెలిపారు. 30వ తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు మూడు రోజుల పాటు తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని, రాత్రి వేళల్లోనూ సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. రైతులకు పంటల రక్షణపై ముందస్తు సూచనలు అందించాలని, వరద ముప్పున్న ప్రాంతాల్లో గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది 24గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. జంపన్నవాగు, దయ్యాలవాగు, జీడివాగు, గుండ్లవాగు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, చెరువు కట్టలు, లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన చోట రాకపోకలను నియంత్రించాలని, విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏటూరునాగారంలో సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజలు ఉరుములు, మెరుపుల సమయంలో పక్కా భవనాల్లో ఆశ్రయం పొందాలని, చెట్ల కింద నిలబడవద్దని, వాగులు, వరద ప్రవాహాలను దాటేందుకు ప్రయత్నించవద్దని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావుతో పాటు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ:** విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి సిడబ్ల్యూస్ఎన్ ఆటలు, క్రీడా పోటీలను నిర్వహించగా కలెక్టర్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనసులో ఆందోళన బాధలు ఉన్నప్పటికి క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం పొందచ్చునని, ఆటలు, క్రీడలు, ఆడటం ద్వారా ఉత్సాహంగా, సానుకూల దృక్పధంతో పనులు చేయగలుగుతారన్నారు. క్రీడలు, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని మెరుగు పరుస్తాయన్నారు. చిన్న వయసు నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, వారి కృషి ఫలితంగానే జనగామ జిల్లా విద్యారంగంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి ప్రభుత్వ పాఠశాలల్లో మూడు వేల మంది విద్యార్థులు అదనంగా చేరారని, ఇది ఉపాధ్యాయుల కృషికి నిదర్శణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా, క్రీడా సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చెస్, క్యారమ్, టెన్నిస్ వంటి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. చెస్ ఆడడం వలన ఆలోచనా సామర్థ్యం గణిత నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం మెరుగు పడతాయన్నారు. తల్లిదండ్రులు తమ పల్లిలను కేవలం చదువులకే పరిమితం చేయకుండా కనీసం ఒక క్రీడలోనైనా నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. చదువుకు ఇచ్చే ప్రాధాన్యతతో పాటు క్రీడాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆ కార్యక్రమంలో విద్యాశాఖ ఎడి శ్రీనివాస్, ఎస్జీఫ్ కార్యదర్శి గోరేసింగ్, సిఎంఓ యాదగిరి పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అదనపు ట్రైనీ కలెక్టర్, ఇన్‌చార్జి తహసీల్దార్ రోహిత్‌ను ఉమ్మడి కరీంనగర్–హనుమకొండ జిల్లాల రైతు రక్షణ సమితి అధ్యక్షుడు ఇంగె భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోహిత్‌కు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంగె భాస్కర్ మాట్లాడుతూ, రోహిత్ ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నంతకాలం మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సకాలంలో పరిష్కరిస్తూ, ప్రభుత్వపరంగా వారికి అందాల్సిన సేవలు సజావుగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, కోదాటి మాధవరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ సైకిల్ ర్యాలీ



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సైకిల్ ర్యాలీ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే సందేశాన్ని చాటింది. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎన్ పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రై సిటీ లోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ వారికి అంకితమైన ఘనమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా, 89 సంవత్సరాల వయస్సులోనూ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మామిడి నర్సయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏఆర్ అదనపు డిసిపిలు వి.శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, హనుమకొండ ఎసిపి నర్సింహారావు, సిఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు త్యాగాలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ములుగు:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌పి కేకాన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి నిస్వార్థ సేవలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఆపరేషన్స్ రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్ తిరుపతి సమన్వయంతో నిర్వహించారు. అదనపు ఎస్‌పి సదానందం, రవీందర్, సిఐలు దారం సురేష్, కుమార్, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, క్యూఆర్‌టి ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

“సూపర్‌స్టార్ రజనీకాంత్ ‘ధర్మన్’ సినిమా నుంచి మేకర్స్ మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో లేడీ సూపర్‌స్టార్ నయనతార చేరినట్లు ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. రజనీకాంత్, నయనతార మరోసారి జతకట్టడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.”



# షారూక్ ఖాన్ ‘కింగ్’ పోస్టర్ రిలీజ్




‘కింగ్’ మూవీ నుంచి కొత్త పోస్టర్‌లో యాక్షన్ లుక్‌తో షారూక్ ఖాన్ అదరగొడుతున్నారు. పెదాల మధ్య గులాబీ పువ్వు.. నిప్పులు చెరిగే కంటి చూపు.. ఇలా పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ ‘కింగ్’ కొత్త పోస్టర్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్స్‌తో పాటు రొమాన్స్ టచ్‌తో రూపొందుతోన్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో షారుఖ్ ఎలా కనిపించబోతున్నారో ఈ పోస్టర్ ఓ చిన్న గ్లింప్స్ ఇచ్చింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాపై కొత్త పోస్టర్ మరింత అంచనాలను పెంచుతోంది. భారీ యాక్షన్, పవర్‌ఫుల్ లుక్‌తో ఆకట్టుకుంటోన్న ఈ పోస్టర్.. వెండితెరపై షారుఖ్ ఖాన్‌ను సరికొత్త అవతార్‌లో చూడాలనే ఆసక్తిని అభిమానుల్లో మరింత పెంచుతోంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్ఫ్లిక్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ‘కింగ్’ చిత్రం డిసెంబర్ 24 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ ఎత్తున విడుదలవుతుంది. ఈ సినిమాలో షారుఖ్ సరసన దీపికా పదుకొనె హీరోయిన్‌గా నటిస్తోంది. ఇతర పాత్రల్లో అభిషేక్ బచ్చన్, జాకీ ష్రాఫ్, అనిల్ కపూర్, కరీనా కపూర్, రాణి ముఖర్జీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుద్ రవిచందర్ , సచిన్ జిగర్, సచిన్ సాంగ్వి , జిగర్ సరైయ్య సంగీత దర్శకులుగా పని చేస్తున్నారు.

# ఇక నటనపైనే దృష్టి

కె. దివ్యవాణి చౌదరి

సినిమా రంగంలో ‘బాపు బొమ్మ’గా... టివి రంగంలో ‘పుత్తడిబొమ్మ’గా సుప్రసిద్ధురాలైన దివ్యవాణి... రాజకీయాల్లోకి వెళ్లి సినిమాకు దూరమైయ్యారు. అయితే ఇకపై రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ సినిమా రంగంపై దృష్టి సారించాలని దృఢ నిశ్చయం తీసుకున్నానని చెబుతున్నారు. కొంతకాలం తెలుగు దేశం పార్టీలో పని చేసిన ఆమె సినిమాకు దూరంగా ఉన్నారు. కానీ తెలుగుదేశం అధికారంలోకి వచ్చినా కూడా ఆమెకు ఎలాంటి పదవి రాకపోవడంతో తిరిగి సినిమాలు చెయ్యాలని దివ్యవాణి నిర్ణయించుకున్నారు. ‘పెళ్ళి పుస్తకం, ఎదురింటి మొగుడు పక్కింటి పెళ్ళాం’ వంటి చిరస్మరణీయ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో స్థిర స్థానం సంపాదించుకున్న దివ్యవాణి... ‘పుత్తడి బొమ్మ’ టివి సీరియల్ తోనూ ఉర్రూతలూగించారు. కన్నడలోనూ పలు చిత్రాల్లో నటించి అక్కడి ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలైన ఈ అందాల భామ కన్నడ అనర్గళంగా మాట్లాడతారు. ఈ పాన్ ఇండియా యుగంలో రెండు మూడు భాషల్లో పాపులారిటీ కలిగిన ఆర్టిస్టులకు దర్శకనిర్మాతలు పెద్ద పీట వేస్తున్న నేపథ్యంలో దివ్యవాణి మళ్లీ సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపారు.






# 13న వస్తున్న ‘చంద్రయాన్’

రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో ‘చంద్రయాన్’ టైటిల్ తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్కీన్ స్టోరీస్ బ్యానర్‌పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన ‘చంద్రయాన్’ సినిమా నవంబర్ 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. చంద్రయాన్ సినిమా రాకెట్ రివీల్ ఈవెంట్‌ను డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి అతిథిగా హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకులు వేణు ఊడుగుల మాట్లాడుతూ ఈ సినిమా చూసిన తర్వాత నచ్చి ప్రెజెంటర్‌గా ఉండేందుకు ముందుకొచ్చాను. ప్రాణం పెట్టి సినిమా కోసం పనిచేశారు. ఇంట్లో కూతురి పెళ్లి చేస్తే ఎంత ప్రేమతో చేస్తారో, అలాంటి ప్రేమతో ప్యాషన్‌తో ఈ సినిమా రూపొందించారు. ఈ సినిమా ప్రమోషన్ కోసం కూడా అంతే ఆరాటపడుతున్నారు. శివకుమార్ ప్రతిభావంతుడు. ఆయన ఫ్యూచర్‌లో మరిన్ని మంచి మూవీస్ చేయబోతున్నాడు. ఇలాంటి మంచి కాన్సెప్ట్ మూవీని ఎంకరేజ్ చేసిన నిర్మాత ప్రవీణ్‌ని అభినందిస్తున్నా. ఇలాంటి వినూత్నమైన సినిమా వస్తుందంటే కారణం ప్రవీణ్ . డైరెక్టర్ శ్రీనాథ్ మంచి స్క్రిప్ట్ చేసుకున్నారు. ఎంతో ఇన్నోసెన్స్ ఉన్న సినిమా ఇది. లాజిక్స్ ఉండవు. సెన్స్ ఉండని నాన్ సెన్స్ కామెడీ ఉంటుంది. కానీ వెరీ సెన్సిబుల్ మూవీ ఇది. హానెస్ట్ గా తీసిన చిత్రమిది. చంద్రయాన్ భారత్ సత్తాను ప్రపంచానికి ఎలా చాటిందో ఈ చంద్రయాన్ వీళ్లందరి ప్రతిభను ఇండస్ట్రీకి తెలియజేస్తుందని నమ్ముతున్నాను అన్నారు. కొరియోగ్రాఫర్ బాబా మాస్టర్ , డిఒపి శ్రీనివాస. బి. మ్యూజిక్ డైరెక్టర్ హర్ష ప్రవీణ్ , నటుడు లోకేష్ నటుడు రవి శివతేజ , హీరోయిన్ స్వప్న ప్రియదర్శిని, ప్రొడ్యూసర్ ప్రవీణ్ మొలక , డైరెక్టర్ శ్రీనాథ్ చంద్రశేఖర్, హీరో శివకుమార్ ధీకొండ డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ‘ధర్మన్’లో నయనతార

సూపర్‌స్టార్ రజనీకాంత్ ‘ధర్మన్’ సినిమా నుంచి మేకర్స్ మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో లేడీ సూపర్‌స్టార్ నయనతార చేరినట్లు ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. రజనీకాంత్,



నయనతార మరోసారి జతకట్టడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ సమర్పణలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌ను కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తుండగా, అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో రజనీకాంత్ ఓ మిస్టీరియస్ డాక్టర్‌గా, చేతిలో రక్తపు మరకలున్న స్కాల్‌పెల్‌తో ‘ది డెడ్లీ డాక్టర్’ అనే విభిన్నమైన అవతార్‌లో కనిపించారు. రజనీకాంత్, నయనతార కలిసి నటించడం ఇది ఐదోసారి. గతంలో వీరిద్దరూ ‘చంద్రముఖి’, ‘కథానాయకుడు’, ‘దర్బార్’, ‘పెద్దన్న’ సినిమాల్లో కలిసి నటించారు. ఇప్పుడు ‘ధర్మన్’తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఈ క్రేజీ పెయిర్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రదీప్ ఈ. రాఘవ్ ఎడిటింగ్. ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బరివ్ ఈ సినిమా యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందిస్తున్నారు.

# దిల్ రాజు చేతికి ‘వృషకర్మ’



ఎపి, తెలంగాణ, కర్ణాటక రైట్స్

నాగచైతన్య ప్రతిష్టాత్మక మైథలాజికల్ థ్రిల్లర్ ‘వృషకర్మ’ ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఎస్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. తాజాగా ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ ద్వారా ‘వృషకర్మ’ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ రైట్స్‌ను ఫ్యాన్సీ ధరకు సొంతం చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో దిల్ రాజు సినిమాపై ఆయనకున్న నమ్మకాన్ని, ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్‌పై ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోంది. ఇప్పటికే విడుదలైన బిటిఎస్ గ్లింప్స్, పోస్టర్లు సినిమాపై మంచి ఆసక్తిని పెంచాయి. ఈ సినిమాలో నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. రగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్, నవీన్ నూలి ఎడిటింగ్ .నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా, ఆయన కెరీర్‌లోనే అత్యధిక ప్రీరిలీజ్ బిజినెస్‌ను కూడా సాధించింది.

# ‘భోగి’ డబ్బింగ్ పూర్తి చేసిన అనుపమ

శర్వానంద్ హీరోగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర–ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె.రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కందుల సులోచన రాణి పాత్రలో ఆమె ఫస్ట్ లుక్, పాటల్లో ఆమె ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి మరో హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. ఈ సినిమా నవంబర్ 12న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.




# వరంగల్ పర్యాటక సర్క్యూట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

- ‘ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్– 2026’లో సిల్వర్ బన్యన్ పురస్కారం
- కాకతీయ వారసత్వం, రామప్ప ఆలయం, లక్నవరం, బొగత జలపాతానికి దక్కిన గౌరవం




ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. వరంగల్ పర్యాటక సర్క్యూట్‌కు ‘ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్–2026’లో హెరిటేజ్ టూరిజం విభాగంలోని ‘బెస్ట్ టూరిస్ట్ సర్క్యూట్, బెస్ట్ టూరిస్ట్ ట్రైల్’ కేటగిరీలో సిల్వర్ బన్యన్ అవార్డు లభించింది. సోమవారం న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాకతీయుల ఘన చరిత్ర, ప్రాచీన దేవాలయాలు, ప్రకృతి అందాలు, గిరిజన సంస్కృతి, చేనేత సంప్రదాయాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానించినందుకు వరంగల్ సర్క్యూట్‌కు ఈ గుర్తింపు లభించింది. వరంగల్ కోట, కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయంతోపాటు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం ఈ సర్క్యూట్‌లో ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. చారిత్రక కట్టడాలతోపాటు లక్నవరం సరస్సు, సస్పెన్షన్ బ్రిడ్జి, దీవులు, బొగత జలపాతం ఈ పర్యాటక మార్గానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం కలగలిసిన ఈ ప్రాంతాలు పర్యాటకులకు విభిన్న అనుభూతులను అందిస్తున్నాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి మార్గదర్శకత్వంలో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. తాజాగా లభించిన అవార్డు తెలంగాణ పర్యాటక రంగానికి మరింత గుర్తింపు తీసుకురావడంతోపాటు రాష్ట్ర చారిత్రక సంపద, ప్రకృతి అందాల ప్రాచుర్యానికి దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# కెటిఆర్ పాస్‌పోర్టు జప్తుపై యథాతథస్థితి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫార్ములా ఈకార్ రేసు కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పాస్‌పోర్టు జప్తు వ్యవహారంపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పాస్‌పోర్టు జప్తునకు సంబంధించి జారీ చేసిన ప్రొసీడింగ్స్, షోకాజ్ నోటీసుపై నవంబరు 6 వరకు యథాతథస్థితి కొనసాగించాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి, ఏసిబి అధికారులకు నోటీసులు జారీ చేసింది. చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత కోర్టు అనుమతి లేకుండా పాస్‌పోర్టు కార్యాలయానికి పాస్పోర్ట్ జప్తు కోసం లేఖ రాయడాన్ని సవాల్ చేస్తూ కెటిఆర్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తదుపరి విచారణ నవంబరు 6కు వాయిదా పడింది.







# ప్రత్యేక సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

నిపుణులను సదస్సుకు ఆహ్వానించాలని సిఎం సూచన. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావంతో తలెత్తుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనేందుకు వివిధ దేశాలు చేపడుతున్న చర్యలు, అనుసరిస్తున్న విధానాలపై ఈ వేదికగా ప్రత్యేక చర్చలు చేపట్టాలన్నారు. ప్రధానంగా వర్షాభావం, నీటి కొరత, వ్యవసాయ సంక్షోభం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, విద్యుత్ అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన ముందస్తు చర్యలను ప్రపంచ వేదికపై వివరించాలని, ఇతర దేశాల్లో విజయవంతమైన విధానాలు, ఆధునిక సాంకేతిక పరిష్కారాలు, అంతర్జాతీయ అనుభవాలను అధ్యయనం చేసేలా సెమినార్ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సిఎం సూచించారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు పర్యావరణ అనుకూల పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధి అంశాలకు సదస్సులో ప్రాధాన్యమివ్వాలన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ‘రక్షా ఎక్స్‌పో–2026, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్టప్‌ల ప్రదర్శనలు, పారిశ్రామిక విధానాల ఆవిష్కరణలు, పెట్టుబడి భాగస్వామ్య ఒప్పందాలకు వేదిక కావాలని సిఎం చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్‌లో రక్షా ఎక్స్‌పో కర్టెన్ రైజర్ నిర్వహణ, అక్టోబర్ 29న న్యూఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమం, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలను తెలంగాణకు ఆహ్వానించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సిఎం తెలిపారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com